# కథా మంజరి

పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

© Copyright 2020 - Editorial Board Kathamanjari

కథ



# ఫిబ్రవరి 2022 సంచికకు

# స్వాగతం

# కథామంజరి శ్రావ్య సంచిక

ఈ సంచికలో 'గళ' సహకారం అందించిన కళాకారులు –

- శ్రీ వెంపటి కామేశ్వర రావు గారు
- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు

## ఈ నెల శ్రావ్య సంచిక కోసం

**ఇక్కడ నొక్కండి**

శ్రావ్య సంచికను SUBSCRIBE చేయడానికి ఇక్కడ నొక్కండి

# శ్రీ శుభకృత్ నామ ఉగాది సందర్భంగా

# శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ

కథామంజరి

వచ్చే ఉగాది సందర్భంగా ఓ వినూత్నమైన కథాంశం మీద కథల పోటీ నిర్వహిస్తున్నాం. కాదేదీ 'కథ'కు అనర్హం.. అన్నట్టు, ఏ అంశం మీదైనా సరే కథలను సృష్టించే సృజనాత్మకత రచయితలలో ఉంటుంది. అటువంటి సృజనాత్మకతతో, పాఠకుల్లో చైతన్యం కలిగించేలా, ఈ ప్రత్యేక అంశం మీదనే కథలను పాఠకులకు అందించాలనే ఉద్దేశంతో ఉగాది కథల పోటీని నిర్వహిస్తున్నాం.

## కథాంశం: సమకాలీన రాజకీయ, సామాజిక చైతన్యం


| | |
|---|---|
| మొదటి బహుమతి | ₹ 5116/- |
| ద్వితీయ బహుమతి | ₹ 3116/- |
| తృతీయ బహుమతి | ₹ 2116/- |
| 12 ప్రోత్సాహక బహుమతులు | ₹ 516/- |

**కథలు చేరడానికి ఆఖరు తేదీ 05.03.2022**

అతి ముఖ్య నిబంధన: కథాంశం సున్నితమైనది. సమకాలీన పరిస్థితుల నేపధ్యంలో.. వాస్తవిక పరిస్థితులు ప్రతిబింబించేలా మంచి, చెడు .. దేని గురించైనా రాయవచ్చు. ఐతే.. కథా విషయాన్ని చర్చించే ప్రయత్నంలో ఏ రాజకీయపార్టీల పేర్లని, వ్యక్తుల పేర్లని ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా ప్రస్తావించకూడదు. అంతర్లీనంగా కథ ఉండాలి. ఈ నిబంధన అతిక్రమణ జరిగినట్టుగా కథామంజరి భావిస్తే, ఆ కథలను పోటీలో పరిగణకు తీసుకోవడం జరగదు. ఇందులో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

పోటీకి వచ్చిన కథలలో కొన్ని సాధారణ ప్రచురణ స్వీకరించి, పోటి ఫలితాలతో పాటు ప్రకటింపబడతాయి. అలా స్వీకరించిన కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకునే వెసులుబాటు లేదు. ఈ సూచనను రచయిత(త్రి)లు గమనించమని కోరుతున్నాం

మిగిలిన సాధారణ నిబంధనల కోసం ఇక్కడ నొక్కండి



**ఈ పోటీలో కథకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.**

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథాకీయం | | iii |
| IV | విశిష్ట అతిథి | | v |
| V | కథా మార్గదర్శి | | vii |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
| 1 | అబ్రాహ్మణీయం | గంటి రమాదేవి | 1 |
| 2 | అత్తమ్మ | కొమ్ముల వెంకట సూర్యనారాయణ | 8 |
| 3 | తరం తరం నిరంతరం | పద్మావతి రామభక్త | 12 |
| 4 | భగవాన్.. నన్ను క్షమించు | కంఠస్ఫూర్తి విజయకనకదుర్గ | 18 |
| 5 | దేవకాంచనం | వడ్లమాని మణి | 24 |
| 6 | ఏకాగ్రత | డా. శ్రీదేవి శ్రీకాంత్ | 29 |
| 7 | రంగు కాగితం | కుంతి | 35 |
| 8 | మా అమ్మ | సింహప్రసాద్ | 41 |
| 9 | చివరి కోరిక | సి. హెచ్. నాగార్జున శర్మ | 49 |
| 10 | ఇది అంతే | పి.ఎల్.ఎన్. మంగారత్నం | 55 |
| తిలక్ గారి కథలు... ఎక్కువగా ముసుగులు తొడుక్కున్న అసలు మొహాల్ని వెలికితీస్తాయనే ఓ కితాబుతో పాటు, స్త్రీ పాత్రలు మృదువుగా, ఉన్నతంగా, సుస్వభావంతో ఉంటాయని విశ్లేషకులు అంటారు. ఆ రెండు స్వభావాలని అతి హృద్యంగా తెలియచేసే కథ "దొంగ".. కథామంజరి పాఠకుల కోసం...! | | | |
| 11 | దొంగ | దేవరకొండ బాలగంగాధర తిలక్ | 59 |



# మా జట్టు

## సాంకేతిక సహకారం

harbinger
PUBLISHING

## బొమ్మలు

శ్రీ కొయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ సూరంపూడి చలపతిరావు

శ్రీ 'వసంత' కృష్ణ

## సంపాదక సహకారం

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు


శ్రీ కృపాకర్ పోతుల

# కృతజ్ఞతలు

# ఈ సంచిక దాత

పేరు ప్రకటనకి ఇష్టపడని ఓ

**కథాభిమాని**







# “కథా” కీయం

సాహితీ ప్రక్రియల్లో కథ, కవితా, నాటకం, వ్యాసం.. దేనికదే గొప్పవి. వీటి వలన సామాన్య మానవుడికి కలిగే ప్రయోజనం ఏమిటనే ప్రశ్న ఈమధ్య కాలంలో ‘గ్లోబలైజేషన్’ ముసుగులో పెరిగినవారి నుంచి అక్కడక్కడ వినబడుతోంది. ఓ గిరి గీసుకుని నడుచుకునే వారు "కథ వలన ప్రయోజనాలేమిటి?", "సొంతంగా అలోచించే గుణం పోతుంది, ఊహాలోకంలో బ్రతికేలా చేస్తాయి..." అంటూ వితండవాదాలు కూడా కొండకచో వినబడుతున్నాయి. అయితే కథ మనిషి ఉనికిని తరతరాలు నిలబెడుతున్నదనే సత్యం గ్రహించాలి. బాల్యం నుంచి మనషి నడవడిక, ఆలోచనలు, జీవన విధానాలు, సంస్కృతి, సంస్కారం .. ఇవన్నీ ఒక తరం నుంచి ఇంకో తరానికి చేరవేయడమే కాకుండా.. వారికి నేర్పిస్తాయి కూడా! ప్రపంచంలో ఏ దేశమైన, ఏ భాషైన సరే.. కథ అనేది వారి వారి జీవితాల్లో చోటు చేసుకుంటుందనే విషయం చరిత్ర చెపుతూనే ఉంది.

సరే.. కథ విషయం అటుంచి, కథారచయితల పాత్ర ఏమిటనే విషయం మీద నిరంతరం చర్చలు జరుగుతునే ఉంటాయి. 'రవి గాంచని చోట కవి గాంచున్.' అనే నానుడి వెనుక పచ్చి నిజం ఉంది. నేరాలు, ఘోరాలు, అన్యాయాలు, మంచి చేడు.. ఇలా అన్నిటిని తేజోమూర్తుడైనా సూర్యుడు చూడలేడు. కాని కవి చూడగలడు, చూసినది సమాజానికి రచనల ద్వారా అందించగలడు. సమాజంలో విభిన్నమైన వృత్తుల్లో ఉండేవారి కంటే, రచయితల పాత్ర భిన్నమైనది. అభిరుచి, తపన, సాధన, శ్రమలతో పాటు, బాధ్యత చేపట్టి రచనలు అందిస్తాడు కనుకే, సమాజంలో వీరి స్థానం కూడా ఓ మెట్టు పైనే ఉంటుంది. గౌరవం కూడా కూస్త ఎక్కువే అని చెప్పాలి. నిత్యజీవితాల్లో ప్రతీ వారికి కనిపించే ఏ దృశ్యమైనా అందరు చూసే దృక్కోణంలో కాకుండా, వేరే కోణంలో రచయిత చూస్తాడు. చూసి ఊరుకోకుండా.. స్పందించి రచన చేస్తాడు. అది మంచైనా, చెడైనా సరే కథరూపంలో మనసుల్లో చొచ్చుకునేటట్లు రాస్తాడు. ఓ మూడు దశాబ్దాల కాలం వెనుక వచ్చే కథలకి, ఈ రోజుల్లో వచ్చే కథలకి వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. సామాజిక స్పృహతో పాటు, ఊహాజనితమైన కథలు, నవలలు ఆ రోజుల్లో వచ్చేవి. ఇప్పుడు ఈ ఊహల్లో విహరించే కథలు అంతగా రావడం లేదు. నిత్యం మన ఎదురుగా జరిగే వాస్తవిక విషయల మీద రచనలే ఎక్కువగా కనబడుతున్నాయి. ఇది చాలా శుభ పరిణామం అనే చెప్పాలి. రచయితగా ఉండవలసిన ఈ సామాజిక బాధ్యతని మరోసారి తట్టి లేపవలసిన అవసరం నేటి మన తెలుగు కథకుల విషయంలో ఖచ్చితంగా లేదనే

చెప్పాలి.  అదిగో.. ఈ పచ్చి నిజాలలోంచి వచ్చిన ఓ చిన్న ఆలోచనే  "సమకాలీన రాజకీయ, సామాజిక చైతన్యం" కథాంశంగా కథల పోటీ.  దేశ కాలమాన పరిస్థితులలో కనబడుతున్న మంచి చెడులకు అద్దం పట్టే కథలను ఉగాదికి అందించాలనే తపనతో ఈ పోటిని నిర్వహిస్తున్నాం! సున్నితమైన ఈ చైతన్యాన్ని, అంతే సున్నితంగా, సుతిమెత్తగా కథా రూపాలుగా తీర్చిదిద్ది,  దండలు వేస్తారా, దండనలు వేస్తారా.. అది రచయితలకే వదిలేస్తూ, బాధ్యతని ఆనందంగా స్వీకరించి తమ రచనలని అందిస్తారని ఆశిస్తున్నాను!!

**సంపాదకుడు**

***0***

# విశిష్ట అతిథి



## డా. కె. వి. కృష్ణకుమారి

తన అపారమైన జ్ఞాన సంపదతో, కష్టాల్లో మునిగి, చైతన్యరహిత స్థితిలో కొట్టుమిట్టాడుతున్న లక్షలాది దురదృష్టవంతులకు ఆశల వెలుగు చూపించి, ఆశయాల నిచ్చెనలెక్కడం నేర్పించి, 'కృష్ణక్క'గా ఖ్యాతినెక్కి, 'రమ్య కథా కవయిత్రి'గా పాఠకులను విశేషంగా ఆకట్టుకుని, 'రైటింగ్ ఏంజెల్' గా పేరు గడించి.. ఇప్పటికీ సాహిత్య సేవలు అందిస్తున్న 'ఎవర్ గ్రీన్ రచయిత్రి' డా. కె.వి. కృష్ణకుమారి గారు. 'ఏ వాదమైన సరే... బలవంతంగా రుద్దేదిగా వుండకూడదు. మంచిని గౌరవించాలి, చెడుని విమర్శించాలి. సదుద్దేశంతో, సరైన ధ్యేయంతో రచనల్లో సిద్ధాంతాలని చొప్పించినప్పుడు .. అవి తప్పకుండా ఆమోదయోగ్యాలే అవుతాయి' అనే గట్టి సిద్ధాంతంతో, అసలుసిసలైనన హ్యూమన్'ఇజం'తో రచనలు అందించడమే కాదు, అటు వైద్యురాలిగా అదే 'ఇజం'తో సేవలు అందించారు. మరోవైపు నాట్యం, సంగీతం, చిత్రలేఖనం.. వీటిలో కూడా ప్రావీణ్యాన్ని సంపాదించి, తెలుగు సాహితీ, కళా రంగాలలో ఓ ధృవతారగా వెలుగునిస్తున్న ఋషీమణి డా. కృష్ణకుమారిగారు.

డా. కృష్ణకుమారి పుట్టింది తెనాలిలో. ప్రముఖ వైద్యులు కాజా వెంకట జగన్నాథరావు, సత్యవతి దంపతులు వీరి తల్లితండ్రులు. తండ్రి అడుగుజాడల్లో నడిచి డాక్టరు కావాలనే ఆశయంతో డాక్టరు పట్టాపుచ్చుకున్నా, చిన్నప్పుడే వంటబట్టిన రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఉంచి, ఇప్పటికీ వదల్లేదు. తెనాలి, గుంటూరు, హైదరాబాదు నగరాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యురాలిగా సేవలు అందించి, పదవీవిరమణ చేసినా, రచనా వ్యాసంగంలో రిటైర్ కాలేదు. వృత్తి పరంగా ఎంత బిజీగా ఉన్నా సరే, తెల్లవారుజామున రెండు, మూడు గంటలు రచనా వ్యాసంగం కోసం కేటాయించి, ఆరు శతాబ్దాలు సాహితీ సేవ అమోఘంగా అందించారు. తన పదేళ్ల వయసులో ఓ కథ వ్రాసి పంపితే, అలనాటి 'భారతి'లో ఆ కథ ప్రచురింపబడింది. ఆ వయసులోనే హైస్కూలులో చదువుతున్నప్పుడు, అక్కడ విద్యార్థుల ప్రదర్శన కోసం "భలే పెళ్ళి" అనే నాటకం రాసారు. వందకు పైగా కథలు, అరవైకు పైగా నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు కృష్ణకుమారి గారి కలం నుంచి జాలువారాయి. కర్మయోగి, మంచుపూలు, వసుధ, ముగింపు లేదు, ఎండమావులు, జరుగుతున్న కథ, వెన్నెముక లేని మనిషి.. మొదలగు నవలలు తెలుగునాట ప్రాచుర్యం పొందాయి. ప్రముఖ సినిమా

నటులు అక్కినేని నాగేశ్వరరావుగారికి అత్యంత ఆప్తులుగా ఆయన ఆంతరంగాన్ని ఆవిష్కరిస్తూ "మనిషిలో మనీషి డాక్టర్ అక్కినేని" అనే గ్రంథం డా. కృష్ణకుమారి గారు రాసారు. కర్మయోగి, మంచుపూలు, అద్వైతామృత వర్షిణి వంటి వీరి గ్రంథాలు చాలా ఆదరణ పొందాయి. అలాగే కృష్ణకుమారిగారు 2000 సంవత్సరంలో రచించిన "భద్రా కళ్యాణం" అనే ప్రబంధం గత ఇరవై సంవత్సరాలలో 39 ముద్రణలకు నోచుకుందంటే, ఆ గ్రంథం ఎంత జనాదరణను పొందినదో చెప్పవచ్చును. వీరి "రంగుటద్దాలు" నవల డా. అక్కినేని నాగేశ్వరరావు గారికి అంకితం చేస్తే, ఆ పుస్తకం మీద పీఠిక రాస్తూ "క్లిష్టమైన విషయాల్ని మరింత క్లిష్టంగా చేసి చెప్పే రచయితలు చాలా మంది ఉంటారు. కాని క్లిష్టతకు స్పష్టత కలిగించగల రచయిత్రులు చాలా తక్కువ. అలాంటి కొద్దిమందిలో డా. కృష్ణకుమారి ఒకరు!" అంటూ 'నా చెల్లెలు నవల రాసి నాకు అంకితం చేసి అత్త అయింది' అని చమత్కరించారు డా. అక్కినేని.

1970 లో ప్రముఖ మాసపత్రిక "మహిళ" లో 'కృష్ణక్క సలహాలు' పాఠకుల ప్రశ్నలకు జవాబులిచ్చే ఓ శీర్షికని పరిచయం చేసి, దాదాపు నాలుగు దశాబ్దాలు అదే శీర్షికని వివిధ పత్రికలలో నిర్వహించి, 'కృష్ణక్క'గా లక్షలాది మంది హృదయాలలో సుస్థిర స్థానం పొందారు. ఒక చేతితో స్టెతస్కోప్, రెండో చేతితో కలం పట్టుకుని, ముందర ఇన్ని తెల్లకాగితాలు పెట్టుకుని.. రోగుల్ని చూస్తూ, మందు చీటీలు రాస్తూ, రెండు నిమిషాలు వ్యవధి దొరికితే చాలు.. పది పంక్తులు కథో, నవలో రాసేవారు. తనని అభిమాన పెంపుడు కూతురుగా భావించే, ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి గారు గుంటూరులో ఎ.ఐ.సి.సి. సమావేశాలు జరిగినపుడు లాల్ బహదూర్ శాస్త్రి, కామరాజ్ నాడార్ వంటి ప్రముఖులకు డా.కృష్ణకుమారి గారిని పరిచయం చేస్తూ..'నా రాజకీయ వారసురాలు' అని చెప్పారు. కాని రాజకీయాలలో దినదినానికి క్షీణించిపోతున్న నైతిక విలువలు, పెరిగిపోతున్న ధనదాహం, హింస... వంటి అంశాలు చూస్తూ, సున్నిత హృదయురాలైన డా. కృష్ణకుమారి గారు రాజకీయాలకు దూరంగానే వున్నారు.

ఈ మధ్యకాలంలో డా.కృష్ణకుమారిగారికి ఫోన్ చేసి, కథామంజరి విశిష్ట అతిథిగా ఆహ్వానించినప్పుడు.. ఎన్నో సాహితీ సంగతులు చెప్పారు. తన సాహితి ప్రయాణ సంగతుల వివరాలను పోస్టులో పంపుతానని చెప్పిన తర్వాత, ఆకస్మికంగా అనారోగ్యం పాలై, ఆసుపత్రిలోచేరారు. అయినా సరే.. ఆసుపత్రి నుంచే ఫోన్లు చేస్తూ, ఆ కాగితాలను పోస్టు చేసి, మాకు చేరేవరకు చాలా ఆరాటపడ్డారు. సాహిత్యం పట్ల ఆమెకున్న మమకారం, దీక్షలకు మరో తార్కాణం అక్కర్లేదు. డా. కృష్ణకుమారి గారికి వచ్చిన అవార్డులు, రివార్డులు, పురస్కారాల గురించి వ్రాస్తే అదో నవలే అవుతుంది.

మా అభ్యర్థనని మన్నించి, ఈ సంచిక 'విశిష్ట అతిథి'గా విచ్చేసిన తెలుగువారి 'కృష్ణక్క' డా.కె.వి. కృష్ణకుమారి గారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, మరో పదికాలలపాటు పూర్తి ఆరోగ్యంతో సాహితీ సేవలు అందిస్తూ, తెలుగు పాఠకలోకాన్ని రంజింపచేయగలరని ఆశిస్తున్నాం.

**కథామంజరి బృందం**



# దేవరకొండ బాలగంగాధర తిలక్

బాలగంగాధరతిలక్.. అంటే గుర్తుకువచ్చేది 'అమృతం కురిసిన రాత్రి' కవితా ఝరి జ్ఞాపకానికి వస్తుంది. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అన్న వాక్యం తెలుగు సాహితీ ప్రియుల మనస్సుల్లో చెరగని ముద్రవేసింది. 'దేవుడా! రక్షించు నా దేశాన్ని పవిత్రులనుండి పతివ్రతల నుండి, పెద్దమనుషుల నుండి, పెద్దపులుల నుండి..' అన్న తిలక్ గారి ఆనాటి వచన కవిత, నూటికి నూరు శాతం.. నేటికి వర్తిస్తుంది. అలా కవితా సాహిత్యం మీద తనదంటూ ఓ ముద్ర వేసుకున్నా, అదే స్థాయి ముద్ర కథా రచనలో కూడా వేసుకున్న విశిష్ట కథకుడు కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్! ఆయన కవితలు ఎంత పదునుగా ఉంటాయో, కథలు కూడా అదే స్థాయిలో ఉంటాయి.. కొండకచో కొంచెం పై మెట్టుమీదే ఉన్నాయని చెప్పాలి! మధ్యతరగతి మందహాసలు, కింది తరగతి చిందులాస్యాలు, పైతరగతుల వారి పైత్యాలు.. వీటిని తన కథల ద్వారా అరటిపండుని ఒలిచిపెట్టి ఇచ్చినట్లు అందించారు. కథా వస్తువు సేకరణలో ఓ ప్రత్యేకత, కథానిర్వహణలో నేర్పు, తనదైన శైలిలో రచనలు సాగించినా సరే, ఆ రచనలలో ఏదో సిద్ధాంతం ప్రతిపాదించాలన్న భావం అసలు లేకుండా కథలు అందించిన అభ్యుదయ రచయిత తిలక్ గారు. సాంప్రదాయ నీతికి, మతానికి ఇచ్చిన ప్రాధాన్యం, మానవత్వానికి ఇవ్వని సమాజాన్ని చూసి కలత చెందడం తిలక్ గారి కథలలో చూస్తాం! తన కళ్ళ ఎదుట ప్రతి నిత్యం జరిగిపోతున్న జీవిత నాటకాన్ని ప్రతిబింబించడానికి తిలక్ గారు కవిత, కథ, నాటిక ప్రక్రియలను ఉపయోగించుకున్నారు. జీవితంలో ఎదురుపడే పాత్రలనే కథలలో ఉపయోగించారు. తేలికైన పదజాలంతో అల్లిన తిలక్ గారి కథలు, పాఠకుల్ని

హాయిగా చదివిస్తాయి .. అలరిస్తాయి .. కదిలిస్తాయి! ఏ కథ చదివినా “అబ్బా!” అనిపిస్తాయి. అందుకే తిలక్ గారి కథలు వేటికి ఆవే సాటి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 1921 ఆగస్టు 1న జన్మించిన తిలక్ గారు ఇంటర్మీడియట్ వరకు చదివి అనారోగ్య రీత్యా పై చదువులు చదవలేదు. అయితేనేం.. తెలుగు, ఆంగ్ల భాషలలో మంచి పట్టు సంపాదించారు. ప్రాచీన ఆధునిక సాహిత్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసారు. ఆయనవి ప్రభాతము-సంధ్య, గోరువంకలు, కఠినోపనిషత్తు, అమృతం కురిసిన రాత్రి మొదలగు కవితా సంపుటాలు; తిలక్ కథలు, సుందరీ సుబ్బారావు, ఊరి చివరి యిల్లు వంటి కథా సంపుటాలు వెలువడ్డాయి. సుశీల పెళ్ళి, సుప్త శిల, సాలె పురుగు వంటి నాటకాలు కూడా రాసారు. ఆయన కథల్లో.. లిబియా యెడారిలో, గడియారపు గుండెలు, నల్లజర్ల రోడ్డు, ఓడిపోయిన మనిషి, ఊరి చివర ఇల్లు, దేవుణ్ణి చూసినవాడు.. వంటి కథలు అజరామరాలే!

మొదట్లో దేవులపల్లి వారి ప్రభావంతోనూ, తరువాత శ్రీశ్రీ ప్రభావంతోనూ సాహిత్య రంగంలోకి ప్రవేశించినా, తర్వాత కాలంలో తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న అభ్యుదయ, భావకవిత్వాల కలనేత బాలగంగాధరతిలక్ గారు. 1966 లో నలభై అయిదేళ్ళ వయసులోనే అనారోగ్యంతో వారు మరణించడం తెలుగు సాహితీ లోకానికి తీరని వెలితే! 'వయసు సగం చేరకముందే అస్తమించిన ప్రభారవి' అంటూ శ్రీశ్రీ గారు అన్నట్టు... నిజంగానే ఇంకా ఆయనకి ఆయుష్షు ఉండుంటే, తెలుగు సాహిత్యాన్ని ప్రపంచంలో ఎంతో ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లగలిగే రచనలు అందించేవారే! దానికి నిదర్శనం.. 1968లో ముద్రణ జరిగిన, "అమృతం కురిసిన రాత్రి" ఉత్తమ కవితా సంపుటిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 1971 లో వారి మరణానంతరం అందించడమే!

నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు.. అంటూ అర్ధాంతరంగా ఆ వెన్నెలకి దూరమైన కీ. శే. దేవరకొండ బాలగంగాధర తిలక్ గారిని స్మరించుకుంటూ, శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం!!

**కథామంజరి బృందం**

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ



# అబ్రాహ్మణీయం

గంటి రమాదేవి

శరదృతువు రాకా సుధాకరుని చల్లని కాంతి  హంపీ నగరాన్నీ, తుంగభద్రా నదిని ముంచెత్తుతూ వుంది. కృష్ణదేవరాయలు తన సౌధపు గవాక్షం గుండా చూస్తున్నాడు.

ఈ రోజు .. తిమ్మరుసు కుమారుల ఉరి! చెరసాలలో వున్న "అప్పాజీ" నేత్ర ద్వయం కాల్చివేయబడతాయి.

చల్లని ఆ 'రాజు' శీతల మయూఖాలు 'ఈ' రాజు మనసుని శాంతింప చేయలేకపోతున్నాయి. ఇటువంటి రోజు వస్తుందని కలలో కూడా ఊహించలేదు.

లోకజ్ఞానం, ఏ మాత్రం రాజకీయ పరిజ్ఞానం తెలియని తనని వేలుపట్టుకుని నడిపించాడు అప్పాజీ. రాజ్యం ఆపదలో వున్నప్పుడు తన మేధస్సుతో ఎన్నో ఆపదలు గట్టెక్కించాడు. దేశానికి ఒక పక్క 'గోల్కొండ' నవాబు, ఇంకో వైపు 'బీజాపూర్ సుల్తాన్', మరోపక్క 'బహమనీ సుల్తానులు' విజయనగరాన్ని కబళించాలని కాచుకుని వున్నారు! అనేక కుట్రలు సాగుతున్న ఆ సమయంలో అప్పాజీ విజయనగర రాజ్యం బలం పుంజుకునేటట్టు చేశాడు. నిర్విరామంగా యుద్ధ తంత్రాలు చేశాడు. ఎన్నో విజయాలు అందించాడు. అటు ఆంధ్ర దేశమూ, కర్నాటక, ద్రావిడ, కొంకణ, కైరాలి రాజ్యాలు వశమయ్యాయి. ఓఢ్ర దేశపు సరిహద్దులో వున్న "కటకం" వరకు విజయనగర సామ్రాజ్యం విస్తరించింది.

'అప్పాజీ' అని తను ఎంతో ఆత్మీయతతో పిలిచే తిమ్మరుసుకు ఈ శిక్ష విధించడం అనే 'కఠిన నిర్ణయం' అతని గుండెలు పిండేస్తోంది. అతని కుమారులు కూడా నేరస్థులే అన్న న్యాయాధికారుల నిర్ణయం 'అసిధార' ఈ న్యాయనిర్ణయం. దేశాధినేతగా న్యాయాధికారుల నిర్ణయాన్ని "తోసి రాజు" అనొచ్చుకదా! అలా ఎందుకు చెయ్యలేదు అన్న మీమాంస వేధిస్తోంది! తన అంతరాంతరాలలో అప్పాజీ, అతని కుమారులూ నేరస్తులే అని తనకూ నమ్మకం కుదరడం వల్లనా! లేదా రాజు "ఆశ్రిత పక్షపాతి", న్యాయాన్ని తనకనుకూలంగా మార్చుకున్న మరో "మామూలు మనిషి" అనుకుంటారేమోనని అనుమానం వల్లనా?

దేశ ప్రజలకొక నీతి, తను “అప్పాజీ” అని పిలుచుకునే ఆత్మీయుడికీ, అతని సంతానానికి ఒక న్యాయమా?” అని ప్రశ్నించే గళాలకి భయపడా!

కొంత కాలం క్రితం.. కళింగ నుంచి కపిలేంద్ర దేవ్ వంశజుడూ, గజపతుల కులాధిపత్యం గురించి వీరావేశ దురహంకారి “కుమార హంవీర” దేవరాయల అంతఃపురంలో ప్రవేశించాడు. రాణి జగన్మోహిని అతిధిగా చేరాడు! రాయల భార్య తరపు బంధువు... సామాన్య అతిథుల కంటే ఎక్కువ మర్యాదలే జరిగాయి. ఇక్కడకి వచ్చిన హంవీరకు కళ్ళు చెదిరిపోయాయి. ఏమి వైభవం! ఎంత సంపద! మేలిమి బంగారపు పాత్రలూ, వజ్రాల రాసులు! ఎన్ని అందమైన భవనాలు! సుందర దేవాలయాలు! రకరకాల ఫలపుష్ప ఉద్యానవనాలు. వాటిలో నీటి దీప విన్యాసాలు! అసూయా, పగలతో రగిలిపోయాడు హంవీర. ఇక సైన్యపరంగా.. వందల కొద్దీ వున్న గజదళం! పోర్చుగీస్ వాళ్ళు ఇచ్చిన “మేలు జాతి” గుర్రాలతో ఒక దళం! అసంఖ్యాకంగా వున్న పదాతి దళం. శత్రు దుర్భేద్యమైనది ఈ విజయనగరం సామ్రాజ్యం. ఈ రాయలను సైనికపరంగా ఎవ్వరూ ఓడించలేరు. గజపతుల పగ చల్లారదు. “పథం”, “పధకం” మారితేనే గమ్యం చేరుకోవచ్చు.

ఈ రాయలు .. ఓ “నీచ కులస్థుడు”. “సూర్యవంశ సంజాతులు” గజపతులు. దేవరాయలు విజయాల వెనక ‘తిమ్మరుసు’ కుతంత్రం వుంది. దానితోనే గజపతుల కోటను వశపరచుకున్నాడు. తమ కోటలో ఉండే ఓ తెలుగువాడికి లంచం ఆశ చూపి ... ఒక రహస్య మార్గం గుండా, అర్ధరాత్రి చీకటిలో తిమ్మరుసు దాడి చేయించాడు. తూర్పు ద్వారం రక్షణ బలహీనంగా వుండడం ఆ కుటిల మంత్రికి కలసి వచ్చింది. ఆ పరిణామంగానే గజపతి ఘోరంగా ఓడిపోయాడు. ఆ పరాజయంతో తన పలాయన మంత్రం పఠించాడు ప్రతాప రుద్ర గజపతి! ఉత్తమ వంశస్తురాలయిన జగన్మోహినిని నీచ కులస్తుడు రాయలకిచ్చి వివాహం చేయవలసిన అగత్యం ఏర్పడేటట్టు చేశాడు ఈ తిమ్మరాజు. అతనిపైనా ఆరని పగ రగులుతోంది హంవీర మనసులో. మరో భరింపనలవిగాని అవమాన భారం! అదే తమ ఇంటి ఆడపడుచు జగన్మోహినిని రాయలకు 'సమర్పించడం' .. విధి లేక చేసిన పని. అప్పటికే రాయలకి తిరుమలాదేవి పట్టపురాణి! తన దృష్టిలో జగన్మోహిని రాయలకు మరో ఉంపుడుగత్తె! ఆ అవమానాల్ని పంటి బిగువన భరిస్తూ సమయం కోసం చూస్తూ వున్నాడు హంవీర!
కొన్ని రోజుల క్రితం.
దేవరాయలు గవాక్షం నుంచి నగరం వైపు చూస్తూ వుండగా.. ఏనుగు బాధాతప్తమైన ఆర్తనాదం వినపడింది. గుండెలు పిండిపేసేలా వినిపించింది ‘కరి ఘీకారం’. ‘ఏమైంది ఈ గజరాజుకి?’ అని మనసులో వేదన చెందుతుండగా, పక్కనే వున్న హంవీర అన్నాడు.

'ముసలివైపోయి పనికిరాని ఏనుగులను తుంగభద్రా నదిలోకి గెంటివేస్తారు. అలాగే గాయపడి, చికిత్సకి లొంగని వ్యాధులు వున్న దళపు ఇతర జంతువులను కూడా ఇలాగే నీటిలో తోసేస్తారు. వీటికి అయ్యే వ్యయం వృధా అని మహామంత్రి తిమ్మరుసుగారి ఉద్దేశం. అందుకే ఇలా చెయ్యమని ఆజ్ఞ ఇచ్చారు. అవి ఆ నదిలో ఆకలితో నకనకలాడే మొసళ్ళకి ఆహారమవుతాయి.

రాయలు ఉలిక్కిపడి.. ఒక అడుగు వెనక్కి వేసి, హంవీరను చూసి.. "మీరు మా అతిధులు. అందుకే క్షమిస్తున్నాను! అదే ఇంకొకరయితే.. ఈ నిరాధార ఆరోపణకి అతని శిరస్సు నెలకి రాలి వుండేది. తిమ్మరుసు నా ఆప్తుడు. అలా ఎప్పుడూ చేయడు!"

"క్షంతవ్యుడను... తమరు సాహిత్య గోష్ఠులలో మునిగిపోయి తమరు రాజ్యం సంగతే మరిచిపోయారు. ఇంకా అరాచకాలు ఎన్నో జరుగుతున్నాయి. ఈ రాజ్య క్షేమం కోరి, మా ఇంటి ఆడపడుచు సౌభాగ్యం కోరి చెబుతున్న మాటలు ఇవి!"

"ఏమిటవి?" ముఖంలో కోపం తాండవిస్తూ వుండగా రాయలు అన్నాడు.

"మహారాజు క్షమించాలి! ఈ తిమ్మరుసు మహా మేధావి. అతని కత్తికి రెండు వేపులా పదునే.. కొంచెం జాగ్రత్త! రాజ్యం భారం ఆసాంతం అతనికే ఒప్పగించి మీరు సాహిత్య సాగరంలో మునిగిపోయారు. అదే అదనుగా మీ రాజ్యం మీద సర్వాధికారాలు దఖలు చేసుకున్నాడు. తన కుమారులకు ఈ రాజ్యం అర్పితం చేసినా ఆశ్చర్యం లేదు.

మౌనంగా వింటున్నాడు రాయలు. హంవీర చెప్పడం సాగించాడు.

"తిమ్మరుసు గురించి నాకు కొన్ని భయంకరమైన నిజాలు తెలిసాయి. ఇప్పుడు మీరు వినే స్థితిలో లేరు. ఇప్పుడు మీకు వ్యాయామానికి వేళ అయింది. కొత్తగా పోర్చుగీసు వాళ్ళు పంపిన 'కాలా బిజిలీ' అనే గుఱ్ఱం మీ కోసం ఎదురు చూస్తూ వుంది. రాజా! జాగ్రత్త! అది చాలా పొగరు పోతు."

నిజంగానే అది చాలా దుర్లభమైన అశ్వం! అది రాయలను ముప్పుతిప్పలు పెట్టింది. శరీరమంతా అలసిపోయింది. చెమటతో శరీరమంతా తడిసిపోయింది. రాజుకి రెండు మూడు చోట్ల గాయాలయ్యాయి. తిమ్మరుసు గురించి హంవీర రేపిన అనుమానంతో సరియైన ఏకాగ్రత కుదరలేదు.

తిరిగి వచ్చిన తర్వాత హంవీర నర్మగర్భంగా అన్నాడు. "రాయలవారు మన్నించాలి! ఇది మన మంత్రి తిమ్మరుసుగారు పంపగా వచ్చిన మీ పాలిటి మృత్యు రూపం! ఆ అశ్వాన్ని ఆయన ఏ కార్యసిద్ధికై పంపారో!" హంవీర మాటల్లో వ్యంగ్యం ఎక్కడ తగలాలో అక్కడ తగిలింది.

పనికిరాని జంతువులను మొసళ్ళకి ఆహారం చేయడం అనేది ఇదివరకు వినలేదు. అప్పాజీ ఇలా చేయమని ఎందుకు చెప్పారు? రాజప్రాసాదానికి వచ్చి తన కావ్య రచన గురించి ఆలోచిస్తూ వుండగా.. కుమార హంవీర తన సోదరితో ఓఢ్ర దేశంలో విశేషాలు చెబుతూ కనపడ్డాడు.

"హంవీరా! మీరు తిమ్మరుసుపై ఆరోపణలు చేసారు. అది నన్ను బాధిస్తూ వుంది."

"రాజా! నిజం పాషాణ సదృశ్యం.. అది కఠినం! కానీ చెప్పక తప్పదు. మన రాజప్రాసాదానికి కావలసిన పాల వితరణ ఎక్కడినుంచి వస్తున్నది? ఆ నిర్వాహకులు ఎవరు? మీకు తెలుసా?"

"ఎవరు?" కలవరపాటుగా అన్నాడు రాయలు. పాలు, నీరు, ఆహారం .. వీటిద్వారా శత్రువులను నిర్వీర్యం చేయవచ్చని తిమ్మరుసు ఒక సందర్భంగా తనతో అన్న మాట. యుద్ధంలో విజయం ప్రధానమనుకున్నప్పుడు ఇలాటి తంత్రాలు అవసరమని ఆయన అన్నారు. ఆ మాటలు అప్పుడు పట్టించుకోలేదు. తన బలాన్ని, శౌర్యాన్ని నమ్ముకున్న రాయలకు, ఆ నాటి తిమ్మరుసు మాటలు అనవసరమైన ప్రసంగంలా అనిపించింది.

"మీపై విష ప్రయోగం చేయాలని మీ శత్రువుల ఆలోచన! కరవాలం ఎత్తనక్కరలేదు. రక్తం చిందించనక్కరలేదు. ఇప్పటికే మీరు.. మీ చిరంజీవి ఆరేళ్ళ తిరుమలరాయలకి పట్టాభిషేకం చేసారు. ఇప్పుడా బాలుడు మహారాజు. బలమైన మీ ఆలంబన లేక ఈ విజయనగర మహా భవనం కూలిపోయే ప్రమాదం పొంచి వుంది. అది వేగవంతం చేసే మహా కుట్ర జరుగుతూ వుంది!"

రాయల భ్రుకుటి ముడిపడింది.

"తిరుమలరాయనికి పట్టాభిషేకం. అప్పాజీకి ఇష్టం లేదని అప్పటి ఆయన మాటలబట్టి అర్థమైంది కనా! (అప్పాజీ రాయలను ముద్దుగా పిలిచే పేరు). బాలుడికి ఇంకా వయసు రాలేదు. ఇంకా ఆరు వత్సరాల పసివాడు. బాలుడి తలకు మించిన భారం!" అన్నారు.

ఆయన మాటలు అప్పుడు తను లక్ష్య పెట్టలేదు. వాత్సల్య పూర్వక సంభాషణ అని అనుకున్నాడు. వారసుడు లేకపోతే ఈ పరాయి మూకలు ఏవో కొత్త చట్టాలు తీసుకువచ్చి చిక్కులు కలిగిస్తారని విని వున్నాడు.

"గోశాల తిమ్మరుసు కుమారుల నిర్వహణలో వుంది. పాలల్లో నెమ్మదిగా పనిచేసే విషం కలపడం వారికి అసాధ్యమేమీ కాదు!" అన్నాడు నెమ్మదిగా కుమార హంవీర.

రాయల మనసు కొన్ని సంవత్సరాల వెనక్కి వెళ్ళింది.

'అప్పటి రాజు, తన సోదరుడు 'వీరనరసింహరాయలు' మరణశయ్యపై వుండగా, తన మంత్రి అయిన ఈ తిమ్మరుసుని .. 'తనని చంపమని' ఆదేశించాడు. అప్పుడు అప్పాజీ.. మేక కళ్ళను చూపించి, అవి 'తనవి' అని నమ్మించ లేదా? అలాగే ఎన్నో యుద్ధాలలో ఈయన మంత్రాంగం వల్ల కాదా తాము గెలిచినది. 'కనా! శక్తి కన్నా యుక్తి గొప్పది' అని కదా బోధ చేసినది. ఇప్పుడు అదే యుక్తితో తన కుమారులకు ఈ విజయనగర సామ్రాజ్యం ధారాదత్తం చేయదలిచాడా?' ఈ ఆలోచనలో వుండగా, హంవీర మళ్ళీ అన్నాడు.

“తిమ్మరుసుగారి పుత్రులు, తండ్రిని మించిన తనయులు! వట్టిపోయిన, ముసలివైన పశువులను కూడా మొసళ్ళకి ఆహారం వేసేవారు!”

రాయలు ఉలిక్కిపడ్డాడు. “గోవులను కూడానా?”

“ఆహా! గోహత్యలు కూడా! ప్రభూ చరిత్రలో మీకు కళంకం తేవాలని, ఈ వృద్ధ జంబూకం.. ఛి.ఛీ.. వారకాంతలపై సుంకం ప్రవేశపెట్టారు. ఆ సుంకం, యుద్ధాలకీ, సైన్యం నిర్వహణకి అని సాకు చూపించాడు. మీకు ఈ నీచమైన సంపాదన అవసరమా? మీకున్న సంపద ఈ దక్షిణ దేశంలో ఎవరికీ లేదు కదా! దీనికి మన పామరజనం 'లం..సుంకం' అన్న పేరు పెట్టుకుని, మీకున్న కీర్తిని పాడుచేస్తున్న విషయం మీ వరకు రాలేదు. అందరికి తిమ్మరుసు అంటే భయం.! రెండూ అతి హేయమైన కార్యాలు. ఒకటి గోహత్య! రెండు.. చెప్పుకుంటే సిగ్గు చేటు.. వారకాంతల ఆదాయాలపై పన్ను! ఇవి తిమ్మరుసు గారి ఆలోచన!”

రాయల కళ్ళు అగ్ని వర్షం కురిపించాయి.

ఇది అయిన కొద్ది రోజులకే ..

యువరాజు తిరుమలరాయుడు అంతు తెలియని జబ్బుతో చనిపోయాడు. తిరుమలా దేవి దుఃఖం అలవికాకుండా వుంది. రాజు హృదయం ముక్కలయింది. ఒక్కగానొక్క కొడుకు. కొడుకు అకాలమరణానికి కారణం ఎవరు?

మనసు రాయి చేసుకుని విచారణకు ఆదేశించాడు రాజు.

విచారణలో పోర్చుగీస్ వైద్యులు బాలునిపై 'విష ప్రయోగం' జరిగిందని, అది యువరాజు ఆహారంలో ఉందని నిర్ధారించారు. హంవీర చెప్పినది నిజమైనది. రాయల మనసులో పడ్డ' విషబీజం' పెరిగి వటవృక్షం అయింది. న్యాయ విచారణ జరిగింది! అది ఓ లాంఛనం మాత్రమే! ఆగ్రహంతో రాయలు ఆజ్ఞ జారి చేశాడు.

గోశాల నిర్వహిస్తున్న 'తిమ్మరుసు కుమారులను ఉరితీయమనీ', 'తిమ్మరుసును కారాగారంలో బంధించి అతని కళ్ళు కాల్చమని!'

తూర్పు బద్దలై ఎర్రటి రక్తంతో ఆకాశం నిండింది. చెరసాల నిర్వాహకుడు ద్వారం వద్దకు వచ్చి, మహారాజు దర్శనం కోరాడు.

రాయలకు అర్థమైంది.

వచ్చిన అధికారి చెప్పాడు. “ప్రభూ! రాజాజ్ఞ అమలు జరిగింది. ఈ ఉదయం ప్రత్యూష కాలంలో తిమ్మరుసు వారి పుత్రులకు 'ఉరి' శిక్ష అమలు చేయడమైనది. ఇంకనూ.. అగ్నిలో కాలిన ఇనుప ఊచలతో తిమ్మరుసు వారి కళ్ళు..” చెప్పలేక రుద్ధ స్వరంతో చెప్పాడు.

అప్పుడు... వెనక బిగ్గరగా రోదన ధ్వని వినబడగా రాయలు గిరుక్కున వెనక్కి తిరిగాడు.

గజపతుల ఆడపడుచు జగన్మోహిని. “ఘోరమైన తప్పు జరిగిపోయింది స్వామీ! నాకు ఇప్పుడు తెలిసింది. తిమ్మరుసు కుమారుల వధ, మహామంత్రిగారి నేత్ర దహన ప్రక్రియ, నా బంధువు హంవీర కుట్ర ఫలితంగా జరిగింది. వాడు దేశం విడిచి పారిపోతున్నాడు. వెంటనే ఆ క్రూరుడిని పట్టుకోండి. వాడి తల మీ కత్తితో తెగనరకండి! వాడు నయవంచకుడు. గోముఖ వ్యాఘ్రం!”

నిశ్చేష్టుడయ్యాడు రాయలు. వివరాలు మెల్లగా తెలిసాయి. హంవీర తన మనసులు అనుమానపు విషబీజాలు నాటాడు. బాలుడైన తిరుమలరాయల విషప్రయోగం చేయించినదీ, అప్పాజీపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినదీ ఈ హంవీర.

రాయలు తల తిరిగిపోతోంది. అమాయకులైన తన పుత్రుడి విషప్రయోగం .. దానికి, ఆ పసివాడు పడిన మరణబాధ మరువకముందే .. అమాయకులైన గురుపుత్రుల శరీరాలు వధ్యశిలపై వేలాడుతున్న దృశ్యం ఆయన మనోనేత్రాల ముందు నిలబడింది. కళ్ళు పోయి నరకయాతన అనుభవిస్తున్న తిమ్మరుసు రూపం గోచరించింది.

రాయలు సింహంలా గర్జించాడు.
“ఆ హంవీర హతకుడు మన రాజ్య పొలిమేరలు దాటరాదు. అన్ని వైపులా మన సైనికులను సత్వరమే పంపండి.”
ఆజ్ఞ విన్న సైనికాధికారి దిగ్గున లేచాడు.
పశ్చాతాపాగ్నితో హృదయం కాలుతుండగా, రాయలు హుటాహుటిన చెరసాలకు చేరుకున్నాడు. తిమ్మరుసు రక్తకన్నీరు చూసి చలించిపోయాడు.
“అప్పాజీ! నా ఈ దుష్కృతికి నిష్కృతి లేదు. మన్నించండి.” అన్నాడు.

కొన్ని క్షణాల మౌనం వెనక తిమ్మరుసు దుఃఖభరిత స్వరం ఇలా అంది.

“కనా! దీనిలో నీ తప్పు లేదు. నాదే అపరాధమంతా! ఆ పాప ఫలమూ నాదే! ఆంధ్ర నియోగి బ్రాహ్మణుడినయిన నేను, నా ప్రవృత్తి విస్మరించి, క్షత్రియ ధర్మం పాటించాను. నా వల్ల, నా మంత్రాంగం వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అంతులేని మనోక్షోభ అనుభవించారు. మన ధర్మంలో కర్మకు విముక్తి .. ‘కర్మ ఫలం’ అనుభవించడమే! నేను ‘దైవం నిర్దేశించిన బ్రాహ్మణపథం’ మార్చుకున్నాను. బ్రాహ్మణుడు లోకహితము కోరాలి! అది నేను మరిచి ప్రవర్తించాను. రాజా! నిన్ను ‘మూరు రాయరగండ’, ’కన్నడ రాజ్య

రమారమణ’, ‘ఆంధ్రభోజ’ అని పిలుస్తూంటే పులకించి పోయాను. యుద్దాలలో  విజయం కోసం నేను నా ధర్మపథాన్ని వీడాను.  అధర్మ మంత్రాంగం చేశాను.  అది 'అబ్రాహ్మణీయం' అవుతుంది!”

“పోయిన మీ కుమారులను నేను తీసుకురాలేను.  చిద్రమైన మీ నేత్రాలు ఇవ్వలేను. పాప పరిహారంగా ఏమి చెయ్యమన్నా చేస్తాను.  మీ సర్వ సంపదలు ఇస్తాను. ఇక్కడే వుండండి.!” గద్గదస్వరంతో అన్నాడు రాయలు.

“రాజా! దానికీ కాలం చెల్లిపోయింది. నా  వృత్తి  మధూకరం!  ఆధ్యాత్మిక చింతన.  యుద్ధ తంత్రాలు చెయ్యడం కాదు. ఇప్పుడంతా ముగిసిపోయిన కథ. ఇక నా శేష జీవితం తిరుమలేశుని పాద సన్నిధిలో ముగుస్తుంది. మొదట నేను ఏమీలేని నిరుపేద బ్రాహ్మణుడిని.  అలాగే  వుండి పోనీయండి రాజా!  అదే ధర్మం!  నా ప్రస్థానం నిర్ణయం అయిపోయింది! క్షమించు రాజా!  నేను నిరపరాధిని అని నమ్మితే ఈ చెరసాలనుంచి విముక్తి ప్రసాదించు!”

“ఎంత మాట అప్పాజీ... అది నేను ముందే నిర్ణయించుకున్నాను!”

చేతుల సంకెలలు వీడిపోయాయి.  చెరసాల తలుపులు విశాలంగా తెరుచుకున్నాయి.  చెరసాల ప్రాంగణం నుంచి   తిమ్మరుసు మొదటి అడుగుపడింది మహాప్రస్థానం  వైపు.

నల్లటి మేఘాలు  నగరంపై ముసురుకుంటున్నాయి.   దట్టమైన చీకట్లు కమ్ముకుంటున్నాయి.  మహా ప్రళయంగా గాలులు వీస్తున్నాయి.  రాబోయే విజయనగర  సామ్రాజ్య పతనానికి సూచనగా పర్జన్య మేఘం గర్జించింది.

“ఇక సెలవు... కనా!” అన్నాడు తిమ్మరుసు ఒక అడుగు ముందుకు వేస్తూ.. !!

***0***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# అత్తమ్మ

కొమ్ముల వెంకట సూర్యనారాయణ



"హేపీ మదర్స్ డే, మమ్మీ!" మొబైల్ ద్వారా అమ్మకు మదర్స్ డే శుభాకాంక్షలు చెప్పడం ఇదే మొదటిసారి. నా చిన్నప్పటి నుంచి కూడా "మదర్స్ డే" రోజున తప్పనిసరిగా అమ్మకు దగ్గరుండి శుభాకాంక్షలు చెప్పడం అలవాటు. హాస్టలులో ఉండి చదువుకుంటున్నప్పుడు కూడా, ఎట్టి పరిస్థితుల్లోనూ మదర్స్ డే నాడు ఇంటికి వెళ్ళి అమ్మకు స్వయంగా "మదర్స్ డే" శుభాకాంక్షలు చెప్పడమే కాకుండా నా పాకెట్ మనీతో ఏదో గిఫ్ట్ కొని ఇచ్చేదాన్ని. అటువంటిది ఈ మధ్యే వివాహమై, వారం క్రితమే అత్తవారింటికి కాపురానికి వచ్చేయడంతో మదర్స్ డే శుభాకాంక్షలు ఇలా మొబైల్ లో చెప్పడం ఏంటో గిల్టీగా ఉంది.

"థ్యాంక్స్ రా చిట్టితల్లీ, ఎలా ఉన్నావు? అల్లుడుగారు, మీ మావయ్య, అత్తయ్య, ఆడబడుచు ఎలా ఉన్నారు?"

"అంతా బాగానే ఉన్నాం మమ్మీ, కానీ నాకే బాధగా ఉంది, ప్రతి మదర్స్ డే రోజున ఎక్కడున్నా నీ దగ్గరకొచ్చి శుభాకాంక్షలు చెప్పడం అలవాటు కదా, అటువంటిది ఈ సారి మొబైల్ లోంచే చెప్పాల్సి వచ్చింది" బాధగా అన్నా.

"అదేంటిరా పిచ్చితల్లీ, పెళ్ళయిన తర్వాత తప్పదు కదా అత్తవారింటి దగ్గర ఉండటం, సరే, జాగ్రత్త!" అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

***

అమ్మా నాన్నలకు నేను, అన్నయ్య సంతానం. అన్నయ్యకు నాకు మధ్య ఐదేళ్ళ తేడా. నాన్న దగ్గర కంటే అమ్మ దగ్గరే అన్నయ్యకు, నాకూ బాగా చనువెక్కువ. అమ్మకి అన్నయ్య అంటేను గారమే, కానీ నేనంటే మరీ గారం, చాలా కాలానికి పుట్టాననేమో మరి. చాలా ప్రేమగా చూసుకునేది, ఒక్క మాట ఎప్పుడూ నన్నన్నది లేదు. అన్నయ్యకు రెండేళ్ళ క్రితమే పెళ్ళి అయింది. వదిన కాపురానికి వచ్చినా నా మీద ఇసుమంత ప్రేమైనా తగ్గలేదు, పైపెచ్చు ఏ సందర్భం వచ్చినా అమ్మ, వదిననే ఒక మాట అనటం జరిగేది కానీ నాపై ఈగ వాలనిచ్చేది కాదు.

***

"ఏరా తల్లీ! ఎలా ఉన్నావు? మీ అత్తగారు ఎలా చూసుకుంటున్నారు" అమ్మ నుంచి ఫోన్

"నాకేం అమ్మా, నేను బాగున్నాను, మా అత్తగారు కూడా చాలా బాగా చూసుకుంటున్నారు, ఏ చిన్నపనీ నాచే చేయించటం లేదు, అంతకీ నేనే కలుగచేసుకుని కొన్ని పనులు చేస్తున్నా. పైగా 'ఇప్పుడే కదా కొత్తగా మా ఇంట అడుగుపెట్టింది, అంతా కొత్త కదా, కొంతకాలం ఎంజాయ్ చేయండి మీ భార్యభర్తలు ఇద్దరూ' అంటున్నారు మా అత్తగారు!"
"ఓ, అలాగా, సరేకానీ అన్ని పనులు నెత్తి మీద వేసుకుని చేయటం మొదలుపెట్టేయకు, తర్వాత్తర్వాత అన్ని పనులు నీ మీదే పడేసి ఆవిడ హాయిగా రెస్ట్ తీసుకుంటుంది!" మెల్లగా వినిపిస్తున్నాయి అమ్మ మాటలు ఫోన్ లో
"లేదులేమ్మా, అటువంటి ఆవిడేం కాదు, సరే గానీ వదిన ఏం చేస్తుంది? ఎలా ఉంది?" అడిగా ఫోన్ లో
"ఎలా ఉంటుంది, బంగారంలా ఉంది. ఇంటిపని, బట్టలుతకడం, వంటపని తన బాధ్యతే కదా, చేసి పడేస్తుంది. చేసిన వంటలన్నీ ఆ భోజనాల టేబుల్ మీద పెడుతుంది. మీ నాన్నకి, నాకు వడ్డించొచ్చు కదా, మేమే వడ్డించుకోవాలి." విరుచుకుపడింది వదిన మీద ఫోన్ లో
"నాన్నకి, నీకూ భోజనాలు వడ్డించటం కూడా వదినే చేయాలా? ఆ మాత్రం నువ్వు చేయలేవా? పోనీ నువ్వేమైనా అంట్లు తోముతున్నావా? ఇల్లు తుడుస్తున్నావా?" అన్నా.
"నువ్వూ బానే చెపుతున్నావే, వదిన వచ్చిన తర్వాత కూడా కాస్త సుఖపడవద్దంటావా! ఏం మాకు ఆ మాత్రం చేయలేదా!" నిష్టూరమాడింది వదినని ఫోన్ లో.
"సరే గానీ, మీ ఆడబడుచు ఏమైనా నీకు పనులలో సాయపడుతుందా, లేకపోతే ఆవిడకే నువ్వు చేయాల్సి వస్తుందా!" మరొకసారి ఫోన్ లో నిలదీసింది అమ్మ.
"లేదమ్మా, చేస్తుంది, పైగా మా అత్తగారు తను చేయడమే కాకుండా మా ఆడపడుచుని కూడా నాకు ఇంటి పనులలో సాయపడమని చెపుతుంటారు!"
"ఇప్పుడు అలా చేస్తున్నారని ఓ పొంగిపోయి గొప్పకి అన్ని పనులు నీ మీద వేసుకుని చేసుకుంటూపోకు, తర్వాత అన్ని పనులు నీ మీదే పడేసి వాళ్ళు హాయిగా రెస్ట్ తీసుకుంటారు!" అని హెచ్చరించింది
"సరే, పెట్టేస్తున్నాను" అని ఫోన్ పెట్టేసాను.

పుట్టింటిలో ఉన్నప్పుడు చూస్తూనే ఉండేదాన్ని కదా, పాపం వదిన చేతే అన్ని పనులు చేయించేది. పైపెచ్చు నేను ఏమైనా వదినకి సాయం చేద్దామని వెళ్ళబోతుంటే, అమ్మ వెళ్ళనిచ్చేది కాదు. ఇక అమ్మ సంగతికి వస్తే వదిన కాపురానికి రానంతవరకు అన్ని పనులు తానే చేసుకునేది. అటువంటిది వదిన కాపురానికి రాగానే, అక్కడ గిన్నె తీసి ఇక్కడ పెట్టడం మానేసింది. ఈ అన్ని విషయాలు తెలిసి కూడా అనవసరంగా వదిన గురించి కదిపానే అని మనసులో ఒక క్షణం బాధ వేసింది.
అమ్మ మాటలేంటో చాలా విడ్డూరంగా అనిపిస్తున్నాయి ఇప్పుడు. తను పూచిక పుల్ల ముట్టుకోకుండా వదిన చేత అన్ని పనులు చేయిస్తూ, పైగా ఏ పనులలోను నన్ను సాయపడనివ్వని అమ్మ, నాకేమో

ఇప్పుడు అన్ని పనులు నా నెత్తి మీద వేసుకుని చేయొద్దు, అత్త, ఆడబడుచులకి అప్పగించు అని సలహా ఇస్తుంటే.

***

"ఏరా చిట్టితల్లీ! అలా ఇంటికే పరిమితమైపోవడమెందుకే, చక్కగా చదువుకున్నావు, ఏదైనా ఉద్యోగం చేసుకోవచ్చు కదా. మీ అత్తగారు, మీ ఆడపడుచుకి పెళ్ళయేంతవరకు మీ ఆడపడుచూ ఇంటి పనులు చక్కబెట్టడానికి ఉంటారు కదా. అదీ కాక రేపు ఏ పిల్లో పీచో పుడితే అపుడు ఉద్యోగం చేయడానికి అవకాశమే ఇవ్వరు. అదే ఇప్పుడు ఉద్యోగంలో చేరితే ఆ పిల్లా పీచుని మీ అత్తగారికి, పెళ్ళయేంత వరకు మీ ఆడబడుచుకి అప్పగించి నీ ఉద్యోగాన్ని కొనసాగించవచ్చు!" ఒక రోజు ఫోన్ లో అమ్మ సలహా.
ఆశ్చర్యం వేసింది, అమ్మ సలహాకి. పాపం పెళ్ళినాటికి వదిన ఉద్యోగం చేసేదే.. "ఇంటి పనులు, వంట పనులు చేయడం తనకు కష్టమైపోతుందని, మనకేం లోటు నువ్వు మంచిగా ఉద్యోగం చేసుకుంటున్నావు కదా, ఇద్దరికిద్దరు ఉద్యోగాలు చేసుకుంటే ఇంటికొచ్చిన తరువాత మీ ఇద్దరూ ఆనందంగా గడిపే సమయం ఏముంటుంది? అలాగే మాకూ వయసు మీదపడుతుంది, రేపొద్దున్న మీకు పిల్లలు పుడితే వాళ్లని చూసుకోవడానికైనా తను ఇంటిపట్టునుండాలి కదా!" అని అన్నయ్యకు చెప్పి బలవంతాన వదిన ఉద్యోగానికి రిజైన్ చేయించింది.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి, నేను కాపురానికి వచ్చినప్పటినుంచి "ఏమ్మా, చాలా పెద్ద చదువులు చదువుకున్నావు, అలా ఇంటికే పరిమితమైపోవడమెందుకు, ఏదైనా మంచి ఉద్యోగ అవకాశం వస్తే చేరు, అదీ మీ భార్యాభర్తలిద్దరికీ ఇష్టమైతేనే, మరల ఏ బాబో, పాపో పుడితే మానేయమంటారు అని కూడా అనుకోవద్దు. ఓపికున్నంతవరకు మా మనవడిని, మనవరాలినో చూసుకోవటం మాకేమంత ఇబ్బంది కాదు!" అంటూనే ఉన్నారు మా అత్తగారు.

అమ్మ సలహా కన్నా, మా అత్తగారి అభ్యర్థన మేరకు ఒక మంచి కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ఉద్యోగంలో చేరిన తరువాత నుంచీ నా కంటే ముందే మా అత్తగారు నిద్ర లేచి నేను తయారయ్యేలోపు అన్ని పనులు చక్కబెట్టేవారు. నాకు అడపా దడపా మా అత్తగారు సాయం చేయాల్సింది, నేను మా అత్తగారికి అడపా దడపా మాత్రమే పనులలో సాయపడుతున్నాను. అలాగే సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన వెంటనే స్నాక్స్, వేడి వేడి టీ పెట్టి ఇచ్చేస్తారు ఎంత వద్దన్నా వినకుండా. అతి కష్టం మీద రాత్రి వంట నేను చేయడానికి ఒప్పుకున్నారు, అప్పుడూ ఆమె చేతులు కలుపుతూనే ఉంటారు.

***

కాలం పుస్తకంలో సంవత్సరం పేజీలు పది పూర్తయ్యాయి. ఈ పదేళ్ళ కాలంలో వచ్చిన మార్పులు అయితే.. మా ఆడబడుచుకి వివాహం కావడం, నేను ఇద్దరు బిడ్డలకు తల్లి నవ్వడం, పిల్లలు బడిబాట పట్టడం, ఉద్యోగ

జీవితంలో పదోన్నతి వల్ల మరింత ఆలస్యంగా ఇంటికి చేరుకోవడం.. కానీ మారనిదల్లా మా అత్తగారు. నాపై చూపే ప్రేమలో గానీ, చేసే పనులలో గానీ ఏ విధమైన మార్పు రాకపోవడం, అందుకే ఇంత హాయిగా భర్త పిల్లలతో గడుపుతూ ఉద్యోగాన్ని చేయగలగడం. అలాగే నా వరకు మార్పు రానిదేమైనా ఉందా అంటే, ప్రతి సంవత్సరం మదర్స్ డే రోజున నేను మా పుట్టింటికి వెళ్ళి, అమ్మకు శుభాకాంక్షలు చెప్పి ఒక చక్కని గిఫ్ట్ ఇచ్చి రావడమో, అలా వీలు కాకపోతే ఫోన్ ద్వారా శుభాకాంక్షలు చెప్పి గిఫ్ట్ ఆన్ లైన్ లో పంపించడమో! అలాగే అమ్మ వరకు మార్పు రానిదేమిటంటే నా పట్ల అంతే అభిమానం, అదే సమయంలో మా వదిన పట్ల, మా అత్తగారి పట్ల, మా ఆడబడుచు పట్ల అవే సలహాలు.

***

వివాహమై ఇది పదకొండవ సంవత్సరం. ఈ పదకొండవ సంవత్సరం "మదర్స్ డే" కి నాలో అంతర్మధనం మొదలయింది. అసలు మదర్ డే శుభాకాంక్షలు స్వీకరించడానికి ఎవరు అర్హులు.. అమ్మా? మా అత్తగారా? తల్లికి తన బిడ్డలపై ప్రేమ సహజాతి సహజం. తన బిడ్డలపైనే కాకుండా, తన ఇంటికి కోడలిగా వచ్చిన పిల్లను కూడా తన బిడ్డలాగా చూసుకునేవాళ్ళే కదా నిజమైన తల్లులనిపించుకుంటారు. కూతురుని, కోడలని ఒకేలా చూడగలిగే వారే అసలైన అమ్మ అనిపించుకునేటందుకు అర్హులు. అందుకే ఈ సారి మదర్స్ డే కి సరికొత్త నిర్ణయం తీసుకున్నా. అదే ఈ మదర్స్ డే కి " హేపీ మదర్స్ డే అమ్మా" అంటూ మా అత్తగారికి శుభాకాంక్షలు చెప్పి, పాలరాతితో చేసిన తల్లీ బిడ్డల విగ్రహాన్ని ఆమె చేతిలో పెట్టాను. కళ్ళ వెంబడి ఆనందబాష్పాలు రాల్చుతూ మా అత్తగారు నా భుజాన్ని తడిపేస్తూ ఆమె నన్ను హత్తుకుంటే, ఆమె చీరకొంగుని తడిపేస్తూ నా కళ్ళ వెంబడి ఆనందభాష్పాలు మా అత్తగారిని "అమ్మ" అని అనేందుకు పది సంవత్సరాల సమయం ఎందుకు తీసుకున్నానా అని ఒకింత సిగ్గుపడుతూ.

ఎప్పుడూ లేనిది ఈ సారి అమ్మకి "హేపీ మదర్స్ డే" శుభాకాంక్షలు చెప్పకపోవడంతో అమ్మే అడిగింది.

"అదేంటిరా చిట్టితల్లీ, ఈ సారి మదర్స్ డే శుభాకాంక్షలు చెప్పలేదేంటిరా?" అని

ఈ సారి "హేపీ మదర్స్ డే" శుభాకాంక్షలు మా అత్తమ్మకి చెప్పానని చెప్పటమే కాకుండా.. "ఎప్పుడైతే వదిన చేత "హేపీ మదర్స్ డే" చెప్పించుకునే రోజు వస్తుందో అంతవరకు నా "మదర్స్ డే" శుభాకాంక్షలు మా అత్తమ్మకే" అన్నాను.

"నిజమేరా చిట్టితల్లీ, ఇప్పటికైనా నా కళ్ళు తెరిపించావు, ఇన్నాళ్ళుగా మీ అత్తగారు నీ పట్ల చూపిస్తున్న ప్రేమను చూసైనా తెలుసుకోలేకపోయాను. అందుకే వచ్చే సంవత్సరం నీచేత కాదు, నీ వదిన చేత చెప్పించుకుంటాను 'హేపీ మదర్స్ డే!" శుభాకాంక్షలు" అనేసరికి ఆనందంతో నా మనస్సు ఉప్పొంగి పోయింది.

(కథలో అత్తగారిలాంటి అత్తగారిని చూసిన ఆనందంలో.... అటువంటి అత్తగార్లందరికీ అంకితం ఈ కథ)

***0***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# తరం తరం నిరంతరం

పద్మావతి రామభక్త



మగవాడు ఏడవకూడదని ఎందుకంటారో నాకు తెలీదు, అర్థం కాదు. 'అదేమిటి మగవాళ్ళకు దుఃఖం రాదా, బాధ కలగదా' అని నాకు చాలాసార్లు అనిపిస్తుంది. నేను మాత్రం ఎవరేమనుకున్నా సరే, తనివితీరా ఏడ్చేస్తాను. అందునా నిన్నటి నుండీ ఎంత తొక్కిపెట్టినా నాకు ఏడుపు ఆగట్లేదు.

"వాడు ఫోన్ చేసాడా సమీరా?"

ఇది ఏ వందోసారో నేను సమీరని అడగడం, అది నాకూ తెలుసు, కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయత నాది.

"లేదండీ, దిగులు పడద్దు వచ్చేస్తాడు లెండి...మీకు మళ్ళీ బీపీ ఎక్కువ అవుతుంది." అంది.

"అంతకన్నా ఏం చెయ్యగలం చెప్పు. అయినా ఏం లోటు చేసాను వాడికి! అరచేతిల్లో నడిపించి పెంచాను. ఎన్నిసార్లు నచ్చజెప్పినా ఎందుకు ఇలా చేస్తున్నాడు....." దుఃఖంతో ఇక నాకు మాటలు రావట్లేదు.

సమీర నా దగ్గరకు వచ్చి నా చెయ్యి తన చేతుల్లోకి తీసుకుని మెత్తగా నొక్కింది.

"మనం ఏ లోటూ చెయ్యలేదండీ. ఈ జనరేషనే అలా ఉంది!"

"కానీ మరీ ఇంత ఆలస్యంగా వాడు ఎప్పుడూ రాలేదు కదా. పదిహేడేళ్ళ వాడికి బయట ఏం పనులుంటాయి. శనాదివారాలు వస్తే చాలు ఇంట్లో ఉండడు. ఏవేవో పిచ్చి ఆలోచనలు మనసులోకి వద్దన్నా వచ్చి అల్లకల్లోలం చేస్తున్నాయి!" అంటూ ఎంత అదిమిపెట్టుకున్నా ఆగని కన్నీటిని చేత్తో తుడుచుకున్నాను.

తను లేచి వెళ్ళి రుమాలు తెచ్చి నా కళ్ళు మృదువుగా వత్తింది.

"వాడు వచ్చాక నెమ్మదిగా మరోసారి నచ్చచెబుదాంలెండి. లేకపోతే వాళ్ళ కాలేజీలోనో, వాడి ఫ్రెండ్స్ నో కనుక్కుందాం!" అంది.

"ఇదివరకు వాడి ఫ్రెండ్ ను ఏదో మామూలుగా వాడి గురించి అడిగితే, ఎంత గొడవ చేసాడో మర్చిపోయావా!" అన్నాను.

"లొంగదీసి ఎలా దార్లో పెట్టాలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుందాం" అంది.

మళ్ళీ తనే ఒక్క క్షణమాగి.. "వాడిని ఆ కాకినాడ హాస్టల్ లో పెడదామా? మా పిన్ని కూతురి కొడుకు అక్కడే చదువుతున్నాడు. అక్కడ బాగా క్రమశిక్షణతో ఉంటుందిట. ఆ అబ్బాయి కూడా వీడి అంత

కాకపోయినా బాగానే తల్లిదండ్రులను విసిగించేవాడుట.  ఇక అక్కయ్య ఏం చెయ్యాలో అర్థం కాక ఎవరో చెప్తే ఆ హాస్టల్ ఉన్న కాలేజీలో జాయిన్ చేసేసిందిట!" అంది సమీర నా వైపు సంశయంగా చూస్తూ.
"అమ్మో పుట్టక పుట్టక పుట్టిన ఒక్కగానొక్క నలుసుని అక్కడెక్కడో పెడితే ఎలాగా? వాడు నా కళ్ళ ముందు తిరుగాడకపోతే నేను బ్రతకగలనా అసలు! ఏదో ఒకటి చేసి దార్లోకి తెచ్చుకోవాలి కాని.." అన్నాను కొంచెం బాధగా.
"మీరిలా అంటారని నేను ముందే అనుకున్నాను. అసలు చిన్నప్పటి నుండీ వాడు ఆడమన్నట్టు ఆడి, మీరే కదూ వాడిని ఇలా తయారు చేసారు. పిల్లలంటే ఎంత ప్రేమ ఉన్నా.. చెప్పాల్సిన సమయంలో భయం చెప్పాలి, క్రమశిక్షణలో పెట్టాలి. ఎన్నిసార్లు చెప్పినా మీరు వినిపించుకోరు. రేపొద్దున్న మనం ఉన్నా లేకపోయినా వాడు జీవితాన్ని ఈదాలి కదా!" అంది సమీర.

తను చెప్తున్నవన్నీ నిజాలే కానీ, వాడి విషయంలో నేను మాత్రం మనసును కట్టడి చేసుకోలేను. వాడు ఏం చేసినా, ఎంత ఇబ్బంది పెట్టినా ఒక చిన్న మాట కూడా వాడిని అనలేను. వాడి చిన్నప్పుడు ఒకసారి ఇంట్లో బంతిని ఎగరేసి ఆడుతున్నాడు. 'బంతితో ఇంట్లో ఆడకు నాన్నా, బయటకు వెళ్ళి ఆడుకో, లేకపోతే ఇంట్లో అద్దాలకు తగిలితే బద్దలైపోతాయి' సమీర చెప్తూ కసురుతూనే ఉంది. నేను మాత్రం 'వాన పడింది కదా, పొరపాటున బయట కాలు జారితే వాడికి దెబ్బ తగులుతుంది. ఫరవాలేదులే.. పిల్లలన్నాక అల్లరి చెయ్యకుండా ఉంటారా!' అంటూ వాడిని వెనకేసుకొచ్చాను. సమీర అన్నట్టే జరిగింది. కానీ పగిలింది అద్దం కాదు. ఆ మధ్యన నేను వాయిదాల్లో కొన్న టీవీ. ఇంకా రెండు నెలల వాయిదాలే కట్టాను. నా గుండె గుభేలుమంది. సమీర వచ్చి వాడి భుజాలు గుంజుతూ గట్టిగా అరుస్తోంది. వాడు బిత్తరపోయి కన్నీళ్ళ పర్యంతం అవుతున్నాడు. నేను గబగబా వాడిని దగ్గరకు తీసుకుని 'ఊరుకో సమీరా, బంతి టీవీకి తగులుతుందని వాడికి తెలీదు కదా. చూడు పాపం.. ఎలా బిక్కమొహం వేసాడో' అంటూ సమీరను కోప్పడ్డాను. ఏం ఫరవాలేదని నేను సముదాయించడంతో వాడు మళ్ళీ మామూలుగా అయిపోయి నవ్వుతూ ఆడుకోవడం మొదలుపెట్టాడు.
ఆ రోజు రాత్రి సమీర నాతో చాలా గొడవపడింది. 'కడుపున పుట్టిన పిల్లల కన్నా వస్తువులేమీ విలువైనవి కావు కదా, కావాలంటే మళ్ళీ కొనుక్కోవచ్చు' అన్నాను.
'కానీ.. పిల్లలకు డబ్బు విలువతో పాటు అమ్మానాన్నల శ్రమ విలువ కూడా తెలియాలండీ. మీరు ఎన్నాళ్ళు కష్టపడితే ఆ వస్తువు కొనగలిగారో కనీసం వాడికి చెప్పి ఉంటే నేను సంతోషించి ఉండేదాన్ని!' అంది తను కోపంగా.
నిజమే కానీ వాడు నాకు ఒక బలహీనత. వాడంటే చెప్పలేనంత పిచ్చి ప్రేమ. వాడికి చిన్న దెబ్బ తగిలితే నాకు విపరీతంగా నెప్పెడుతుంది. వాడి కంట్లో చిన్న కన్నీటిచుక్క కూడా నేను చూడలేను, చూసి తట్టుకోలేను.

***

నాకూ సమీరకూ ఆ రోజు రాత్రి జాగారమైంది. వాడు మాత్రం ఇంటికి రాలేదు. పోలీసులకు చెప్తే అందరికీ తెలిసిపోతుంది. అందరూ వాడి గురించి చెడ్డగా మాట్లాడుకుంటే వాడి భవిష్యత్తు పాడవుతుందేమో అని నేను ఆ పని చెయ్యలేదు. ఫోన్ ఎన్నోసార్లు చేసాం, కానీ వాడు తియ్యలేదు, ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. సరిగ్గా అటువంటి పరిస్థితిలో, తల పట్టుకుని టెన్షన్ లో మేము ఉంటే, ఫోన్ మోగింది. ఆశగా ఫోన్ చేతిలోకి తీసుకుంటే మా నాన్న రోజూ చేసే ఫోన్ కాల్ అది. నాన్న ఫోన్ చేస్తే చాలు నాకు భలే చిరాకు కలుగుతుంది. ఎప్పుడూ అవే కుశల ప్రశ్నలు, జాగ్రత్తలు.

"ఏరా నాన్నా ఎలా ఉన్నావు? కోడలూ మనుమడూ బావున్నారా? ఆరోగ్యం జాగ్రత్తరా, మనవడిని బాగా ముద్దు చేస్తున్నావని కోడలు చెప్పింది. కాస్త భయం భక్తీ నేర్పు...." ఇలా ప్రతి రోజూ నాన్న వాక్ప్రవాహం సాగిపోతుంది.

నేను ఏమీ సరిగ్గా మాట్లాడకపోయినా ఆయన మాత్రం తనకు అలవాటైన ధోరణిలో నాకు సుద్దులు చెప్తూ ఉంటారు. ఆయన మాటలు వింటే నాకు విపరీతమైన కోపం వచ్చేస్తుంటుంది. మనవడంటే తాతలకు ఎంత ముద్దు ఉంటుంది. 'అసలు కంటే వడ్డీ ముద్దంటారు'. ఈయనేమిటో ఇలా. ఎంతసేపూ వాడి మీదే కళ్ళు. రోజూ ఈయన గీతోపదేశం వినలేక అప్పుడప్పుడు ఫోన్ తీయడం మానేస్తే, సమీరకు చేసి నాకు ఫోన్ ఇమ్మంటారు. ఇక ఎందుకొచ్చిన గోల అని, నేనే ఫోన్ తీసి ఆయన పాఠాలు వినేస్తాను.

చిన్నప్పటి నుండి ఎన్ని తిట్లు తిట్టేవారు. క్రమశిక్షణ పేరుతో ఎన్ని ఆరళ్ళు పెట్టేవారు తండ్రి. బళ్ళో మాష్టారయితే, కడుపున పుట్టిన వాడికి నరకమే. అందుకే నాన్నంటే నాకు విపరీతమైన కోపం, అసహ్యం కూడా. ఆ కారణంతోనే అమ్మ పోయాక ఆయనని నా దగ్గరకు తెచ్చుకోలేదు సరికదా .. ఆయన ఎంత రమ్మన్నా నేను మాత్రం ఆ ఊరు వెళ్ళను. ఆయనే ఏడాదికి ఒకసారి ఎంత ఓపిక లేకపోయినా వచ్చి, రెండు రోజులు మాత్రమే మా ఇంట్లో ఉండి చూసి, వెడతారు. అప్పుడు కూడా నేను ముభావంగానే ఉంటాను. కాస్తో కూస్తో సమీర మాత్రం మామగారితో మాట్లాడుతుంది. తనకి నాన్నంటే ఇష్టం, గౌరవం. వాడైతే 'హలో తాతగారూ" అనేసి తన ఫోన్ లో మునిగిపోతాడు, లేకపోతే బయటకు వెళ్ళిపోతాడు. నాన్న అన్నీ గమనిస్తారు. నాకు ఎప్పట్లాగే వెళ్ళే ముందు క్లాస్ తీసుకుంటారు.

ఈసారి నాన్న ఫోన్ తీసిన నేను 'హలో' అంటూ ఆయనేదో చెప్తుంటే భోరుమన్నాను. ఆయన గొంతు వినగానే నాకెందుకో దుఃఖం ఆగలేదు. ఆగకుండా నేను కొంతసేపు దుఃఖించాకా, అప్పుడు నాన్న మృదువుగా ఏం జరిగిందో కనుక్కున్నారు.

"అసలు ఖాళీ దొరికితే చాలు ఇంట్లో ఉండడు. ఎక్కడికి వెడతాడో చెప్పడు. ఎప్పుడు వస్తాడో తెలీదు. ఎంత చేసినా ఫోన్ ఎత్తడు. వాడు బయటకు వెడితే ఇల్లు చేరేవరకూ నా మనసు మనసులో ఉండదు నాన్నా. ఏం వెలగబెడతాడో తెలీదు. అసలే రోజులు బాగా లేవు. బండేసుకుని రయ్యిన వెళ్ళిపోతాడు. వేగంగా నడపద్దన్నా వినడు, లైసెన్సు కూడా ఇంకా రాలేదు!" అంటూ విషయం చెప్పి, మళ్ళీ భోరుమన్నాను.
వాడి గురించిన వివరాలన్నీ మళ్ళీ మళ్ళీ నన్ను అడిగి, నాకు ఏం చెయ్యాలో నెమ్మదిగా చెప్పారు. ఆ బాధలో నేను ఆయన చెప్పిన వాటన్నిటికీ 'ఊ' కొట్టేసాను. ఇక అంతకన్నా నాకు గత్యంతరం ఏముంది. కానీ ఎందుకో నాన్నకు చెప్పేసాక నాకు మనసు కుదుటపడింది. నాన్న ఈ కష్టం నుండి నన్ను బయటపడేయగలరని కూడా అనిపించి నిశ్చింత నీడ దొరికినట్టైంది.

సుమారు ఒకటిన్నర రోజు తరువాత ఆదివారం రాత్రి చీకటిపడ్డాక వాడు ఇంటికి వచ్చాడు. ప్రతిసారి ఉదయం వెడితే రాత్రికి ఆలస్యమైనా ఇంటికి వచ్చేసేవాడు, ఇలాగ చెయ్యడం ఇదే మొదటిసారి. నేను, సమీరా మామూలుగా తలుపు తీసాం. వాడు తన గదిలోకి వెళ్ళి, స్నానం చేసి, బట్టలు మార్చుకుని, అన్నం పెట్టమన్నాడు. వాడి ముఖంలో అలసట నాకు తెలుస్తోంది. 'ఎక్కడికెళ్ళావని' అడుగుదామన్న ఆత్రుతని అణచుకుని ఊరుకున్నాను. వాడు కూడా మా ప్రవర్తనకి, అందులో వాళ్ళమ్మ కూల్ గా ఉండడం చూసి కాస్త ఆశ్చర్యపోయినట్టే నాకు అనిపించింది. రాత్రి నిద్రపోవడానికి గదిలోకి వెళ్ళబోయే ముందు వాళ్ళమ్మతో ఏదో అనబోయాడు.
"రేపు ఉదయం మాట్లాడుకుందా. వెళ్ళి పడుకో. నాకు కూడా నిద్రొస్తోంది!" అని సమీర చెప్పి లైట్లు ఆర్పేసింది.

ఒక వారం తరువాత వాడికి మూడు రోజులు వరుసగా శలవలు కలిసి వచ్చాయి. వాడిని సమీర ఎలా ఒప్పించిందో మరి, మొత్తానికి ఊరు రావడానికి ఒప్పుకున్నాడు. ఊరు చేరాక నాన్న ఉంటున్న పెంకుటిల్లును వాడు వింతగా చూసాడు. ఇంట్లోకి వెడుతుంటే బయట వాకిట్లోనే నాన్న కాళ్ళు కడుక్కోవడానికి చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చారు. అది చూడగానే వాడి ముఖంలో మొదటి ఆశ్చర్యం మొదలైంది.
"తాతగారూ, అదేమిటి మీకు టేప్స్ లేవా?" అన్నాడు.
"ఇక్కడ అలాంటివి ఉండవు. నూతిలో నీళ్ళు తోడుకోవడమే!" అన్నారు నాన్న. 'ఓహో' అంటూ తలూపాడు. ఆయన స్వయంగా వండిన వంటతో మేము కింద కూర్చునే భోజనం చేసాం. నేను కింద కూర్చోలేక అవస్థ పడుతుంటే నాన్న "బాగా పొట్ట పెంచావు. వ్యాయామం అదీ ఏమీ లేనట్టుంది, ఆ పెధవ చిరుతిళ్ళు తింటూ సమయానికి నిద్రపోకుండా టీవీలు చూడడం చేస్తున్నావు కదూ. నిన్ను ఎలా దారిలో పెడతానో చూడు.

ఇక మీదట  చచ్చినట్టు నేను చెప్పినట్టు నడుచుకోవలసిందే!" అన్నారు గట్టిగానే. నేను తలదించుకోవడం చూసి వాడికి రెండవసారి ఆశ్చర్యం కలిగింది.

"తాతగారూ, నాన్నని అలా తిడుతున్నారేమిటి, నాన్న వయసెంతో తెలుసా అసలు మీకు!" అన్నాడు వాడు.

"హోరి భడవా, వాడి కన్నతండ్రిని నన్నే ఇలా ప్రశ్నిస్తున్నావా! వాడు ఎంత పెద్దవాడైనా నాకు  కొడుకే, నేను వాడికి నాన్ననే. కాబట్టి నేను వాడిని మందలించాల్సిందే, వాడు పడాల్సిందే!" అన్నారు.

మరునాటి ఉదయాన్నే నన్నూ, వాడినీ కూడా ఆరు గంటలకల్లా నిద్ర లేపేసారు. చలికాలం కావడంతో పెరట్లోని కట్టెలపొయ్యి రాజేసి నీళ్ళు తోడి, కాగులో నన్ను నీళ్ళు కాయమన్నారు. కట్టెలు ఆ పక్కనుండి నన్ను మోసుకురమ్మన్నారు. పని అలవాటు లేక కొంత, శరీరం సుఖం మరగడం వల్ల కొంత.. నేను విపరీతంగా అలసిపోయాను. ఆయన పెరట్లో కోసిన తాజాకూరలు  తెస్తే, నేను కత్తిపీటతో కూరలు తరిగాను. అన్ని దినుసులూ ఎక్కడున్నాయో ఆయన చెప్తుంటే సమీర వంట చేసింది. అడపాదడపా నాకు ఆయన అక్షింతలు వేస్తూనే ఉన్నారు. వాడి కళ్ళల్లో ఆశ్చర్యం మొలకెత్తుతూనే ఉంది.

ఒక్క రోజు పనికే నేను విపరీతంగా అలసిపోయి త్వరగా భోజనం చేసి నిద్రలోకి జారిపోయాను. కాసేపటికి నాన్న నా కాళ్ళు పట్టడం అంత నిద్రలోనూ నాకు తెలుస్తోంది, కానీ మత్తుగా ఉండడం వల్ల శరీరం సహకరించక కళ్ళు విడివడట్లేదు. తాతా మనుమళ్ళ మాటలు నా చెవిన పడుతున్నాయి.

"తాతగారూ, మీరేమిటి నాన్న కాళ్ళు పడుతున్నారు?" ఆశ్చర్యంగా అడుగుతున్నాడు వాడు.

"వాడు నాకు కొడుకురా, వాడిని తిడతాను, ఇంకా మాట వినకపోతే కొడతాను కూడా. కానీ వాడికి నొప్పి కలిగితే నేను భరించగలనా చెప్పు. వాడి నొప్పికి నేను ఎక్కువ బాధపడతాను!" అన్నారు.

"ఏమిటి నాన్నని చిన్నప్పుడు మీరు కొట్టారా! పిల్లల్ని కొట్టకూడదు కదా. అమెరికాలో అయితే అదో పెద్ద క్రైమ్ తాతగారూ" అన్నాడు వాడు.

"మీ నాన్న చిన్నప్పుడు ఏం చేసాడో తెలుసా? ఎక్కడ నేర్చాడో మరి... దొంగతనంగా సిగరెట్ కాలుస్తూ నాకు ఒక వీధిలో దొరికిపోయాడు. అంత చిన్న వయసులో అలా చేస్తే కొట్టక ముద్దెట్టుకోవాలా? అయినా అసలు ఎవరైనా చెడు అలవాటుకు బానిస కావడమే తప్పు!" అన్నారు నాన్న.

"అప్పుడేం చేసారు తాతగారూ?బాగా చితక్కొట్టారా!" అన్నాడు వాడు ఆసక్తిగా.

"నేను ఇంట్లో బడితపూజ చేస్తానని అనుకుని భయం భయంగా ఇంట్లోకి వచ్చాడు. వాడు స్నానం చేసి అన్నం తినేవరకూ ఆగి, అప్పుడు వాడిని దగ్గరకు పిలిచి సిగరెట్ తాగితే క్యాన్సర్ ఎలా వస్తుందో, అలా ఎంతమంది తీసుకుని, తీసుకుని చచ్చిపోయారో వివరంగా చెప్పాను. బొమ్మలు కూడా చూపించాను. బాగా భయపడిపోయినట్టున్నాడు మీ నాన్న. అంతే ఆ తరువాత ఆ జోలికి వెళ్ళలేదు. ఇలా చెప్పుకుపోతే ఇంకా ఎన్నో ఉన్నాయి!" అన్నారు.

"అవునా! ఇంకా గట్టిగా కొట్టారనుకున్నాను!" అన్నాడు వాడు.

“ఏ తండ్రైనా తల్లిలాగా లాలించడు. గంభీరంగా కనబడుతూనే లోపల పిల్లలను విపరీతంగా ప్రేమిస్తాడు. తండ్రంటే అలాగే ఉండాలి కూడా. అంతేగానీ తల్లిదండ్రులిద్దరూ మెత్తగా ఉంటే పిల్లలు చెడిపోరూ? ఒకరు తిడితే, ఒకరు ఊరుకోపెట్టాలి. ఇద్దరూ తిట్టారనుకో, అప్పుడు మరి పిల్లలు ఎవరి దగ్గర ఓపెన్ అవుతారు. అందుకే ఒకరలా ఒకరిలా ఉండాలి. నువ్వంటే మీ నాన్నకు పిచ్చి ప్రేమరా అబ్బాయ్. కష్టపడి పెంచిన తండ్రినైన నాకన్నా నీ మీదే ఎక్కువ ప్రేమ ఉంటుంది!” అన్నారు పూడుకుపోతున్న గొంతుతో.

“మీ మీద ఎక్కువ ప్రేమ ఉండాలి కదా తాతగారూ మరి!” అడుగుతున్నాడు వాడు.

“నా పట్ల బాధ్యతా, ప్రేమా ఉంటుంది. కానీ నువ్వు పుట్టాక నీ మీద ఎక్కువ ప్రేమ ఉంటుంది. నువ్వేం చేసినా ఎంత బాధ పెట్టినా క్షమించగలిగేంత అనంతమైన ప్రేమ అది, ఉండాలి కూడా. అది ప్రకృతి సహజం. రేప్పొద్దున్న నువ్వూ అంతే. నాన్నలందరూ ఇలాగే ఉంటారు!” అన్నారు.

సగం నిద్రలో ఉన్నా నాకు కూడా నాన్న గురించి బాగా అర్థమైంది. ఇంత వయసొచ్చీ నాకే నాన్న ప్రేమ అర్థం కాలేదని సిగ్గనిపించింది. నిద్రమత్తులో సోలిపోతున్న కళ్ళు సగం తెరచి వాళ్ళిద్దరినీ చూసాను.

నాన్న మాటలకు వాడి ముఖంలో చూపుల్లో తేడా నాకు స్పష్టంగా తెలుస్తోంది.

***0***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# భగవాన్ నన్ను క్షమించు

కంఠస్ఫూర్తి విజయకనకదుర్గ



సాయంత్రం.. నాలుగున్నర!

చేతిలో స్మార్ట్ ఫోను రింగ్ అయింది.. స్క్రీన్ మీద భర్త ఫొటో కనపడగానే దానిమీద చూపుడువేలుతో చిన్న అడ్డ గీత గీసి "చెప్పండి.. ఏమిటి ?"శ్రీవల్లి విసుగ్గా అంది!

"వల్లీ! నాన్నగారు పోయారట..! ఇప్పుడే .. ఆశ్రమం నుంచి గుమస్తా ఫోన్ చేసి చెప్పాడు.." దివాకరం గొంతులో బాధ, విచారం.. సుడులు తిరిగాయి!

కొన్ని క్షణాలు ఇద్దరి మధ్య మౌనం ఘనీభవించింది!

"ఏం చేద్దాం అనుకుంటున్నారు మీరు?" శ్రీవల్లి అడిగింది.

"నేను వెళ్ళాలి... ఏవో ఫార్మాలిటీస్ ఉంటాయి కదా!"

"అంటే... కర్మకాండ మొత్తం మీరే చేయాలా?"

"అబ్బే అదేం లేదు .. నాన్న గారు ఎప్పుడో తన కళ్ళని బాదం చారిటబుల్ ట్రస్ట్ కి, తన బాడీని రంగరాయ వైద్య కళాశాలకి డొనేట్ చేశారు. కాకపోతే నేను వెళ్లి ఒకటో రెండో సంతకాలు పెట్టాల్సి ఉంటుంది. గుమస్తా కూడా అదే విషయం ఫోన్లో చెప్పాడు!"

"అయితే, అదేదో త్వరగా పూర్తిచేసుకుని రండి! నాని గాడు ఇంకా స్కూల్ నుంచి రాలేదు. వస్తే.. వాడిని రెడీ చేయాలి. సాయంత్రం ఎవరిదో మీ ఫ్రెండ్స్ వాళ్ళది పెళ్లి రిసెప్షన్ ఉంది అన్నారుగా!" శ్రీవల్లి హుంకరింపు.

"అవును... అది సరే! నాన్నను చూడడానికి ఆశ్రమానికి నువ్వు రావా ?" దివాకరం అడిగాడు.

"అమ్మో! అక్కడ మీ నాన్న శవం హఠాత్తుగా లేచి నా చేయి పట్టుకుంటే.. నేనేం చేయాలి? ఇంకేమైనా ఉందా.. నా గుండె ఆగి పోదు.." ఫోన్లో శ్రీవల్లి భయవిహ్వలంగా నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో భావాలు ధ్వనించాయి. దివాకరం మాట్లాడలేదు. అతని మనసులో తండ్రి గురించిన ఆలోచనలు కలవరపెడుతున్నాయి!

నాన్నకు తను ఒక్కడే సంతానం.  అమ్మ పోయిన తర్వాత నాన్న ఒంటరితనంతో.. దాదాపు పిచ్చివాడిలా తయారయ్యాడు. రాత్రి పగలు నిద్రలోనూ "భవానీ భవానీ" అంటూ ఒకటే కలవరింతలు. శ్రీవల్లి  నాన్నకు కాఫీ ఇస్తున్నా.. భోజనం పెడుతున్నా 'భవాని అలా చేసేది.. ఇలా పెట్టేది.. అలా మాట్లాడేది..' అంటూ ఒకటే ముచ్చట్లు. రాను రాను ఆ ముచ్చట్లు, జ్ఞాపకాలు అమ్మ చింతనలో నాన్న ధోరణి పెరిగిందే గానీ తగ్గలేదు. నిత్యం అమ్మ నామస్మరణే!

శ్రీవల్లి చికాకుపడేది.. విసుగు చూపించేది!

"అయితే.. మీరు ఒక్కరే ఎందుకు ఇక్కడ .. ఆవిడ ఎక్కడుందో ఆ దారే మీరు చూసుకోండి?" అంటూ తను వ్యంగ్య బాణాలు విసిరేది.

ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి.. తండ్రి మీద  బోలెడు ఫిర్యాదులు శ్రీవల్లి సిద్ధం చేసి ఉంచేది. అవి క్రమంగా స్థాయి పెరిగి  'మీ నాన్న నాకు పెద్ద తలనొప్పిగా తయారయ్యాడు' అంటూ ఒకటే సణుగుడు. 'నన్ను ఏ పని చేసుకోనివ్వడం లేదు. నేను ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చి నా వెనక నిలబడి ఉంటున్నాడు. నన్ను అదో రకంగా చూస్తున్నాడు. నిజంగా మీ నాన్నకు మతి తప్పింది.. ఏం చేయమంటారు నన్ను?" అంటూ నిలదీసేది. తను తలపట్టుకుసే వాడు.

మరో రోజు పెద్ద ఫిర్యాదే చేసింది!

"నేను స్నానానికి వెళుతూ ఉంటే మీ నాన్న నా చెయ్యి పట్టుకున్నాడు!" అంటూ భోరున ఏడ్చింది శ్రీవల్లి. అదేదో .. నాకూ అసంబద్ధంగా అనిపించింది!

"ఏమిటిది నాన్నా? కోడలు చేయి పట్టుకోవడం ఏమిటి?" తను గొంతు చించుకుని అరిచాడు.

"ఏం లేదురా! దివాకరం.. నాకు బాగా ఆకలి వేస్తోంది. నీకు తెలుసుగా నేను ఆకలికి తట్టుకోలేనని .. 'అమ్మా.. అమ్మా నాకు అన్నం పెట్టేయి అమ్మా' అని అడిగాను. కోడలు వినిపించుకోలేదు.. విసురుగా వెళ్ళిపోతుంటే చేయి పట్టుకుని ఆపాను అంతే!"

నాన్న ముఖంలో ఎప్పటిలాగే అమాయకత్వం.. నిర్మలమైన చూపులు!

"మీ నాన్న ఆకలి మామూలు ఆకలి కాదు. ఆయన్ని నేను భరించలేను. మీరు అర్థం చేసుకుంటారా? నన్ను మరోదారి చూసుకోమంటారా?"

శ్రీవల్లి ఇల్లు అదిరిపోయేలా కేకలు పెట్టింది. ఇరుగుపొరుగు ఇంట్లోకి వచ్చారు.  శ్రీవల్లి ఏడుపు, గోల మరింత ఎక్కువ చేసింది! చుట్టుపక్కల వాళ్ళు నాన్నను చూసి ముక్కున వేలేసుకున్నారు. నాన్న మౌనముద్ర వహించాడు. నాన్న దోషిలా తల వంచుకున్నాడు. పర్యవసానం అనివార్యమైనది.. నాన్న ఆశ్రమవాసం !

***

'సంధ్యా రాగం' వృద్ధాశ్రమంలోకి, తండ్రి ఆలోచనలతో.. బెరుకు బెరుకుగా అడుగుపెట్టాడు దివాకరం! ఆశ్రమం ప్రశాంతంగా ఉంది. చుట్టూ రెల్లుగడ్డితో నేసిన పర్ణశాలలాంటి గదులు. దారి పక్క పచ్చని చెట్లు,

పూలమొక్కలు, మధ్యలో ఆశ్రమం కార్యాలయం ఉంది. దివాకరం ఆ దిశగా అడుగులు వేశాడు. మనసులో ఏదో అపరాధభావం మెలిపెడుతూంది!

"అది ఏదో త్వరగా ముగించుకొని రండి!" చెవిలో శ్రీవల్లి మాటలు కరుకుగా వినబడుతున్నాయి!

ఈ ఆశ్రమానికి తండ్రిని చేర్పించడానికి వచ్చి వెళ్ళిన తర్వాత నాన్నే రెండు మూడు సార్లు ఫోన్ చేశాడు. తను మాత్రం ఆశ్రమానికి రావడం ఇదిగో.. ఇప్పుడే.. ఇలా!

"రండి!" ఆశ్రమం గుమస్తా వరదరాజులు ఎదురు వచ్చి లోపలికి దారి తీశాడు. దివాకరం అభావంగా అతడ్ని అనుసరించాడు !

కార్యాలయానికి పక్కగా ప్రార్థనామందిరం. వెనుక పంచలో తండ్రి పార్థివ శరీరం ఉంచబడింది. ఎవరు వెలిగించారో.. తండ్రి తలవద్ద చమురు దీపం వెలుగుతోంది. అగరవత్తులు నుసిరాలుస్తూ సుగంధ పరిమళాన్ని వెదజల్లుతున్నాయి! తండ్రి శవం వద్ద పదిమందికి పైగా వృద్ధులు.. ఆడ మగ గుమికూడి ఉన్నారు. విషాదవదనాలతో కొందరు, కన్నీళ్లు పెట్టుకుంటున్న వాళ్ళు మరి కొందరు!

దివాకరం చేష్టలుడిగి చూస్తున్నాడు!

చుట్టూ ఉన్న వాళ్ళు కాక ఒక డాక్టరు ఇద్దరూ సహాయకులు, దివాకరం కోసం ఎదురుచూస్తున్నట్టు నిలబడి ఉన్నారు. సహాయకులు దివాకరం వద్దకు వచ్చి రెండు సంతకాలు తీసుకున్నారు!

తండ్రి ముఖం నిర్మలంగా ఉంది. నిద్రలో ఉన్నట్టుగా ఉంది. "ఇప్పుడు తనమీద కోపంతో నాన్న లేచి చెంపదెబ్బ కొడతాడా? చిన్నప్పుడు తనను చీటికీ మాటికీ చెంపదెబ్బలు కొట్టేవాడు. ఇప్పుడు కొట్టలేడు. తిట్టలేడు ఏమి ప్రశ్నించలేడు... పిచ్చి నాన్న!"

దివాకరం మనసు దుఃఖానికి అటూ ఇటూ ఎగసిపడుతోంది!

'బాదం చారిటబుల్ ట్రస్టు' వాళ్ళు తండ్రి కళ్ళ కార్నియాలు పెకలించి తీసుకుపోయారు. నాన్న నేత్రదానం ముగిసింది!

'ఇక తను వెళ్ళి పోవచ్చా? వెళ్లాలి.. వెళ్ళిపోవాలి! శ్రీవల్లి వచ్చేయమని చెప్పిందిగా!' దివాకరం మనసు తొందర పెడుతోంది. అతను తన తండ్రి నిర్జీవ శరీరాన్ని సూటిగా చూడలేకపోతున్నాడు!

ఆశ్రమం బయట మరో ఆసుపత్రి వాహనం గోలపెడుతూ వచ్చి ఆగింది! వైద్య కళాశాలకు చెందిన నలుగురు వ్యక్తులు లోపలకి వచ్చారు. వాళ్లు వరదరాజులుతో మాట్లాడిన తర్వాత, దివాకరం వద్ద సంతకాలు తీసుకున్నారు. ఆ నలుగురు వ్యక్తులు తండ్రి శరీరాన్ని కదిలించి, తెల్లటి గుడ్డ కప్పి, స్ట్రెచర్ మీద పడుకోబెట్టి బయటకు తీసుకుపోవడానికి సిద్ధమయ్యారు!

నాన్న భౌతికకాయాన్ని పరిశోధన గదిలో గాజుపెట్టెలో ద్రావకాల మధ్య భద్రపరచి, వైద్య విద్యార్థులకు పాఠాలు చెబుతారట! నాన్న జీవితం ధన్యం అయిందా? ఏమో.. తనకు మాత్రం అపరకర్మల బాధ్యతల నుంచి తప్పించాడు!

"నాన్నగారిని కాసేపు ఉంచమంటారా?" వరదరాజులు దివాకరాన్ని అడిగాడు.

"వద్దు... అదేం లేదు, తీసుకు వెళ్ళమనండి!" దివాకరం మాటలు తడబడ్డాయి!

ఆస్పత్రి వాళ్ళు తండ్రి శరీరాన్ని బయటకు మోసుకుపోయారు! వరదరాజులతో పాటు అక్కడ వృద్ధులు అందరూ నాన్నకు తుది నమస్కారాలు చేశారు. దివాకరం అప్రయత్నంగా రెండు చేతులు జోడించాడు!

"నేను వెళ్లొచ్చా? "దివాకరం అడిగాడు.

"ఒక్క నిమిషం.. మీ నాన్నగారి గది చూడరూ? గదిలో సామాన్లు .."

వరదరాజులు వెంట అయిష్టంగానే ముందుకు కదిలాడు దివాకరం. ఆయన గదిలో ఏమి ఉన్నాయి? మూడు పంచలు. రెండు తువాళ్ళు, నాలుగు జుబ్బాలు, పొడవాటి స్టూల్ మీద నాన్న కళ్ళజోడు, పాత రత్నం కంపెనీ పెన్ను, ఏవో కొన్ని పుస్తకాలు, మూలగా తాళంకప్పతో ట్రంకు పెట్టె!

"నాన్నగారి జ్ఞాపకంగా.. వీటిలో ఏవైనా మీరు తీసుకు వెళ్ళవచ్చు!"

"నాకేమీ వద్దు. ఎవరైనా అడిగితే ఉచితంగా ఇచ్చేయండి!" దివాకరం మొహం తిప్పుకుని అన్నాడు.

"మీ నాన్నగారు కష్టజీవి. నిత్యం ఏదో ఒక పని చేస్తూ ఉండేవారు. ఆయన ఉత్సాహంగా ఉంటూ, అందరినీ ఉత్సాహపరిచేవారు. ఉపాధ్యాయ వృత్తిలో నుంచి వచ్చిన వారేమో.. ఎన్నో పిట్టకథలు, నీతికథలు సందర్భానుసారం చెప్పి, అందర్నీ నవ్వించేవారు. మీ నాన్నగారు అంటే ఆశ్రమంలో అందరికీ ఒక గౌరవం.. ఒక నమ్మకం!"

'ఈయన ఎందుకు చెప్తున్నాడు ఇదంతా? నన్ను కదలనివ్వడా?' దివాకరం అసహనంగా కదులుతున్నాడు.

"మీ గురించి ఏనాడు ఒక నిష్టూరపు మాట కూడా మాట్లాడలేదు. రాలేదని.. చూడలేదని.. అనలేదు! నా కొడుకు కలెక్టర్ కావలసిన జాతకం, గుమస్తాగా ఉండిపోయాడు అంటూ బాధపడేవారు. అంతేకాదు .."

వరదరాజులు వరద గోదావరిలా మాట్లాడుతూ ట్రంకుపెట్టె తెరిచాడు! పెట్టెలో పోస్టాఫీసు పింఛను పుస్తకం, ఏవో ధనవృద్ధి పథకాల పత్రాలు, ఎప్పటిదో.. తమ పెళ్లినాటి తెలుపు నలుపు ఫోటో, పోస్ట్ చేయని ఎన్నో ఉత్తరాలు, కార్డులు, కవర్లు ఉన్నాయి!

"బాబు ఇవన్నీ నీ పేరున రాసిన ఉత్తరాలే! ఇదేదో ఈ మధ్యనే రాసిన ఉత్తరంలా ఉంది..చూడు!" వరదరాజులు ఒక ఉత్తరం దివాకరం చేతికి అందించాడు. ఆ కవర్ చించి ఉత్తరం బయటకు తీసి.. ఆత్రంగా చదవసాగాడు!

"నాన్నా! దివాకరం!

నీకు ఇదే నా చివరి ఉత్తరం ఏమో? ఇంతకు ముందు చాలా ఉత్తరాలు రాశాను. ఏదీ నీకు పోస్ట్ చేయలేదు. ఎందుకో ఉత్తరం రాసి ముగించేసరికి దాన్ని నీకు పోస్ట్ చేయాలని అనిపించేది కాదు. ఈ ఉత్తరమైనా నీకు పోస్ట్ చేయగలనో లేదో?

ఏదో ఒక రోజు నువ్వు వస్తావని నా ఆశ. చిన్నప్పటి నుంచి నువ్వు తప్పు చేసినప్పుడల్లా.. నిన్ను చెంపదెబ్బలు కొట్టేవాడిని. నీకు క్రమశిక్షణ నేర్పాలన్న ఒక్క తపన తప్ప, నీపై కోపం ఎప్పుడూ లేదు నాకు. చేయవద్దన్న పనిని చేయడమే, నీకు మొదటి నుంచి అలవాటు. పెద్దయ్యాక కూడా నీ అలవాటు మారలేదు. చదువు, ఉద్యోగం, చివరకు నీ పెళ్లి విషయంలోనూ.. నీ పంతమే నెగ్గింది. అమ్మ అర్ధాంతరంగా వెళ్ళిపోయింది. ఒంటరి పక్షిలా మిగిలిన నన్ను తప్పు పట్టి, దోషిగా కోడలు ముద్ర వేస్తే .. నువ్వు సమర్థించి, నలుగురి ముందు దోషిగా నిలబెట్టి అదాటుగా వృద్ధాశ్రమానికి తరలించావు! ఇది నాకు శరాఘాతమే! అయినా నేనిప్పుడూ ఆశ్రమంలో సుఖంగానే ఉన్నాను. కానీ నీకు సుఖం ఏదిరా దివాకరం? ఆనందం ఏది? స్వతంత్రం ఏది? ఒకప్పుడు నా పంతమే నెగ్గాలి అన్న నీ మనస్తత్వం .. కోడలు ముందు ఎంత బలహీనంగా తయారయ్యిందో.. నేను అంచనా వేయగలను!

నాన్నా! నీ పెళ్లిలో కోడలు వడ్డాణం గురించి మన వాళ్ళు ఎవరో గిల్టు నగ అని వ్యాఖ్యానించారని, తను ఎంతో బాధ పడిపోయింది. అది ఉక్రోషంగా మారి, కోపంగా, పట్టుదలగా బుసలు కొట్టి, తనకు సరిపడా వడ్డాణం చేయించమని, ఇప్పటికీ నిన్ను సాధిస్తూనే ఉంది! నిన్ను అసమర్థునిగా చిత్రిస్తూ, చీటికీ మాటికీ 'ఛీ' కొడుతూనే ఉంది. ఇది నేను కళ్లారా ఎన్నోసార్లు చూశాను. నువ్వైతే వాగ్దానం చాలాసార్లు చేసావు గాని, ఆర్థిక స్థితిగతుల వల్ల అది ఎందువల్లనో .. నీకు సాధ్యపడలేదు!

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసిన నాకు వచ్చే పింఛనులో ఆశ్రమం ఖర్చులు పోగా, నెల నెలా దాచిన డబ్బులు కూడబెట్టిన సొమ్ము, మొత్తం నా పోస్ట్ ఆఫీస్ ఖాతాలోనే ఉన్నాయి. ఆ సొమ్ము మొత్తం నీవు తీసుకునే వెసులుబాటు నీకు కలిగించాను. అంగీకార అధికార పత్రాలు పోస్ట్ మాస్టారుకు ఇచ్చి వచ్చాను. ఆ సొమ్ము సుమారు పది లక్షల పైనే ఉంటుంది!

నాన్నా దివాకరం! ఆ సొమ్ముతో వెంటనే కోడలుకి వడ్డాణం చేయించు! అప్పుడైనా ఆమె అహం, కోపం చల్లారి నీకు విలువ పెరుగుతుందేమో! కోడలు ముందు నిటారుగా నిలబడి మాట్లాడగలవేమో? అప్పుడైనా నీకు స్వతంత్రం, సుఖం దక్కుతాయి ఏమో? ఎందుకంటే.. అదే నా ఆఖరి కోరిక బాబు! నాన్నా.. బంధాలు, బంగారు వడ్డాణంలా బలంగా పటిష్టంగా పెనవేసుకుపోవాలి. అంతే గాని బలహీనపడి తెగిపోగూడదు నాయనా!

దివాకరం! నీ గురించి బాధపడిన నిద్రలేని రాత్రులన్నిటినీ మరిచిపోయాను. నువ్వు నిటారుగా నిలబడినట్లు .. కోడలు ముందు ధైర్యంగా మాట్లాడుతున్నట్టు .. నువ్వు నవ్వుతూ నన్ను చూడటానికి వస్తున్నట్లు .. నేనిప్పుడూ కలలు కంటున్నాను! బహుశా ఈ కలలతోనే కన్నుమూస్తానేమో? నా కలలు నిజం చేస్తావు కదూ నాన్నా!"

ఇట్లు

నీ నాన్న ..

చిత్తరువు భగవాన్లువ్రాలు."

దివాకరం కళ్ళు మూసుకున్నాడు. నిలువునా కన్నీటి అశ్రువులతో కరిగి నీరైపోతున్నాడు. దుఃఖభారంతో, పశ్చాత్తాపంతో కుప్పకూలి మోకాళ్ళ మీద కూర్చుండిపోయాడు! తండ్రి రూపాన్ని తలచుకుంటూ, తల వంచుకుని రెండు చేతులు జోడించాడు. అతని కళ్ళు ధారాపాతంగా కన్నీళ్లు వర్షిస్తున్నాయి. అతని నోటి వెంట.. తొమ్మిది అక్షరాలు వెలువడ్డాయి.. "భగవాన్ నన్ను క్షమించు". పదే పదే అతను స్మరిస్తున్నాడు. అప్పుడే.. అతని జేబులోని ఫోనుకూడా మ్రోగింది. దివాకరం ఆవేదనగా .. ఆ ఫోను ఎవరినించో చూసి.. నిర్లిప్తంగా 'హలో' అన్నాడు.

"ఏవండీ! నేను శ్రీవల్లిని మాట్లాడుతున్నాను. నేను ఇప్పుడే ఆశ్రమానికి వస్తున్నానండి. ఆటోలో ఉన్నానండి. మావయ్యగారు పోయారన్న వార్త చెప్పి, మీరు ఫోన్ పెట్టేసిన తర్వాత నా మనస్సాక్షి నన్ను బోనులో నిలదీసిందండి దోషిగా! ఆయన యెడల నేను ఎంత దుర్మార్గంగా, మూర్ఖంగా ప్రవర్తించానో అద్దంలో చూపిస్తూ నన్ను 'ఛీ ఛీ' అని చీదరించుకుందండి! నిజంగా తండ్రిలాంటి మావయ్యగారిని నేను తప్పుగా అర్థం చేసుకున్నానండీ. చాలా అవమానించానండీ, బాధపెట్టానండి. నేను చేసిన పాపానికి .. ఒక్కసారి ఆయన పాదాలను పట్టుకుని, నా కన్నీళ్లతో కడిగి, క్షమించమని వేడుకుంటే తప్ప .. నాకు నిష్కృతి లేదు. దయచేసి నేను వచ్చే వరకూ మావయ్యగారిని అక్కడే ఉంచండి. సరేనా.. ప్లీజ్! ఏవండీ.. ఏవండీ! నేను ఎన్ని మాటలు మాట్లాడినా, ఏడుస్తున్నా.. మీరేమీ మాట్లాడరేం?"


దివాకరంకి మాట రాలేదు!

***O***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# దేవకాంచనం

## వడ్లమాని మణి



వాకింగ్ నుంచి వస్తున్న మాధవరావుకి పువ్వులు కోసేస్తున్న ఆ ఇద్దరినీ చూసేసరికి కోపం వచ్చేసింది. పైగా ఆ ఇద్దరూ వయసు పైబడిన ఆడవాళ్ళు .. అదీ అతని అశక్తత! ఇంట్లో కి విసవిసా వచ్చిన మావగారిని చూసి "ఏమైంది మావయ్యా?"

"మళ్ళీ వాళ్ళు పూలన్నీ కోసేసారమ్మా"

"అయ్యో అవునా?"

"అవును లతా! నిజం చెప్పద్దూ భలే కోపం వచ్చింది. గత మూడు రోజుల నుంచి ఇదే వరస. చెట్లన్నీ బోడి చేసేస్తున్నారు. ఏమన్నా అందామంటే బావుండదాయే!"

పచ్చదనపు చీర మీద ఊదా పూలు అద్దకం చేసినట్లుగా చుట్టూ ఉన్నాయి. వాటిని చూస్తే చాలు పరవశం కలుగుతుంది. దేవకాంచనం పూలు అంటే మాధవరావుకి చాల ఇష్టం. ఆ పూలతో అతనికి ఎన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి.

బ్యాంకులో పనిచేసి రిటైర్ అయిన తరువాత కొడుకు కిరణ్ దగ్గరకు వచ్చాడు. కిరణ్ మెకానికల్ ఇంజనీరింగ్ చదివి ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉండేది ఒరిస్సాలో. అక్కడ పెద్ద పెద్ద ఫాక్టరీస్, ఉద్యోగస్తులు ఉండటానికి పెద్ద టౌన్షిప్ లు ఉన్నాయి. అందులోనే స్కూల్, హాస్పిటల్, గుడి కూడా ఉన్నాయి. విశాలమైన రోడ్స్, వాటికీ రెండు పక్కలా చక్కటి పూలమొక్కలతో పాటు, పెద్ద పెద్ద చెట్లు కూడా ఉన్నాయి.

లింగరాజు దేవాలయాన్ని పోలిన గుడి. చుట్టూరా బంతి, చేమంతి, గులాబీలతో పాటు రంగురంగుల పూల మొక్కలు. రోజు ఉదయం, సాయంకాలం ఆ గుడికి వెళ్ళడం అలవాటుగా మారింది. భార్య కృష్ణవేణి నిత్యం కాకపోయినా తరచూ మాధవరావుతో వెళుతూనే ఉంటుంది.

ప్రశాంతంగా ఉండే ఆ గుడిలో దొరికే హాయి మాటలతో చెప్పేది కాదు .. అది అనుభవించవలసినదే అనుకున్నాడు. గుడిలో పెట్టిన రికార్డు వింటూ కూర్చున్నాడు. సందె చీకట్లు ముసురుకున్నాయి. హారతిగంట వినపడగానే గర్భగుడి దగ్గరగా వెళ్ళాడు. అప్పుడే అక్కడకి ఒకావిడ వచ్చింది. హారతి కళ్ళకద్దుకుంటూ ఎదురుగా చూసింది. మాధవరావుని చూడగానే ఏదో గుర్తుకు వచ్చింది. అవునా కాదా అన్నట్లు చూసింది. ఇవేమీ తెలియని అతను పూజారితో మాట్లాడుతున్నాడు.

***

రెండు రోజులు గడిచాయి. ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని బాల్కనీలో తీరికగా కాఫీ తాగుతున్న మాధవరావు దృష్టి అకస్మాత్తుగా మొక్కల మీదకు వెళ్ళింది.. అన్ని బోసిపోయి కనిపిస్తున్నాయి!

కొంచెం దూరంలో ఇద్దరు ఆడవాళ్ళు గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోతున్నారు. అది చూసి "ఇదిగో ఎమ్మోయ్! అలా పూలు తెంపుకుని వెళ్ళిపోతారా?" అంటూ కేకలేసాడు. మళ్ళీ వాళ్ళని ఒకసారి పరకాయించి చూసాడు. వేరే ఎవరో కాదు వాళ్ళే..!

మావగారి కేకలు విని

"మావయ్యా! మీరు తెలుగులో పిలిస్తే వాళ్ళకి అర్థం కాదు, వాళ్ళ భాష తప్ప వేరేది రాదు వాళ్ళకి!" అంది లత.

"ఛ ఛ అంత బుద్ధిలేదా వాళ్ళకి!" అంటూ కోపంగా అన్నాడు మాధవరావు.

"పోనీలెండి. వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు!" అంటూ సముదాయించింది భార్య కృష్ణవేణి.

అసలు దేవకాంచనం అంటే మాధవరావు ఇష్టానికి మరో కారణం కూడా ఉంది. ఒక్కసారిగా ఆ జ్ఞాపకాల దొంతరలు మనసు పొరలలో కదిలాయి

***

మాధవరావు అప్పుడే బస్సు దిగి ఊళ్లోకి అడుగు పెట్టాడు. గట్టు పక్కగా ఉన్న దేవకాంచనం పూల సువాసన, శివాలయం నుండి వచ్చే ఆ పవిత్ర పరిమళం, గోదావరి మీద నుంచి వచ్చే గాలి.. ఎంత హాయిగా ఉందో, అస్పష్టంగా ఓ రూపం కళ్ళముందు కొచ్చి పొరలా కమ్మేసింది. కాసేపు ఆ పావంచాల మీద కూర్చోవాలని అనిపించింది.

ఇంతలో అటుగా వస్తున్న విశ్వనాధం కనిపించారు. "ఎవరూ?"

"మావయ్యా నేను మాధవను!"

"ఓహ్... ఏమిటి ఇలా వచ్చావు, ఎందుకొచ్చావు?" అన్నట్లున్న ఆ పలకరింపు ధోరణి తనకి తెలిసిందేగా అనుకున్నాడు.

"అదే మావయ్య... అమ్మ నిన్ను కలిసి రమ్మంది!"

"సరే పద ఇంటికి!" అంటూ ముందుకు నడిచాడు. అతని వెనుకే మాధవ కూడా వెళ్ళాడు .

"ఇదిగో... కాంతం కొడుకు వచ్చాడు, వాడికి, నాకు భోజనం పెట్టు!" అని భార్య సుందరిని పిలిచాడు.

లోపలి నుంచి వచ్చిన ఆవిడ మాధవని చూస్తూ "అందరు బావున్నారా?" అని ఓ ముక్తసరి పలకరింపుతో సరిపెట్టింది.
మాధవ్ కళ్ళు లోపల గదులని పరికిస్తున్నాయి. ఎక్కడా తన జాడ లేదు అనుకున్నాడు. భోజనాలయ్యాయి. విశ్వనాథం పడుకున్నాడు. సుందరి వంటిల్లు సర్దుకుంటోంది. ఇక ఏమి చెయ్యాలో తెలియక 'అలా ఊళ్లోకి వెళ్ళొస్తాను' అని మేనత్తకి చెప్పి ఇంటి నుంచి బయట పడ్డాడు.
మాధవ్ ఆలోచనలన్నీ సువర్ణ చుట్టూ తిరుగుతున్నాయి. అలా నడుస్తూ గట్టు దగ్గరకు వచ్చేడు. అక్కడున్న దేవకాంచనం చెట్టు కింద కూర్చుని నిశ్శబ్దంగా గోదావరి తరంగాల గలగలలు వింటున్నాడు.

సువర్ణానికి మరో పేరు కాంచనం. చిన్నతనంలో ఇద్దరూ ఒక్క జట్టు. తల్లి, మేనత్త తెల్లవారుజామున కార్తీక స్నానాలకి వెళ్ళేటప్పుడు, వాళ్ళ కూడా వెళ్ళడం ఎంత బావుండేదో!
తాటాకు బుట్టల్లో తెచ్చుకున్న సామాను.. వత్తులు, నూనె సీసా, ప్రమిదలు, అగ్గిపెట్టె, అగరువత్తులు, అరటిపళ్ళు .. చలికి వణికిపోతూ వాళ్ళకి అందిస్తూ ఉండేవాళ్ళు. దీపాలు నీళ్ళలో వదిలాక ఒడ్డునుంచే దండం పెట్టుకునే వాళ్ళు. ఎంత హాయిగా ఉండేవి ఆ రోజులు. అందుకే అంటారు 'బాల్యం బంగారు ప్రాయం' అని.
ఇంతలో గజ్జెల సవ్వడి వినిపించింది. సుడిగాలిలా పరిగెత్తుకుంటూ సువర్ణ వచ్చింది. "బావా నువ్వొచ్చావని అమ్మ చెప్పింది."
"అదే... మావయ్య నీకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారటగా?"
"అవును బావా! ఎవరో బరంపురం వాళ్ళు.. మనవాళ్ళే! కానీ నాలుగు తరాలుగా అక్కడే సెటిల్ అయ్యారు!"
"మరి నీకు... ఎవరినైనా చేసుకోవాలని..." అర్ధోక్తిలో ఆపేసాడు
"అన్ని అమ్మానాన్నలు చూసుకుంటారులే బావా!"
"మరి నీకు ఎలాంటి వాడు కావాలో అనుకోలేదా?" ఏదో నిరాశ ఆ గొంతులో పలికింది.
"లేదు బావ... నాకనిపించలేదు!"
తనే అనవసరమైన భ్రమలో ఉన్నాడా? నోరు విప్పి చెప్పలేని తన మూగ ప్రేమ సువర్ణకి అర్థం కాలేదేమో? అమ్మ కూడా ముచ్చటపడింది. మేనకోడలే కోడలవుతుందేమో అని..!

మాధవ చిన్నతనంలో తండ్రి పోతే, కాంతమ్మ కొడుకుని తీసుకుని పుట్టింటి కొచ్చింది. పదో తరగతి అయిపోయాక, కాలేజీ చదువు చెప్పించడానికి మరిది రమ్మని అడగగానే కొడుకుని తీసుకుని ఢిల్లీ వెళ్ళిపోయింది.
అక్కడే మరిది పుణ్యమా అని, డిగ్రీ చదివి బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకున్నాడు.

"పోనీ ఒకసారి వెళ్లి మావయ్యను కలువు!" అని తల్లి చెప్పడంతో వచ్చాడు.
"ఇదిగో చూడు బావ! మనం చిన్నప్పుడు ఈ చెట్టుకి నీళ్ళు పోసేవాళ్ళం. ఇప్పుడు చూడు.. చెట్టునిండా ఎన్ని పూలో! ఉదారంగులో విచ్చిన దేవకాంచనం, గుళ్ళో శివుడికి ఈ పూలే పెడతారు.. తెలుసా!" అంటూ పరవశంగా చెప్పింది.
మాధవకి అవేమీ వినిపించటం లేదు
'అయిపోయింది.. ఇక తన ప్రేమ, ఆరాధన వెల్లడించే సమయం మించిపోయింది. తన జీవితంలో ఆ సువర్ణ అధ్యాయం ముగిసిపోయింది..' అనుకుంటూ భారమైన మనసుతో తిరిగి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఇంకెప్పుడూ ఆ ఊరు వెళ్ళాలనిపించలేదు. సువర్ణ పెళ్లికి పిలుపు వచ్చినా తను వెళ్ళలేదు. ఎక్కడో ఒరిస్సాలో ఉంటోందని ఎవరో చెప్పారు. ఆ తరువాత తనకి కృష్ణ వేణితో పెళ్లి అవడం, సంసారబంధం ఏర్పడడం జరిగింది. ఉద్యోగరీత్యా ఢిల్లీలోనే ఉండిపోవటం వల్ల బంధువుల దగ్గరకు రాకపోకలు తక్కువే అయ్యాయి. కొడుకు పుట్టాడు. కొంతకాలానికి తల్లి చనిపోయింది. ఇక అక్కడే స్థిరపడిపోయాడు. కాలంతో పాటు ఎన్నో మార్పులు. కొడుకు కిరణ్ ఇంజనీరింగ్ చేసి, ఒరిస్సాలో పెద్ద కంపెనీలో చేరాడు. కిందటి ఏడాది లతతో పెళ్లయింది. తను కూడా ఇంజినీర్. ప్రస్తుతం బ్రేక్ లో ఉంది. ఇదిగో ఇప్పుడు రిటైర్ అయ్యాక కొడుకు ఇంటికి వచ్చాడు. అదో పెద్ద టౌన్షిప్. ఆ వాతావరణం బాగా నచ్చేసింది. ప్రశాంతంగా ఉంటుంది. ఇన్నేళ్ళ తరువాత అక్కడ చూసాడు దేవకాంచనం చెట్లని. ఆకులు లేకపోయినా చెట్టు పూలతో భారంగా ఉంది.

***

ఇంతలో చేతిలోని ఫోన్ మోగటంతో ఉలిక్కిపడ్డాడు. కొడుకు దగ్గర్నుంచి. "నాన్నా ఇంట్లోకి వచ్చేయండి. క్రికెట్ మ్యాచ్ వస్తోంది!" చెప్పాడు.
పది రోజులు గడిచాయి. నిజానికి ఈ కరోనా మహమ్మారి భయం వల్ల బయటకు వెళ్ళడం చాల తగ్గిపోయింది. వీళ్లుండే బ్లాక్ లో రెండు మూడు కరోన కేసులున్నాయి కాబట్టి జాగ్రత్తగా ఉండమని మెసేజ్లు వచ్చాయి. అదే చెప్పాడు తండ్రికి.

పది రోజులు గడిచిపోయాయి
క్రికెట్ మ్యాచ్ ల వల్ల కూడా సమయం తెలియలేదు. ఉదయాన్నే చాల రోజులు తరువాత బయటకు వచ్చే చూస్తే మొక్కలన్నీ పూలతో భారంగా ఉన్నాయి. దేవకాంచనం విరగబూసి ఉంది.
'ఓహ్ భయంతో వాళ్ళు కోయటానికి రాలేదన్నమాట' అనుకున్నాడు మాధవరావు.
భార్యతో అన్నాడు "ఈ మధ్య ఆ ఆడవాళ్ళు పూలు కోయటం లేదు కాబోసు!"

“ఇదీ మరీ విడ్డూరంగా ఉంది. పూలు కోసుకుంటే కోసేసారని తిట్టేవారు, ఇప్పుడు వాళ్ళు రావటం లేదని బాధ పడుతున్నారా?” అని నవ్వింది కృష్ణవేణి.
“అది కాదులే కృష్ణా! వాళ్ళంటే నాకు ఏమి కోపం లేదు. ఊరికే చిరాకుపడే వాడిని!” అని నసిగేసాడు.

మరునాడు కిరణ్ ఆఫీస్ నుండి తొందరగా వచ్చేసాడు. అతని మొహం అంతా వాడిపోయింది. “ఏం అలా ఉన్నారు?” అడిగింది లత.
“పాండే వాళ్ళ అమ్మగారు పోయారు. పాపం బాగా ఏడ్చాడు. వాళ్ళ అమ్మ గురించి ఎన్నో విషయాలు చెప్పాడు. అన్నట్లు వాళ్ళు తెలుగు వాళ్ళేట. ఇతని తండ్రి ఇక్కడే స్థిరపడ్డ తెలుగువాడు. తల్లి మటుకు గోదావరి దగ్గర ఏదో పల్లెటూరు. అన్నట్లు పాండే పదిహేను రోజుల క్రితం గుడిలో ఉన్న వాళ్ళ అమ్మను తీసుకెళ్ళడానికి వెళ్ళినప్పుడు అప్పుడు నిన్ను చూపిస్తూ ‘మా ఊరి వాళ్ళలా ఉన్నారని’ అందిట. అప్పటికే బాగా లేట్ అయిపోవడంతో నీతో మాట్లాడించ లేకపోయాను అని అన్నాడు నాన్నా. ఆ తరువాత బాగా సిక్ అయిపోయారు. మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చింది”.
‘అయ్యో పాపం... పోయిందా, ఎంత విషాదం’, అనుకుంటూ అందరు కొంతసేపు బాధపడ్డారు. మాధవరావుకి ఏదోలా ఉంది. హృదయం మెలిపెడుతున్న భావన.
“ఆ నాన్నా మర్చిపోయాను. నీలాగే ఆవిడకి ఆ పర్పుల్ రంగు పూలంటే చాల ఇష్టంట!” అన్నాడు .
“వాళ్ళ అమ్మ పేరు ఏంటి!” అని ఆదుర్దాగా అడిగాడు మాధవరావు.
“ఆవిడ పేరు స్వర్ణ, సువర్ణో నాన్నా, ఉండు ఆవిడ ఫోటోలు అన్ని కోలేజ్ చేసి పెట్టాడు నా వాట్సన్ లో” అని చూపించాడు.

మొదటి ఫోటోలో గోదారి గట్టు దగ్గరున్న దేవకాంచనం చెట్టు దగ్గర నవ్వుతూ నిలబడ్డ సువర్ణ!

***0***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# ఏకాగ్రత

డా. శ్రీదేవి శ్రీకాంత్



చెఱువులో కాళ్ళు పెట్టి, నీళ్ళల్లో రాళ్ళు వేస్తూ కూర్చున్నాను. రకరకాల పక్షులు చుట్టూ ఎగురుతూ వున్నాయి. చెఱువులో చేపలు పైకి ఎగురుతూ లోపలికి దూకుతూ వుంటే చూడడానికి ఎంతో బాగుందా దృశ్యం. చెఱువు పైన ఎగురుతున్న కొంగలు ఆశగా నీటిలో చేపల్ని చూస్తున్నాయి. ఎగురుతూ వచ్చి చాలా చాకచక్యంగా చేపల్ని ముక్కుతో కరచుకుని తృప్తిగా ఎగురుతున్నాయి. 'ఆ చేపలు పట్టడంలో ఎంత ఏకాగ్రత కొంగలది?' అనిపించింది. చెఱువు నిండుగా ఉన్న తామరపూలను చూసిన నాలో చక్కని ఆలోచన వచ్చింది.

'రేపే దీపావళి పండుగ. దీపావళికి లక్ష్మీదేవి పూజకోసం తామర్లు కొంటారు. తామర పూలకి బాగా గిరాకీ. వాతావరణం భలే వుంది' అనుకుంటూ, గబగబా చెఱువులో దిగాను. తామరలు కోసుకున్నాను. తాత చుట్ట కొనుక్కురమ్మన్న డబ్బులతో దారిలో తమలపాకు తోటలో తమలపాకులు కొని, పెద్ద సంతకి వెళ్ళాను. లక్ష్మీదేవి తల్లి కరుణించి తామరలు, తమలపాకులూ అన్నీ చిటికెలో అమ్ముడుపోయాయి. ఆ డబ్బు తీసుకుని కుమ్మరి వీధిలో ప్రమిదలు కొని మళ్ళీ సంతలో కూర్చున్నాను. లక్ష్మీదేవి నా వైపు నవ్వుతూ చూస్తున్నట్టు అనిపించింది. ప్రమిదలు అన్నీ అమ్ముడుపోయాయి. 'ఆ డబ్బు చూసి భలే సంతోషం అనిపించింది.' మళ్ళీ లక్ష్మీదేవికి దణ్ణం పెట్టుకున్నాను. అంత డబ్బు మొదటిసారి నేను చూడడం. అప్రయత్నంగా నవ్వు నా ముఖాన్ని అలంకరించింది. 'నువ్వు నవ్వితే నీ కళ్లు చేప పరిగెల్లా మిలమిలలాడుతూ మెరుస్తూ ఉంటాయి' అనే మా అయ్య ఆ మాటలు గుర్తొచ్చి మరింత నవ్వు వచ్చింది.

'తల్లిదండ్రులు మొదటి దేవతలు' అని బడిలో మాష్టారు చెప్పిన మాటలు గుర్తొచ్చి అమ్మకి, అయ్యకి, తాతకి, తమ్ముళ్ళకి బట్టలు కొన్నాను.

మాలాంటి బీదవారికి తగిన బట్టలు సంతలో చవకగా దొరుకుతాయి. 'అవును ఎంత చెట్టుకు అంత గాలి కదా!' నాకు పరికిణీ జాకెట్టు కొనుక్కోవాలి అనిపించినా... 'డబ్బులు చాలవు' అని ఊరుకున్నాను. ఇంకా కొంచం డబ్బు చేతిలో ఉంది. 'ఈ డబ్బుతో రేపు దీపావళి చేసుకోవాలి' అనుకుని మట్టి లక్ష్మీదేవి విగ్రహం, పండ్లు కొన్నాను.

తాతకు చుట్టలు కొనడం ఇష్టం లేదు. ఎలాగైనా చుట్టలు కాల్చడం మానిపించాలి అనుకుంటూ..."చుట్ట కాలవపోతే తల నొచ్చుద్ది" అనే తాత మాటలు గుర్తొచ్చి చుట్టలు కొన్నాను. ఆలస్యం అయ్యిందని తాతకు కోపం వస్తుంది అనుకుని...'తాతకు పంచె కొన్నాగా, కోపం రాదులే' అనుకున్నాను.

***

కిందటి జన్మలో పాపం చేస్తే బీదవాళ్లుగా పుడతారంట. నేను ఏ పాపం చేశానో! వచ్చే జన్మలోనైనా అమ్మా, అయ్యా అందరం గొప్పింట్లో పుట్టాలి. స్కూల్ లో మాష్టారేమో 'కష్టపడితే డబ్బు వస్తుంది' అంటారు. మా బీదోళ్ళం అందరం ఎండలో వానలో కష్టపడతాము... కానీ మా జీవితాలు ఎప్పుడూ ఇంతే ఎందుకో!' అనిపించింది.

"దేవుడా! ఈ జన్మలో మట్టుకు నాకు మంచి మనసు ఇవ్వవూ! నేను ఎలాంటి తప్పు చేయకుండా బాగా చదువుకునే బుర్ర ఇవ్వవూ!" అనుకుంటూ పరిగెడుతున్నా... 'ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్ళి నేను కొన్న బట్టలు అన్నీ ఇంట్లో అందరికీ చూపెట్టాలా!' అని.

***

"అమ్మా! అమ్మా!" అంటూ కొన్నవన్నీ అమ్మ చేతిలో పెడుతుంటే...

"సీతా! చుట్టేదే? ఎప్పుడనగా ఎల్లావే?" అన్నాడు తాత.

ఇంతలో అమ్మ..."నువ్వు ఇయన్నీ ఎట్టా కొన్నావే? డబ్బులేడ కెల్లి అచ్చినాయే!" అంది. నాకు డబ్బులు ఎలా వచ్చాయో విని..."అబ్బో చాలా పెద్ద బుర్రగల దానివే బిడ్డా!" అంది... ఇల్లు అలుకుతున్నదల్లా నా వైపు తిరిగి... "సీర బాగుంది. నీ లగ్గమప్పుడు కడతాను!" అంది.

"ఏడవ తరగతిలో అందరికంటే ఎక్కువ మార్కులతో పాస్ అయ్యాను. అమ్మా! నేను ఇంకా చదువుతాను" అన్నాను.

"ఏం జదువుతావు! మనకు జదువు కుదరది. నీకు లగ్గమ్ జేయాలే. మీ అత్త నామీన కారాలు మిరియాలు నూర బట్టింది! ఆ సీర మీ అత్తకి జూపించినావ్.. దానికి ఇక చైన్ ఉండది!" అంది విసురుగా.

"లేదులే అమ్మా!" అన్నాను. అవును ఈర్ష్యతో ఉన్న మనిషి, మరో మనిషిని కంటిచూపుతోనే దహించగల శక్తి ఉంటుంది.

***

"చంద్రీ!" అంటూ అమ్మను పిలుస్తూ వచ్చాడు మా తాత. "బిక్షపతి లేడానే?" అన్నాడు.

"సుట్ట దెచ్చుకోనాకి పోయిండు" అంది మా అమ్మ గుప్పు గుప్పున నిప్పు వైపు ఉన్న చుట్టను నోట్లో పెట్టుకుని.

"అమ్మా! నీకు సుట్ట ఎందుకే? సుట్ట కాలిస్తే గొంతులో పుళ్ళయి పెద్ద పుండు రోగం వస్తుందట. దానిని గొంతు క్యాన్సర్ అంటారంట. నీకే కాదు, నువ్వు కాల్చేటప్పుడు పక్క నున్న వాళ్ళకి కూడా వస్తుందమ్మా... స్కూల్ లో చెప్పారు!" అన్నాను.

"సుట్ట కాల్చకుంటే ఏదో గుబులు గుబులు అయితాది బిడ్డా. గుబులయితే ఏ పని చేయరాదు!" అంది అమ్మ.

"నీకు ఆ సుట్ట బాధ తప్పే రోజు లొచ్చినాయ్ బిడ్డా!" అన్నాడు నా వైపు తిరిగి మా తాత.

***

"బిక్షపతీ! హైద్రాబాద్ లో ఒక డాక్టరు అయ్యగారు కుటుంబానికి, ఇంట్లో ఉండి పని ఆరచుకోనాకి పని పిల్ల కావల్న అన్నారు. పదిహేను ఏలు ఇస్తరంట. నువ్వా ఛాతీ నొప్పి అని బాగా దగ్గ బట్టినావు. నౌకరీ ఏమి జేస్తవు? సప్పుడు సేయక సీతను నౌకరిలో పెట్టు!" అన్నాడు తాత.

అమ్మ ఒప్పుకుని, అయ్యనూ ఒప్పించింది.

నేను హైద్రాబాద్ వెళ్ళాను. బాబుగారు, అమ్మ గారు ఇద్దరూ డాక్టర్లు. వాళ్ళ కొడుకు, పేరు విజయ్. ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. వాళ్ళ అమ్మాయి పేరు లాస్య. ఐదవ తరగతి చదువుతుంది. చాలా పెద్ద ఇల్లు వాళ్ళది.

"నీ పేరు ఏమిటి?" అని అడిగారు నన్ను. చెప్పాను. "ఇంట్లో వంట చేయడానికి వంటామె వుంది. నువ్వు చిన్న చిన్న పనులు చేస్తూ పిల్లలకు కావలసినవి చూసుకోవాలి!" అన్నారు. తాతకు భోజనం పెట్టి కాస్త డబ్బులు ఇచ్చారు. తాత వెళ్లిపోతుంటే ఏడుపు వచ్చింది. ఆపుకున్నాను.

"లోపలికి వెళ్ళి ఇల్లు చూసిరా!" అన్నారు నన్ను. వాళ్ళ అమ్మాయి లాస్య నా చేయి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. పిల్లల గదులు అందంగా అలంకరించి ఉన్నాయి.

"విద్య మనిషికి జ్ఞానాన్ని ఇస్తుంది" అని ఒక గదిలో రాసి గోడకు వుంది.

మరో గదిలో "విద్యగలవాడు ధనవంతుడు" అని ఉంది. ఆ రెండు వాక్యాలు చదివిన నాకు దిగులు ఎక్కువైంది. "నేనూ చదువుకోవాలి, కానీ ఎలా? బీదరికం. ఇక నా జీవితంలో చదువు లేదు" అనుకున్నాను.

స్వేచ్ఛగా, ఏకాగ్రతతో చెఱువులో చేపలు పట్టిన కొంగలు గుర్తుకు వచ్చాయి. "నేను పక్షిలా పుడితే బాగుండేది కదా!" అనుకున్నాను. చిన్న నిట్టూర్పు నాలో.

ఇంతలో డాక్టరమ్మగారు..."సీతా! నీకు ఉండడానికి ఈ గది" అన్నారు. నేను ఎప్పుడూ మంచం మీద పడుకోలేదు. మెత్తని పరుపు, పైన ఫ్యాన్ చూసిన నేను 'చందమామ కథలో రాజకుమారి'లా భావించుకున్నాను. చాలా ఆనందంగా అనిపించింది. నేను మళ్ళీ లక్ష్మీదేవికి దణ్ణం పెట్టుకున్నాను.

పని తొందరగా చేసుకుని పేపరు చదువుకోవడం దినచర్య నాకు. ఎవరన్నా ఇంటికి వచ్చిన వాళ్ళు నన్ను చూసి "ఎవరూ? ఈ అమ్మాయి, చాలా అందంగా వుందే!" అనే వాళ్ళు. డాక్టరయ్యగారు మా చెల్లెలి

కూతురు అనేవారు. మొదట్లో ఎందుకు అలా అంటున్నారో అర్థం కాలేదు. తరువాత అర్థం అయ్యింది. "బాల కార్మికురాలి కిందకు వస్తాను!" అందుకే అని.

***

"చిన్న బాబూ... టిఫిన్ తినడానికి అమ్మగారు రమ్మంటున్నారు!" అన్నాను.

"సీతా! నా పేరు విజయ్. అలాగే పిలువు!" అన్నాడు విజయ్.

ఒకరోజు లాస్య లెక్కలు చేసుకుంటుంది. పాపం లెక్క సరిగా రావడం లేదు. నేను లెక్కలు చెప్పాను. అంతలో డాక్టరమ్మగారు వచ్చి చూశారు. నేను చెప్పే తీరు చూసి ఆశ్చర్య పోయారు. అప్పుడే అక్కడికి వచ్చిన డాక్టరయ్యగారు చూసి "సీతా! నువ్వు ఏం చదువుకున్నావు?" అని అడిగారు.

గబగబా పరిగెత్తుకుని నా గదిలోకి వెళ్ళి, నా పెట్టెలో వున్న మార్కులు తెచ్చి చూపించాను. అంతే "నువ్వు పనిమానేయ్!" అన్నారు. నాన్న పరిస్థితి గుర్తొచ్చింది. 'పనిలోంచి తీసెయ్యొద్దని' కళ్లనీళ్ళు పెట్టుకున్నాను. .

"ఏడవకు సీతా! నీకు నేను చదువు చెప్పిస్తాను" అన్నారు. నాకు పుస్తకాలు కొన్నారు. పిల్లలకు ట్యూషన్ చెప్పే మాష్టారుతో నాకూ పాఠాలు చెప్పించడం మొదలు పెట్టారు. మాష్టారు నన్ను చాలా మెచ్చుకునే వాళ్ళు. "బాగా చదువుకో. నీకు జ్ఞాపకశక్తి ఎక్కువ. కలెక్టరు అవుతావు!" అనేవాళ్ళు. ఇంట్లో అందరూ ఇంగ్లీషు ఎక్కువ మాట్లాడడంతో నాకు బాగా ఇంగ్లీష్ వచ్చింది.

నాన్న ఆరోగ్యం బాగా క్షీణించింది. మందు తాగడం, చుట్ట తాగడం మానలేదు. నాన్నకు లంగ్ క్యాన్సర్ వచ్చి చనిపోయాడు. ఆ తరువాత అమ్మ చుట్ట కాల్చడం మానేసింది. 'తమ్ముళ్లు ఇద్దరినీ బాగా చదివిద్దాం' అన్నాను అమ్మతో. తమ్ముళ్లు బాగా చదువుతున్నారు.

***

ఆ రోజు విజయ్ పుట్టిన రోజు. ఆ రోజే విజయ్ డిగ్రీ పరీక్షల రిజల్ట్స్ వచ్చాయి. చాలా సంతోషంగా ఉన్నాడు. నేను పాయసం చేసి విజయ్ గదిలోకి తీసుకు వెళ్ళాను. విజయ్ పాయసం తీసుకున్నట్లు వంగి నాకు ముద్దు పెట్టాడు. నిశ్చేష్ఠురాలను అయ్యాను.

"సీతా! నా పుట్టిన రోజు కదా! నీకు ఇచ్చిన స్వీట్ కిస్ ఇది. నీకు ఎప్పుడూ గుర్తుండాలి!" అన్నాడు.

నా జీవితంలో నిజంగా అదో ఆప్యాయ చిహ్నం. నేను ఏమీ మాట్లాడలేదు. ఒక్క ఉరుకున వంటింట్లోకి వెళ్ళి పోయాను.

అదే రోజు నాకు డాక్టరమ్మ గారు కొత్త బట్టలు ఇచ్చారు. 'సాయంత్రం పార్టీలో వేసుకో' అన్నారు. విజయ్ నావైపే కన్నార్పకుండా చూడడాన్ని గమనించాను. ఆ పార్టీకి వచ్చిన చాలా మంది నన్ను చూపించి..."ఆ అమ్మాయి ఎవరూ?" అని అడుగుతున్నారు.

లాస్య నా దగ్గరకు వచ్చి "దిష్టి చుక్క పెట్టుకో సీతా! అందరూ నిన్ను చూసి అప్సరసలా ఉంది.. అని అనుకుంటున్నారు!" అంది నవ్వుతూ.

***

ఆ రోజు డిగ్రీ పరీక్షా ఫలితాలు వచ్చాయి. నేను మొదటి శ్రేణిలో పాసయ్యాను. నేను పడిన ఆనందం కంటే ఇంట్లో అందరూ చాలా సంబరపడి పోయారు.

"సీతా! నువ్వు సివిల్స్ చదువు!" అన్నారు డాక్టరయ్యగారు.

పనంతా చేసుకుని చదివేదాన్ని. నాకు ఎప్పుడూ చేపలు పట్టిన కొంగలు గుర్తు వచ్చి..."ఏకాగ్రత ఉండాలి" అనుకునే దాన్ని.

సివిల్స్ రాసిన నాకు.. మూడవ ర్యాంక్ వచ్చింది. సొంత బిడ్డ పరీక్ష పాసైన ఆనందం వారిలో చూశాను.

***

నేను లంగా ఓణీ వేసుకుని, తల నిండుగా మల్లెపూలు పెట్టుకుని అద్దంలో చూసుకుంటున్నాను. విజయ్ నా గదిలోకి వచ్చాడు. నన్ను గట్టిగా హృదయానికి హత్తుకుని ముద్దు పెట్టాడు. నేను ఎందుకో వారించలేదు. నాకు బంగారు లక్ష్మీదేవి లాకెట్ ఉన్న గొలుసు ఇచ్చాడు. వద్దని అన్నాను. "లక్ష్మీదేవి అంటే నీకు ఇష్టం. వద్దని చెప్పకూడదు, నీ విజయానికి గుర్తుగా ఈ కానుక!" అన్నాడు.

మిస్సోరీలో ట్రెనింగ్ తరువాత గుజరాత్ లోని జాంనగర్ లో కలెక్టరుగా పోస్టింగ్ వేశారు నాకు.

***

విజయ్ నుండి ఫోన్.. "కలెక్టరు గారా!" అన్నాడు.

"హై విజయ్! నేను సీతను" అన్నాను. ఇద్దరం ఒక్కటిగా నవ్వేశాం పెద్దగా.

"సీతా! విద్య విలువ తెలుసుకుని నువ్వు అనుకున్నది సాధించావు. నాకు చాలా సంతోషంగా ఉంది. నువ్వు కలెక్టరు అయితే, నేనే కలెక్టరు అయిన సంతోషంగా ఉంది నాకు. ఎందుకో నువ్వు చాలా దూరంగా ఉన్నావనే దిగులు మాత్రం చాలా ఉంది!" అన్నాడు.

నిజం చెప్పాలంటే నాకూ అలాగే ఉంది.

నాకు విజయ్ అంటే చాలా ఇష్టం. కొన్ని ఇష్టాలు మనస్సులోనే పవిత్రంగా ఉంటాయి. బయటికి చెప్పుకోలేము. తక్కువ కులం, బీదరికం నుంచి వచ్చిన నాకు తాహతు లేదు. నేను కలెక్టరు అయినా... పూర్వం పని పిల్లను. నిద్ర పోయే ముందు విజయ్ ముఖం గుర్తుకు వస్తుంది. నిద్ర మధ్యలో లేచినా విజయ్ గుర్తుకు వస్తాడు. కలలో విజయ్. ఏ పని చేస్తున్నా, నన్ను వెన్నంటి ప్రోత్సహిస్తున్నట్లు అనిపిస్తుంది. ప్రొద్దుట నిద్ర లేవగానే విజయ్ ముఖం నా కళ్ళ ఎదుట కనబడుతుంది. 'విజయ్ నా ప్రాణంలా అయిపోయాడు. నా ప్రాణం కదా, నా గుండెలోనే దాచుకోవాలి' అనుకున్నాను.

***

నేను కలెక్టరు అయ్యాక, చాలా చోట్ల ప్రసంగాలు ఇస్తూ..."మద్యపానం, ధూమపానం ఎంత హానికరమో చెబుతూ, దానికి సంబంధించిన చిన్న డాక్యుమెంటరీ సినిమాలు తీసి నాలుగు రోడ్ల కూడలిలో వాటిని

ప్రసారం చేయించాను. మురికివాడ అని అందరూ అంటున్న, ఆ పదం వాడకుండా పచ్చదనం, శుభ్రంగా వుండే పరిసరాల కోసం.. ముఖ్యంగా పిల్లల్లో చైతన్యం రావాలి!" అని చెప్పేదాన్ని.
నిత్యం ప్రసంగాలు, ప్రణాళికలు. 'నా దేశాన్ని సుభిక్షం చేయాలి' అనే తపన నాలో.

***


"ఏమిటీ! కుర్చీలో కూర్చుని కునికి పాట్లు పడుతున్నారు కలెక్టరు గారు!" అంటున్న విజయ్ గొంతు. కళ్లు తెరిచిన నాకు ఆనందం అనిపించింది. ఎదురుగా విజయ్. లేచి వెళ్ళి గట్టిగా విజయ్ ని కౌగిలించుకున్నాను.
"సీతా! నువ్వేనా!" అంటూ నా పెదాలు చుంబిస్తూ... ఆశ్చర్యంగా నన్ను గట్టిగా పొదివి పట్టుకున్నాడు.
"సీతా! నిన్ను చూడకుండా వుండలేక పోతున్నాను. మనం పెళ్ళి చేసుకుందాం!" అన్నాడు విజయ్.
'నేను చదువుకో బట్టే కదా... కలెక్టరు అయ్యాను. అలాగే మంచి వ్యక్తితో పెళ్ళి కాబోతోంది. చదువు అన్ని సంపదల్లో కెల్లా గొప్ప సంపద' అనుకున్నాను మనస్సులో. 'చదువుకుంటే కులాలు మతాలు అనే అడ్డుగోడలు వుండవు. ప్రపంచమంతా మన దగ్గరే ఉన్నట్లు ఉంటుంది.'
'అవును ఏకాగ్రత వుంటే ఏదైనా సాధించవచ్చు' చెఱువులో చేపల్ని ముక్కుతో పట్టుకుని ఎగురుతున్న కొంగలు గుర్తొచ్చాయి.

***0***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# రంగు కాగితం

## కుంతి




"నాన్నా! రేపు నా పుట్టిన రోజు. ఐదవ తరగతి నుండి పట్టు లంగా అడుగుతున్నాను. నేను ఇపుడు ఏడవ తరగతి. ఈ సారైనా కొనివ్వండి. అలాగే సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు స్వీట్స్, చాక్లెట్స్, బార్బీ బొమ్మ కూడా కొనుక్కురండి"

బట్టలకొట్టులో సేల్స్ మెన్ గా పనిచేస్తున్న తండ్రి రామారావు వైపు చూస్తూ అతడి కూతురు గోముగా అడిగింది.

ఎపుడూ పుస్తకాలతో, చదివే లోకంగా భావించే కూతురు వంక ప్రేమగా చూశాడు.

"తన కూతురు ఎంత చక్కనిది. ఎంత తెలివైనది... ఏ డబ్బున్న వాళ్ళ ఇంటిలోనో పుడితే ఆలనా పాలనా చక్కగా జరిగేది.. అన్నీ రంగాలలో రాణించేది!" అనుకున్నాడు మనసులో బాధగా.

ఇంటిలో తాండవిస్తున్న దారిద్రపుగొట్టు చీకాకులను భరించలేని రామారావు భార్య ఆండాళు, ఆ కోపాన్ని, అసహనాన్ని గిన్నెలపైన, గరిటెలపైన చూపిస్తూ, "తెస్తాడు.. తెస్తాడు! కొంపలో రేపటికి తినడానికి తిండి గింజలు లేవు. ఇక పప్పుల ఉప్పుల సంగతి చెప్పనే వద్దు. కానీ నీకు మాత్రం పట్టు లంగా తెస్తాడు! నేను కాపురానికి వచ్చినప్పటి నుండి అడుగుతున్న బంగారు గాజులూ తెస్తాడు!" అంటూ మొహంలో ఏవగింపుతో, మాటల్లో చీదరింపులతో వంటింటిలో నుండి బయటికి వచ్చింది.

"ఇదిగో మిమ్మల్నే! ఈ దరిద్ర సంసారాన్ని నేను ఈడ్చలేను. రెండు నెలల నుండి అమ్మాయి స్కూల్ ఫీజ్ కట్టలేదు. ఈ కుక్కి కొంపకు మూడు నెలల అద్దె బాకీ. ఇంటిలో సరుకులు లేవు. మూడు నెలలుగా పాలవాడికి డబ్బులు ఇవ్వలేదు. వాడు రేపటి నుండి పాలు పోయనన్నాడు! పుట్టిన రోజులు, పెళ్లి రోజులు వంటి సంబరాలు మీరు మాకు చేయలేరు కానీ, మమ్మల్ని కూటికీ గుడ్డకీ చంపకండి"

"..................."

"మిమ్మల్నే! ఎన్ని అన్నా అలా గోడకు కొట్టిన మేకులా ఉలుకూ పలుకూ లేదేమిటి?"

"..................."

“మిమ్మల్ని అందలాలు ఎక్కించమనడం లేదు. మా బ్రతుకులను కొంతలో కొంతైనా ప్రశాంతంగా గడిచేట్లు చూడండి! అయినా మీ లాంటి వాళ్ళకు పెళ్ళిళ్ళూ, పెళ్ళాలూ ఎందుకో? ‘తాదూర కంత లేదు మెడకో డోలు’ అన్నట్లు... మాలాంటి వారి జీవితాలను నరకప్రాయం చేయడం తప్ప.. ”

మౌనంగా, అభావంగా అలవాటైన భార్య తిట్ల దండకాన్ని వింటూ, కూతురు వంక చూశాడు.

జరిగిన రాద్ధాంతాన్ని గమనించి, “నాన్నా.. సారీ!” అన్నట్లుగా చూసింది.

ఎప్పుడు ఏ పూర్వజన్మలో చేసుకున్న పుణ్యఫలమో? కష్టాలలో ఉన్న వారిని ఆదరించి నాలుగు సాంత్వన వచనాలు పలికిన ఫలితమో? ఎడారిలో ఒయాసిస్సు, కారు చీకటిలో నుండి మొలుచుకొని వచ్చిన వెలుగు రేఖ తన కూతురు! తన భావాలను, తన జీవితాన్ని అంత చిన్న వయసులోనే అర్థం చేసుకోనే ఆ కూతురంటే అతడికి పట్టలేని ప్రేమ.

ఆ క్షణం అతనికి తన బండబారిన ఆప్యాయతా రహితమైన జీవితాన్ని చూసి బాధ కలగలేదు. దేవుడిచ్చిన ఈ అమూల్యమైన కానుకను చక్కగా పెంచుకోలేకపోతున్నాననే బాధ కళ్ళలోకి కన్నీళ్ళ రూపంలో తన్నుకొని వచ్చింది. కూతురుని దగ్గరికి తీసుకొని నుదురు చుంబించాడు.

“వెళతాను” అన్నట్లు కళ్ళతో చెబుతూ బయటికి పోబోయాడు.

“నేను ఇంత సేపూ చెవి కోసిన మేకలా అరుస్తుంటే పట్టించుకోరేమి? మా అతీగతీ చూడవల్సిన బాధ్యత మీకు లేదా? ఈ ఇల్లు ఎలా గడవాలి.. ఈ అప్పులు ఎలా తీర్చాలి.. అన్న ఆలోచన లేదా? మీరెలాగూ అసమర్థులు. మీ తల తాకట్టు పెట్టినా చిల్లుగవ్వ కూడా రాదు. ఇదిగో నా వంటి మీద చివరి వస్తువు. మంగళ సూత్రం. రెండు గ్రాములైన చేయవచ్చు. దీనిని కుదువ బెట్టి సాయంత్రం డబ్బులు తెండి. ప్రస్తుతం సమస్యలను వెళ్ళదీద్దాం!”

మౌనంగా భార్య చేతిలో నుండి ఆ వస్తువును తీసుకొని జేబులో వేసుకున్నాడు. కూతురు వంక చూశాడు.

“వెళ్లిపో!” అంటూ సైగ చేసింది.

సైకిల్ తీయబోయాడు. ట్యూబ్ పంచర్ అయ్యింది. పెడల్ కూడా ఊడిపోయింది. దానిని అక్కడ పడేసి, బాధల బరువును భుజాన వేసుకొని నడక ప్రారంభించాడు.

షాప్ లోకి అడుగు పెట్టినప్పటినుండి సాయంత్రం వరకు ఊపిరి సలపనంత పని. తాత్కాలికంగా అన్నీ మరిచిపోయాడు. ఆరు గంటలకు యజమాని దగ్గరికి వెళ్ళాడు. తన కష్టాలను, ఇబ్బందులను ఏకరువు పెట్టి రెండు వేల రూపాయలను అడ్వాన్స్ గా ఇవ్వమన్నాడు. రామారావు నొద అంతా శ్రవ్య నాటకంలా విన్న యజమాని .. “కుదరదు. కావలిస్తే యేదైనా వస్తువు ఉంటే ఇయ్యి. మా బావమరిది దగ్గర తాకట్టు పెట్టి ఇస్తాను.” అన్నాడు. రామారావు మాట్లాడకుండా తన దగ్గర ఉన్న మంగళసూత్రం ఇచ్చాడు. “నా దగ్గర పనిచేసే వాడివి. ఆ మాత్రం సాయం చేయలేకపోతానా? అసలే నాది జాలి గుండె” అంటూ దానకర్ణునిలా ఫోజ్ పెడుతూ, పక్కనే ఉన్న బావ మరిది షాప్ లోకి వెళ్ళి వచ్చాడు. రెండు వేలు చేతిలో పెట్టాడు. నిజానికి

అతడే తాకట్టు పెట్టుకునేది. బావమరిది పేరు చెప్పి అప్పులు ఇస్తుంటాడు. అది తీసుకునే వారికి తెలుసు. అయినా తీసుకునేవారి అవసరం తాను ఆడే నాటకాలను తెలియనట్లుగా నటించేలా చేస్తుంది.

"ఈ డబ్బుతో కొంత పచారీ కొట్టు బాకీ తీర్చాలి. కొంత ఇంటి అద్దె చెల్లించాలి" అని అనుకుంటూ యజమానికి కృతజ్ఞతలు తెలియచేసి, షాప్ నుండి బయటపడ్డాడు రామారావు.

రామారావు అలసటగా నడుస్తున్నాడు. రోడ్డుపైన పెద్దగా జనాలు లేరు. అడపాదడపా వాహనాలు వస్తున్నాయి. పోతున్నాయి. బాగా చీకటిగా ఉంది. పేవుమెంట్ పైన నడుస్తున్నాడు. కాలికి ఏదో తగిలినట్లనిపించి, క్రిందికి చూశాడు. తన లాంటి వాడు ఎప్పుడూ దగ్గర ఉండాలనుకునే రంగు రంగుల కాగితం. రెండు వేల రూపాయల నోటు. పైగా కొత్తగా ముద్రణ పొందినది. సజీవ ప్రపంచాన్ని శాసిస్తున్న నిర్జీవ పదార్ధం. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న మకుటం, రాజ్యం లేని చక్రవర్తి.

చుట్టూ పక్కలా, వెనకా ముందూ చూశాడు. ఒక్క సారి భయపడ్డాడు.

ఎవరో అభాగ్యులు పారేసుకున్నారు. "పాపం!" అని దిగులుపడ్డాడు. చుట్టు పక్కలా మరొకసారి కలయజూసాడు.

"ఎవరయినా పోగొట్టుకున్నారేమో? అడిగితే ఎవరిది వారికి ఇచ్చేద్దాం!" అనుకున్నాడు.

ఎవరూ కనబడ లేదు. "నాకిది దొరికింది!" అని ఆనంద పడ్డాడు. మళ్ళీ ఒకసారి చుట్టూరా చూసి వంగి దానిని అందుకున్నాడు. వంద, అయిదు వందల నోటు కాదు. రెండు వేల రూపాయల నోటు. తన వారం కష్టం. 'ఎవరు పారేసుకున్నారో? నాకు దొరికింది!' అంటూ జేబులో దోపుకున్నాడు. జేబులో మంగళసూత్రం తాకట్టు పెట్టగా వచ్చిన రెండు వేల రూపాయలతో పాటుగా, మరొక రెండు వేల రూపాయలు చేరడంతో, "దీనితో ఏమి చేయాలబ్బా?" అంటూ ఉక్కిరిబిక్కిరి కాసాగాడు.

ప్రశ్నలు సమాధానాలు వెంటవెంటనే రాసాగాయి. "ఈ నోటు నాలాంటి అభాగ్యుడెవ్వరో పారేసుకొని ఉంటాడు. అది వాడికి ఎంత అవసరమో ? పోనీ అతడెవరో తెలుసుకొని ఇచ్చేస్తే?"

"నాలాంటి వాడి దగ్గర ఇంత పెద్ద నోటు ఎందుకు ఉంటుంది? అయినా ఈ నోటు వెనకాల ఫలానా, అని చిరునామా రాసి లేదు కదా?"

"పోనీ ధర్మంగా ఎవరికైనా ఇస్తే"

"వీడికింత డబ్బు ఎక్కడిదని సందేహిస్తారు?

"పోలీసులకు అప్ప చెప్పితే"

"అసలు వాడికి చేరదు"

"దేవుని హుండీలో వేస్తే?"

"అమ్మో ఇంత డబ్బు హుండీ లోనా?"

"అలా కాదు ఆండాళ్ కు గాజులు ..........."

"గిల్ట్ నగ కూడా రాదు"

"పాపకు మంచి పట్టు లంగా .........."

"రాదు!'

ఆ డబ్బు తోటి కొండవీటి చాంతాడంతటి తన అవసరం తీరదని నిర్ణయించుకోవడంతో,

"ఒక పని చేద్దాం. తాకట్టు పెట్టిన వస్తువును విడిపిద్దాం.'

"అయిడియా బాగుంది!" అనుకున్నాడు.

ఈ నడకలో, ఈ ఆలోచనలతో గమనించలేదు గాని, అతడు మెయిన్ రోడ్ చౌరస్తా వైపు వచ్చాడు. చౌరస్తాలో ఒక కార్నర్ లో దేదీప్యమానంగా వెలుగుతూ, రకరకాల షాపులు కనబడుతున్నాయి. అవసరం లేదు కాబట్టి వాటి వంక ఎప్పుడూ శ్రద్ధగా చూడలేదు. ఆకర్షణీయమైన డెకరేషన్లతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో, బట్టల దుకాణాలు, స్వీట్ షాపులు, ఎలక్ట్రానిక్ దుకాణాలు, చెప్పుల దుకాణాలు వరుసగా ఉన్నాయి. కొన్ని దుకాణాల నుండి సంగీతం వినిపించసాగింది.

అతడికి ఉన్నట్లుండి ఆలోచన మారింది .

"రోడ్ల పైన అమ్మే బట్టల తప్ప, నా కూతురుకు ఏనాడూ మంచి బట్టలు కొనలేదు. వీధి చివర బండి మీద జిలేబీ తప్ప, ఏ రోజు ఖరీదైన స్వీట్ కొనిపెట్టలేదు. కాబట్టి ఈ డబ్బుతో పాపకు ఒక మంచి డ్రెస్సు, ఒక కిలో స్వీట్ కొంటే............?"

"ఏమైనా మిగిలితే అప్పు కూడా కొంత తీర్చి వేస్తే.. ?" అనుకున్నాడు.

చాలా లావిష్ గా , రిచ్ గా ఉన్న స్వీట్ షాప్ లోకి అడుగు పెట్టాడు. అద్దాల బీరువాలో ఉన్న స్వీట్ లను చూశాడు. చాలా వరకు అవేమిటో, వాటి పేర్లేమిటో అతడికి తెలియదు. అతి తక్కువ ధర ఉన్న స్వీట్ తీసుకున్నాడు. కౌంటర్ లో అంతకు ముందు దొరికిన రెండు వేల రూపాయల నోటు ఇచ్చాడు.

క్యాషియర్ ఆ నోటు తీసుకొని అటూ ఇటూ చూశాడు. కాసేపు ఆలోచించాడు.

"మీరు కాసేపు ఇక్కడే ఉండండి!" అంటూ ఎటో వెళ్ళిపోయాడు.

రామారావులో ఏదో తెలియని భయం ప్రవేశించింది. సిక్స్త్ సెన్స్ కీడు శంకించసాగింది. పది నిమిషాలు గడిచాయి. ఇంతలో షాపుకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ నుండి ఒక ఇనస్పెక్టర్, ఒక కానిస్టేబుల్ వచ్చారు.

"ఇతడే సార్! ఈ నోటు ఇచ్చింది. నాకు డౌట్ రాగానే ఫోన్ చేశాను. మీరు సకాలంలో వచ్చారు!" అంటూ రామారావు వైపు చేయి చూపుతూ పలికాడు క్యాషియర్ .

"థాంక్యూ మిష్టర్! మార్కెట్లోకి కొత్తగా వచ్చిన నోట్లను కూడా దొంగనోట్లుగా అచ్చు వేస్తున్న ముఠాను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. వీడొక్కడు దొరికాడు. తీగ దొరికింది. డొంక కదులుతుంది!"

షాప్ లో ఉన్నవారికి, రామారావుకు ఏమి జరుగుతుందో అర్థం అయ్యేలోగా, కానిస్టేబుల్ రామారావు రెక్కలు విరిచి, లాక్కొనిపోయి పోలీస్ జీప్ లోకి తోయడం, జీప్ వెంటనే కదలడం జరిగిపోయింది.

రామారావుకు ఏమి జరుగుతున్నదో అర్థం చేసుకునేలోగా, పోలీస్ జీప్ కొన్ని వీధులు, కొన్ని మలుపు తిరిగి ఒక నిర్మానుష్య ప్రదేశంలో ఆగింది.

ఇన్ స్పెక్టర్ జీప్ దిగి, సిగరేట్ వెలిగించుకొని, కొంత దూరం వెళ్ళి నిలుచున్నాడు.

"ఏమి సంగతి? నీ పేరేంది? ఎన్ని రోజుల నుండి ఈ దందా చేస్తున్నావు? మీ గ్యాంగ్లో ఎంత మంది ఉన్నారు?" రామారావు చొక్కా కాలర్ పట్టుకొని, లాఠీని మెడపైన గుచ్చుతూ, మధ్యమధ్యలో బూతులు ప్రయోగిస్తూ ప్రశ్నించసాగాడు కానిస్టేబుల్.

కానిస్టేబుల్ ప్రశ్నలకు కంగారు పడుతూ, నోరు పెగల్చుకుని, "సార్! ప్రమాణపూర్తిగా చెబుతున్నాను. నాకు ఏ ముఠాతో సంబంధం లేదు. నేను సికింద్రాబాద్ లో చిన్న బట్టల కొట్టులో సేల్స్ మాన్ ను. నాకు ఎనిమిది వేల జీతం. నేను నడిచి వస్తుంటే నాకు ఆ నోటు దొరికింది. కావలిస్తే ఆ నోటు మీరే తీసుకోండి. నన్ను వదిలి వేయండి. మీ కాళ్ళు పట్టుకుంటాను!" అన్నాడు.

కానిస్టేబుల్ రెండువేల నోటు తీసుకొని, "సరే.. సరే! నిన్ను చూస్తే జాలి వేస్తుంది. మా సార్ కు ఏదో ఒకటి చెబుతాను. నీ జేబులో ఇంకా ఎన్ని పైసలు ఉన్నాయి. అవి తియ్యి!" అన్నాడు.

"సార్! నన్ను వదిలేయండి సార్! నా దగ్గర...." రామారావు నీళ్ళు నమలసాగాడు.

"ఏమిరా లం.. కొడకా. నా దగ్గర నకరాలు జేస్తున్నావు!" అంటూ చెంప చెళ్ళుమనిపించాడు.

"నిజం సార్! నా బిడ్డ మీద ప్రమాణం సార్ ! ఇపుడే నా భార్య మంగళసూత్రం కుదువబెట్టి ఇంటి అవసరాలకు అప్పు తెచ్చుకున్నాను"

"కథలు చెబుతున్నావా? బో...., తేరీ మా........ బొక్కలో తోయమంటవా?" అంటూ ముఖంపైన పిడిగుద్దులు గుద్దాడు.

ఆ బూతులు, ఆ హింస భరించలేక రామారావు తన జేబులో ఉన్న తాకట్టు పెట్టగా వచ్చిన సొమ్మును, కానిస్టేబుల్ చేతిలో పెట్టాడు.

డబ్బులు చేతిలో పడగానే రామారావును జీపు నుండి దించేసి, ఇనస్పెక్టర్ ను పిలిచి, జీప్ స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు.

రామారావుకు తల అంతా బరువెక్కింది. ఒక్కసారిగా గంటలో జరిగినదంతా మాయలా తోచింది.

రంగు కాగితం ఒక గంటలో తనకు చూపించిన రంగులు, తనలో మార్చిన రంగులను తలుచుకుంటూ, తనది కాని డబ్బు కోసం తాను ఆశపడడం తన తప్పుగా భావిస్తూ, ముక్కులోంచి కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటూ అక్కడే నిస్సత్తువగా కూలబడ్డాడు.

***

"హలో రెడ్డీ! బకరా దగ్గర యేమైనా గుంజినవా? లేదా?" స్వీట్ షాప్ క్యాషియర్ ప్రశ్న.

"గుంజకుండా ఊరుకుంటానా? మంచి నోటు పట్టుకొని, నకిలీ నోటు అని భలే ప్లాన్ వేసినావు!" అవతలి నుండి వెకిలి నవ్వులు నవ్వుతూ, ఇనస్పెక్టర్ సమాధానం .

“సాధారణంగా మా షాప్ లోకి అరిస్టోక్రాట్లు గానీ, బ్యూరోక్రాట్లు గానీ వస్తుంటారు. కానీ నా పదేళ్ళ సర్వీస్ లో ఇట్లాంటి కస్టమర్ ను చూడలేదు. వాడి వాలకం చూడగానే, వాడి దగ్గర ఉన్న నోటు దొరికిందయినా ఉండాలి. లేదా కొట్టుకొని వచ్చిందన్నా అయిఉండాలి, లేదా ఎవరి కోసమైన కొనడానికి వచ్చిన వాడైనా అయి ఉండాలి, కానీ వాడిది మాత్రం అయిఉండదు అనుకున్నాను. నాకు వాడు మా షాప్ లో స్వీట్లు కొనేంతటి వాడిగా అనిపించలేదు. నాకు వెంటనే వాడిని ట్రాప్ చేయాలని ఐడియా వచ్చి, ఆ ప్లాన్ నీకు చెప్పాను. అనుకున్నట్లుగా మన ట్రాప్ లో చిక్కాడు. అది సరే కానీ సాయంత్రం సిట్టింగ్ పెట్టు. కలుద్దాం. వాడి పేరు చెప్పుకొని నాలుగు పెగ్గులు వేద్దాం!” ఇవతలి నుండి క్యాషియర్ .

“తప్పకుండా…” అంటూ నవ్వుతూ ఫోన్ పెట్టేశాడు ఇన్ స్పెక్టర్ టోపీని సవరించుకుంటూ!

***0***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ



# మా అమ్మ

సింహప్రసాద్

"వసుధా! అమ్మకి సీరియస్ గా వుందిట. మా ఊరు వెళ్తున్నాను!" ఆఫీస్ నుంచి తిన్నగా ఎయిర్ పోర్టుకెళ్తూ ఫోన్ చేసి చెప్పాను.

"అరె ఈ సడన్ ప్రయాణమేంటి రవీ? నువ్వేమీ హైదరాబాద్ లో లేవు, పరుగున వెళ్లడానికి. ముంబైలో వున్నావు. ఫోన్ చేసి ఇరుగు పొరుగు వాళ్లని చూడమని చెప్పు చాలు!"

"లేదు. నేనే వెళ్తాను. ఏ ఫ్లయిట్ దొరికితే దానిలో వెళ్లిపోతాను.."

"ఎలా వెళ్లినా రేపటిగ్గాని నర్సాపురం చేరలేవు. నా మాట విను రవీ..."

"ఆఫీసులో అర్జంట్ మీటింగ్ వున్నా సరే సారీ చెప్పి వచ్చేశాను. అసలీ పని మొన్న అమ్మకి నీరుడు బంద్ అయిందని తెలిసినప్పుడే చేసుండాల్సింది. ఇప్పుడూ వెళ్లకపోతే నన్ను నేను క్షమించుకోలేను!"

"ఓకే ఓకే. అత్తయ్యగారికేమీ కాదు గాని నువ్వు వూరికే ఆందోళన పడకు. ధైర్యంగా వుండు.."

దారిలోనే హైదరాబాద్ కు టిక్కెట్ బుక్ చేశాను. అదృష్టవశాత్తూ అక్కడ్నుంచి రాజమండ్రికి కనెక్టింగ్ ఫ్లయిట్ దొరికింది. విమానం టేకాఫ్ తీసుకున్నాక గాని గుక్కెడు నీళ్లు గొంతులో పోసుకోలేకపోయాను.

కళ్లు మూసుకుని అమ్మని తలుచుకుంటూ కూర్చున్నాను.

నాకు ఊహ తెలిసిన తొలినాళ్లలోని అమ్మ రూపం అస్పష్టంగా మెదడు పొరల్లో కదిలింది. తర్వాత్తర్వాత అమ్మ ఎన్నో రూపాల్లో... నిజంగా అమ్మకి ఎన్ని అవతారాలో చెప్పలేను!

బ్రతిమాలి అన్నం తినిపించేటప్పుడు ఒక రకంగా, జోకొడుతూ నిద్రపుచ్చేప్పుడు మరో రకంగా, దెబ్బ తగిలి ఏడుస్తున్నప్పుడు ఇంకో రకంగా కనిపించేది. అంతేకాదు, చదువుకునేప్పుడు, పరీక్షలప్పుడు, తక్కువ మార్కులొచ్చినప్పుడు, ఫస్ట్ క్లాస్ వచ్చినప్పుడు, టైఫాయిడ్ తగిలినప్పుడు, ఉద్యోగవార్త తెలిసినప్పుడు, పెళ్లి కుదిర్చేప్పుడు, పూజలు చేయించినప్పుడు, నా ఇష్టాయిష్టాలు గుర్తు పెట్టుకొని వండి వడ్డించినప్పుడు...ఓహ్! ఒక్కోసారి ఒక్కో రూపంతో!

కానీ అన్నింటిలోనూ అదే ప్రేమ, అదే ఆప్యాయత. అదే నవ్వు. అదే చూపు!

ఎవరో వీపు మీద చరిచినట్టు ఉలిక్కిపడ్డాను. గుటకలు మింగుతూ భుజాలు తడముకున్నాను.

'అమ్మా, నీ నవ్వు ఇష్టం, నీ వంట ఇష్టం, నీ సెలక్షన్ అద్భుతం, నీ మాటలు గొప్ప టానిక్కే. నువ్వు నిజంగా గ్రేట్' ఇలా పొగిడాను తప్ప, ఎన్నడూ ఒక్కసారి కూడా అమ్మా, నువ్వంటే నాకిష్టం' అని చెప్పలేదు. 'ఐ లవ్యూ అమ్మా' అని ఒక్కసారీ చెప్పలేదు సుమా!

గిల్టీగా ఫీలయ్యాను. ఊరెళ్లగానే, అమ్మని చూడగానే ముందు ఆ ముక్కే చెప్పాలి. నువ్వంటే గుండెలు పట్టనంత ప్రేమ అని అరిచి చెప్పాలి. అప్పుడు అమ్మ పెదాల మీద విరిసే మధుర దరహాసాన్ని చూసి ధన్యమైపోవాలి!

అమ్మకి ఎలా వుందో. అమ్మకి వీడియో కాల్ చేసి మాట్లాడగలిగితే బావుణ్ణు. కానీ అమ్మ దగ్గర సెల్ ఫోన్ లేదు. క్రితం సారి వెళ్లినప్పుడు కొనిస్తానంటే, "పాతకాలం దాన్ని, ఇవన్నీ నాకు చేతనవుతాయేంట్రా" అని తోసిపుచ్చేసింది. అయినా వినకుండా కొని తీసుకెళ్లి చేతిలో పెట్టి వుండాల్సింది.  అమ్మ క్షణాల్లో నేర్చుకోదూ! అసలు అమ్మకు రాని విద్య వుంటుందా!

ఎంత తప్పు జరిగిపోయిందీ!

అమ్మ ఆరోగ్య పరిస్థితి ఎలా వుందో. నీరుడు ఆగిపోయిందంటే చాలా కాంప్లికేషన్స్ రావచ్చు. అసలే షుగర్ వుంది. గుండె సమస్యా వుంది. జరక్కూడనిదేదైనా జరిగితే?

తల్లడిల్లి పోయాను. కన్నీళ్లు పొంగి వచ్చాయి. ఇలాంటప్పుడు అమ్మ ఏం చేసేదో గుర్తొచ్చింది.

ఎప్పుడు అధైర్యంతో, అభద్రతతో ఆందోళన పడినా, నా నుదుట పూజామందిరంలో కుంకుమ బొట్టు తెచ్చి పెట్టేది.

"ఇది ఆంజనేయస్వామి బొట్టురా. ఇక ఆ స్వామి గద పట్టుకుని నీ పక్కనే కూర్చుంటాడు. నీ దగ్గరకే ఆపదా, అనర్థం రాకుండా చక్కగా కాపలా కాస్తాడు!"

వెంటనే చేతులు జోడించాను. "ఆంజనేయస్వామీ! మా అమ్మకు ఏమీ కాకుండా చూడు తండ్రీ!"

కొంచెం ధైర్యం చిక్కింది. భరోసా లభించినట్టు అనుభూతించాను.

అసలు అమ్మని ఆ పల్లెలో ఒంటరిగా వదలకుండా ముంబై తీసుకొచ్చేయాల్సింది. మా ఇద్దరికీ ఉద్యోగాలు గనుక ఇంట్లో ఒక్కతీ బిక్కుబిక్కుమంటూ ఉండలేదని  బలవంత పెట్టలేకపోయాను.

"పిల్లలు పుట్టే వరకూ చిలకా గోరింకల్లా ఎగరండిరా. మీ మధ్య దిష్టి బొమ్మలా నేనెందుకు చెప్పు. మనవడో, మనవరాలో పుట్టేక ఉగ్గుపాలు పోయడానికి వస్తాన్లేరా. నీ దగ్గరకి కాకపోతే ఇంకెక్కడికి వెళ్తాను చెప్పు!" అని అమ్మ అన్నప్పుడు కూడా, "నువ్వే మాకు కొండంత అండ" అని ఒప్పించి తీసుకురావాల్సింది.  ప్చ్! ఏవిటో అప్పుడు తోచిచావలేదు.

ముఖం ముడుచుకుని వాచీ వంక చూశాను. ఇంకో అరగంటకి గాని హైదరాబాదులో ల్యాండవ్వదు. తర్వాత గంట వెయిటింగ్. ఇంకో గంట ప్రయాణం. రాజమండ్రిలో దిగి, నర్సాపురం వెళ్లడానికి  ఇంకో రెండు గంటలు. అంటే అమ్మని  చూడటానికింకో నాలుగున్నర గంటలు ఓపిక పట్టాలి!

ఛా. ప్యాకేజీ పెద్దదని అనవసరంగా ముంబై వెళ్లాను. హైదరాబాద్ లోనే వుండిపోయి వుండాల్సింది. అప్పుడింత యాతనయ్యేది కాదు!

యాతన! నాన్న లివర్ క్యాన్సర్ తో చనిపోయాక, నన్ను పెద్ద చేయడానికి అమ్మ నిజంగా నరకయాతనే అనుభవించింది.

వరి పండే ఐదెకరాల భూమి వున్నా అష్టకష్టాలు పడాల్సొచ్చింది. సాగు చేయడానిగ్గాని, చేయించడానిగ్గాని అయిన వాళ్లెవరూ అక్కరకు రాలేదు. వచ్చిన వాళ్లు అందినకాడికి పట్టుకుపోవాలనే చూశారు తప్ప అమ్మకు అండదండలందించలేదు!

అమ్మ అమ్మతల్లిలా మారింది. ఆస్తిని నాకోసం రక్షించింది. పంట సొమ్మును జాగ్రత్త చేసి నన్ను చదివించింది. ఇంజినీర్ని చేసింది. సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉన్నత స్థానంలో వుండి కంపెనీ వ్యవహారాలని, నేను గొప్పగా చక్క బెట్టేస్తున్నానని జబ్బలు చరుచుకుంటూ వుంటాను. కాని అమ్మ చదివింది తక్కువే అయినా ఒంటి చేత్తో నా రెక్క పట్టుకుని ఎత్తు పల్లాల మీంచి ఎంత చాకచక్యంగా నడిపించిందీ!

“మాయదారి చదువులెందుకు సీతమ్మా. మానిపించెయ్. సాగు చేసుకుంటూ నీ దగ్గరే వుంటాడు. నీ చేతికిందే వుంటాడు!” అని ఊరి వాళ్లు సలహా ఇస్తే అమ్మ ఏమంది?

“వాడికి బలమైన రెక్కలివ్వాలన్నది నా కల”

తనే నాన్న కూడా అయి చేయూతనిచ్చింది. గొడుగు పట్టింది. అంతేనా? అహ కాదు. ఒళ్లో కూర్చోబెట్టుకుని అక్షరాలు దిద్దించింది. పుస్తకాలకు అట్టలు వేసింది. పక్కన కూర్చుని చదివించింది. హోం వర్క్ చేయడానికి తోడ్పడింది. తెలీనివి విడమరిచి చెప్పింది. అలాగని ఆటలకు వెళ్లకుండా అడ్డు పడలేదు. అందర్తో చక్కగా కలిసేలా ప్రోత్సాహించింది. ఇంటికొచ్చిన నా మిత్రులకు తినడానికేదో పెట్టి, వాళ్ల చేత నా సావాసం వదలమని ఒట్టేయించుకునేది. నేను ఒంటరైపోతానని పాపం అమ్మ భయం!

ప్రతి పండక్కీ కొత్త బట్టలు కుట్టించేది. పండగింకా వారం పదిరోజులుండగానే మిషన్ సాయిబుకి కబురు మీద కబురు పెట్టి మరీ తొందర పెట్టేది. పైగా ‘మీ నాన్నే బతికుండి వుంటే నీ కోసం ఎన్ని కుట్టించేవారో!’ అనేది!

విమానం దిగుతూనే రాజమండ్రి ఫ్లయిట్ గేటు దగ్గరికి గబగబా వెళ్లాను. రైట్ టైమ్ అని తెలుసుకుని నిట్టూర్చాను.

అమ్మకి ఎలాగుందో! ఊరి నుంచి ఫోన్ చేసి చెప్పినతనకి ఆదుర్దాగా ఫోన్ చేశాను. ల్యాండ్ లైన్ రింగ్ అవుతోంది గాని ఎవరూ లిఫ్ట్ చెయ్యలేదు.

ఛా. అతడి సెల్ నెంబర్ తీసుకుని వుండాల్సింది. అమ్మకి ఎలా వుందో నాకు తెలిసేది. టెన్షన్ తగ్గేది. అలాగే నేనొస్తున్నట్టు అమ్మకు తెలిసేది. ఎంత పొరబాటయ్యిందీ!

ఏవిటో ఒక్కటీ సవ్యంగా చేయలేకపోయాను. ఇదే అమ్మ అయితే ఒకేసారి ఎన్ని పనులు చక్కబెట్టేదీ. ప్రతీదీ వంక పెట్టలేని విధంగా చేసేది. అమ్మ నుంచి ఎన్ని నేర్చుకున్నా, నేర్చుకోవాల్సింది ఇంకా చాలానే వుంది సుమా! మాకు పిల్లలు పుట్టేక వాళ్లని అమ్మకు దగ్గరచెయ్యాలి. వాళ్లు మన సంప్రదాయ సంస్కృతులు గురించి తెలుసుకునే అవకాశం కల్పించాలి!

ఆకలిగా వుంది. నీరసంగా వుంది. ఎదురుగా ఆహారాలున్నాయి. అయినా ఏమీ తిన బుద్ధి కావడం లేదు. కాఫీ తాగుతూ అమ్మని తలచుకున్నాను. నేనిలా మాడిపోతున్నానని అమ్మకి చూచాయగా తెలిసినా లబలబలాడుతుంది. ఏదోటి తినమంటూ ఒట్టు పెట్టుకుంటుంది. బిడ్డ ఆకలి పేగు అరుపులు మొదట కన్న తల్లికే వినిపిస్తాయి కాబోలు!

చిన్నప్పుడోసారి నేనూ నా మిత్రులూ సినిమాలు చూడటానికి మా వూర్నించి నర్సాపురం వెళ్లాం. రెండాటలూ చూసి సైకిళ్ల మీద ఇంటికి చేరే సరికి తొలికోడి కూసింది.

ఇంటి తలుపు ఇలా తట్టానో లేదో అలా తీసింది అమ్మ.

"నువ్వు పడుకోలేదా అమ్మా!"

"ముందు కాళ్లు కడుక్కురా, అన్నం తిందువుగాని. అక్కడేమైనా కొనుక్కు తిన్నావో లేదో..."

అన్నం వడ్డించింది. నిద్రొస్తోందన్నా వినకుండా అంతా తినేసేదాకా వదల్లేదు. విసుక్కున్నాను. కసురుకున్నాను. అయినా ఖాళీ అయిన కంచం చూసి ఎంతో తృప్తి పడిపోయింది. అమ్మ పిచ్చిదే సుమా! చిన్నగా నవ్వుకున్నాను.

అవన్నీ ఒక ఎత్తు. ఇంజనీరింగులో చేరేటప్పుడు అమ్మ చేసిన ఆర్భాటం మరో ఎత్తు. మాస్టార్లనీ, బంధుమిత్రుల్నీ అందర్నీ ఎన్ని రకాలుగా అడిగి ఎన్నెన్ని వివరాలు సేకరించిందో చెప్పలేను.

ఏఏ కాలేజీలు మంచివి, ఏ బ్రాంచిలో సీటొస్తే భవిష్యత్తు బావుంటుంది, ఏ కోర్సు చదివితే ఎలాంటి ఉద్యోగాలొస్తాయి... అన్నీ కనుక్కుంది. నా స్నేహితులతో బాటే మెకానికల్లో చేరతానంటే ఒప్పుకోలేదు. 'అందులో బరువు పనులు చేయాలంట, నువ్వు చేయలేవురా' అంటూ వారించింది. ఈసీలో కొచ్చి పడ్డానంటే అదంతా అమ్మ చలవే!

బోర్డింగ్ అనౌన్స్ మెంట్ వినిపించగానే క్యూలోకెళ్లాను. "వాతావరణం బాగానే వుంది కదా?" విమాన సిబ్బందిని అడిగాను.

"ప్రస్తుతానికి ఆల్ రైట్ సార్" అందామె. గుండెల మీంచి ఓ బరువు దిగిపోయింది.

రాజమండ్రిలో దిగి టాక్సీలో నర్సాపురం బయలుదేరాను.

దగ్గరకెళ్లే కొద్దీ నా ఆదుర్దా, ఆందోళన అంతకంతకూ అధికమవసాగాయి. నాకు తెలీకుండానే కళ్ళలోంచి కన్నీరు ధారలుగా కారిపోతోంది.

అమ్మ ఆరోగ్యం బావుందని ఎవరైనా ఫోన్ చేసి చెబితే ఎంత బావుణ్ణు!

నా కోసం అమ్మ ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎంతగానో ఎదురుచూస్తూ తపిస్తూండి వుంటుంది పాపం.

ఇరవై రోజుల నాటి సంగతి జ్ఞప్తికొచ్చింది.

"రాత్రి ఏదో పీడకల వచ్చిందిరా. నిన్ను చూడాలని వుంది నాన్నా. ఒకసారి కోడల్ని తీసుకుని రారా. ఇలా ముఖం చూపించి అలా వెళ్లిపోయినా సరేరా అబ్బాయ్" ఫోన్లో ప్రాధేయ పడింది అమ్మ.

"నువ్వెప్పుడూ నా గురించే ఆలోచిస్తావు గనుక అలాంటి కల వచ్చి వుంటుంది. అనవసర భయాలు పెట్టుకోకమ్మా. నేను భేషుగ్గా వున్నాను. సుఖంగా బతుకుతాను. సరేనా?"

"ఒకసారి కళ్లారా నిన్ను చూస్తే మనసుకెంతో తృప్తిగా సంతోషంగా వుంటుందిరా. ఒకసారి వచ్చివెళ్లరా. ఈ అమ్మ మాట వినరా కన్నా"

"నేనేమీ మన ఊరు పక్క ఊళ్లో లేనమ్మా, ఏదో ఒక సమయంలో ఒకడుగు వేయడానికి. ముంబైలో వున్నాను. పెద్ద కంపెనీలో పెద్ద హోదాలో వున్నాను. ఊపిరి సలపనంత బిజీగా వున్నాను. టార్గెట్ రీచ్ అవడానికి ఒక రకంగా పరుగు పందెంలో వున్నాను. సారీ, ఇప్పుడు రాలేనమ్మా. ఏమీ అనుకోకు, వుంటాను.."

ఆ తర్వాత నాలుగు రోజుల క్రితం ఫోన్ చేసి తన అనారోగ్యం గురించి చెప్పింది. "చిన్న సమస్యే. డాక్టర్ కి చూపించుకో!" అని సలహా ఇచ్చి, ఆ తర్వాత ఆ ఊసే మర్చిపోయాను. 'ఎలా వుందమ్మా!' అని అడగలేకపోయాను!

ఎంతో భరించలేని పరిస్థితి వస్తే తప్ప అమ్మ తన బాధ గురించి చెప్పుకోదన్న సంగతి పూర్తిగా మర్చిపోయాను. నా కాలిలో ముల్లు గుచ్చుకున్నా తన గుండెల్లో దబ్బళం దిగినట్టు విలవిల్లాడే అమ్మకి నీరుడు బంద్ అయినా, వెనకెవరూ లేరని తెలిసి కూడా నేను సీరియస్ గా తీసుకోలేకపోయాను. ఎంత మూర్ఖత్వం! ఎంతెంత నిర్లక్ష్యం!

ఒకటీ రెండూ కాదు, ఇరవై ఏళ్ల పాటు అమ్మే లోకంగా మసలిన వాణ్ణి. అమ్మ కళ్లతో లోకాన్ని చూసిన వాణ్ణి. అలాంటిది అమాంతం నా లోకంలో అమ్మకి బెత్తెడు చోటు లేకుండా ఎలా పోయింది? అమ్మని ఎలా మరిచిపోగలిగాను?

నా చుట్టూ ఎందరో వున్నారు. వేరే ప్రపంచం వుంది. కాని అమ్మకి నేను ఒక్కణ్నే. నేనే తన ఏకైక లోకం! ఛాఛా. నా ప్రవర్తన దారుణంగా వుంది. క్షంతవ్యం కానే కాదు!

తలచుకుంటేనే నా మీద నాకు అసహ్యం వేస్తోంది. నేనొక కొడుకులా గాక పగవాడిగా ప్రవర్తించినట్టుగా వుంది. నేను, నా కుటుంబం, నా ఉద్యోగం, నా సంపాదన, నేనెక్కాల్సిన మెట్లు... ఇవే ముఖ్యం అనుకున్నాను. వాటి కోసం అహరహం ప్రాకులాడుతూ నా ఉనికికి కారణమైన అమ్మని విస్మరించాను. నన్ను మెట్లెక్కించి, తను కిందే వుండిపోయిన అమ్మని గుర్తించడంలో పూర్తిగా విఫలమయ్యాను.

ఈ పాపం కడుక్కోవడానికి అమ్మని అక్కున చేర్చుకోవడమే, పూజించడమే ఏకైక మార్గం. ఈ సారి ఒట్టు పెట్టుకుని అయినా సరే అమ్మని నాతో తీసుకుపోవాలి. నాతోనే వుంచుకోవాలి. తెల్లారి లేస్తూనే అమ్మ దివ్యరూపం చూస్తూండాలి! అవునంతే. ఇక అమ్మే నాకు దేవుడు.

ఆ నిశ్చయం నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది.

అమ్మ తలపే కాదు, అమ్మ ఒడి, అమ్మ మాటా ఎంతో చల్లనివి. ఒత్తిడి తగ్గిస్తాయి. ధైర్యాన్ని నింపుతాయి.

ఆ మధ్య మా కంపెనీ నన్నుగాక మరొకర్ని ఆన్ సైట్ కి అమెరికా పంపినప్పుడు ఎంతో కృంగిపోయాను. ఉద్యోగం వదిలేద్దామనుకునే దాకా వెళ్లాను. వసుధ ద్వారా విషయం తెలిసి అమ్మ ఏమంది?

"పరుగుపెడుతుంటే ఒక్కోసారి కింద పడతాం. మోకాళ్లు కొట్టుకుపోతాయి. అయినా ఏడుస్తూ కూర్చుంటామా? లేచి మళ్లీ పరుగెడతాం. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోతాం. ఇవాళ గాకపోతే, రేపు నిన్నూ అమెరికా పంపిస్తార్రా పిచ్చి నాన్నా. నీలాంటి పనిమంతుడ్ని ఎవరు మాత్రం పక్కన పెడతారు చెప్పు. ఇంకా ఎన్నో ఎత్తులకు ఎదగాల్సిన వాడివి, మొదట్లోనే చతికిలబడితే ఎలారా!" అంటూ సన్నగా మందలిస్తూనే ధైర్యం చెప్పింది.

నా బాధ, దిగులూ చేత్తో తీసేసినట్టు మాయమైపోయాయి!

"నీతో మాట్లాడితే చాలు కొత్త ఉత్సాహం వచ్చేస్తుంది. ఒత్తిడి, నిరుత్సాహం మాయమైపోయి, రీచార్జ్ అవుతాను అమ్మా!" పైకే అనేసాను సంబరంగా.

డ్రైవర్ వెనుదిగిరి ఏవిటన్నట్టు చూశాడు. "నువ్వు త్వరగా పోనియ్"

కారు ఆసుపత్రి ముందాగింది. లోపలికి పరుగెత్తాను.

అమ్మ, బెడ్ మీద నిశ్చలంగా పడుకుని వుంది. వెంటిలేటర్ మీద వుంది. బతుకు పొడవునా క్షణం తీరిక లేకుండా శ్రమించి శ్రమించి ఎంతగానో అలిసిపోయి ఆదమరిచి నిద్రపోతున్నట్టుగా వుంది!

"అమ్మా అమ్మా నేను వచ్చేశానమ్మా. నీ ముద్దుల కొడుకుని వచ్చేశాను. ఒక్కసారి కళ్లు తెరిచి చూడమ్మా...!" బావురుమన్నాను.

"సారీ మిస్టర్. ఆమె స్పృహలో లేదు. వైటల్స్ పనిచేయడం లేదు. ఆల్మోస్ట్ కోమాలోకి వెళ్లిపోయినట్టే!" డాక్టర్ అన్నాడు.

"ఒక్కసారి ఒకే ఒక్కసారి స్పృహ తెప్పించండి డాక్టర్. ఐ లవ్యూ మామ్ అని గొంతు చించుకుని చెప్పాలి డాక్టర్. ప్లీజ్ ప్లీజ్..."

"సారీ. ఇటీజ్ టూ లేట్.."

ఘోరంగా ఓడిపోయిన వాడిలా కూలబడ్డాను. అమ్మ ఒడిలో తల పెట్టుకుని గుండెలు పగిలేలా ఏడ్వాలని వుంది.

అమ్మ అరచేయి నిమురుతూ దు:ఖోద్వేగంతో వూగిపోయాను.

ఊరు వారు వచ్చారు. సానుభూతిగా చూశారు.

"రెండ్రోజులు బాధ పడ్డాకే నీకు ఫోన్ చేసింది. ఆ తర్వాత బాధ ఎక్కువయ్యే సరికి ఆసుపత్రిలో చేర్చాం. మందులు పని చేయకపోయే సరికి సీరియస్ అయింది..." పక్కింటతను చెప్పాడు.

"మా అమ్మ నాకు చెప్పమని ఏమైనా చెప్పిందా?" పెర్రిగా అడిగాను.

ముఖాముఖాలు చూసుకున్నాక, ఒకరన్నారు "నీకు ఫోన్ చేస్తానని చెబితే వద్దంది. ఇప్పుడు రాడు. తర్వాత తప్పకుండా వస్తాడు. నా కోసం గాకపోయినా నా దిన కర్మలు చేయడానికొస్తాడు... !"

నా గుండెలు భళ్లున పగిలాయి. హోరున భోరున ఏడ్చాను.

నాకు చిన్న దెబ్బ తగిలి, 'అమ్మా' అని అరిస్తే, 'ఏం బిడ్డా' అంటూ పరుగెత్తుకొచ్చే అమ్మ, నేను ఏడ్చి మొత్తుకున్నా లేచి రాలేదు. నా వంక కన్నెత్తి చూళ్లేదు!

నాతో మరి సంబంధం లేనట్టుగా శిలామూర్తిలా వుండిపోయింది.

నా అంత దురదృష్టవంతుడు, నిర్భాగ్యుడు ఈ ప్రపంచంలోనే వుండడు!

"హాస్పిటల్లో ఉంచుతారా, ఇంటికి తీసుకుపోతారా?" డాక్టర్ అడిగాడు.

"ఇక్కడే వుంటుంది. ఎంత చేయగలిగితే అంత చేయండి డాక్టర్. ఎందరు స్పెషలిస్టుల్ని పిలుస్తారో పిలవండి. ఎంత ఖర్చైనా ఫరవాలేదు. మా అమ్మ బతకాలి. నన్ను కళ్ల నిండుగా చూడాలి. నవ్వుతూ నోరారా పలకరించాలి!" దు:ఖోద్వృతితో వూగిపోయాను.

ఆ రాత్రంతా అమ్మ పక్కనే, అమ్మ చెయ్యి పట్టుకునే, అమ్మ పక్క మీద తల పెట్టుకునే వున్నాను.

చుక్క చుక్కగా సెలైన్ అమ్మ ఒంట్లోకి వెళ్తోంటే మౌన ప్రేక్షకుడిలా చూస్తుండిపోయాను.

అర్ధరాత్రికే అమ్మలోని చిలక ఎగిరిపోయింది. కనీసం టపటపమని రెక్కల చప్పుడు కూడా చేయకుండా మౌనంగా ఈ లోకం నుంచి నిష్క్రమించింది!

నేను బండరాయిలా మారిపోయాను.

నా నిర్లక్ష్యంతో మూర్ఖత్వంతో అమ్మ అనే అమృత భాండం పగులగొట్టుకున్న నేనెంత దౌర్భాగ్యుణ్ణి!

అమ్మ అంటే ఆనందం. అమ్మ అంటే ప్రేమ. అమ్మ అంటే అనంత ఆప్యాయత. ఎన్నటికీ తరగని సంపద. అవన్నీ లేని, కోల్పోయిన దురదృష్టవంతుణ్ణి. ఇలాంటి దుస్థితి నా శత్రువుకి కూడా రానివ్వకు ఆంజనేయస్వామీ!

అమ్మ నిర్జీవ శరీరాన్ని మా ఊరు తీసుకెళ్లాం. కటిక నేల మీద తాటాకు చాప మీద పడుకోబెట్టారు.

నవమాసాలు మోసి, పురుటి నొప్పులు పడి, ప్రాణగండం అధిగమించి, తన పేగు తెంచి మరీ నన్ను భూమ్మీదకు తెచ్చిన అమ్మ ఇప్పుడు భూమాత ఒడిలో... !

గోదావరి వరదల్లో సర్వం కోల్పోయిన వాడిలా ఏడ్వబోతూ ఆకస్మాత్తుగా ఆగిపోయాను. 'ఏడవకురా. నీకంట కన్నీరు నేను చూడలేనురా చిట్టి కన్నా' అంటోంది అమ్మ! అదృశ్య హస్తాలతో నా కళ్లు తుడుస్తోంది అమ్మ!

పెర్రిగా చూశాను. గుండె దిటవు చేసుకున్నాను.

"బంధువులకి తెలియబర్చాలి. 'మీ అమ్మగారి పేరేంటి?" ఎవరో అడిగారు.

అన్ని పేర్లూ అమ్మవే. ఎలా పిలిచినా పలుకుతుంది. గుండెతో పిలిచినా ఓ అంటూ జవాబిస్తుంది. అన్ని రూపాలూ తనవే. అసలు సృష్టి తను. అమ్మ అమ్మే. మరి ప్రత్యామ్నాయం లేదు!

ఈ సత్యం ముందే తెలిసి వుంటే అమ్మ చనిపోయాక కాదు, బతికుండగానే కళ్లు తెరిచేవాణ్ణి! కళ్ల ముందున్నంతసేపూ ఆ దేవతని గుర్తించని నేనెంత పాపిని!

దేవుడూ, నన్నూ నాలాంటి వాళ్లనీ చచ్చినా క్షమించకు!

***0***

# చివరి కోరిక



## సి. హెచ్. నాగార్జున శర్మ

లీలామహల్ సెంటర్లో ఓ టైలరింగ్ షాపు. ఆ షాపు యజమాని పేరు మురళి. ఆ షాపులో మూడు కుట్టు మిషన్లు మరియు ఒక జిగ్ జాగ్ మిషనున్నది. అతడితోబాటు మరో ఇద్దరు టైలర్లు ఆ షాపులో పనిచేస్తుంటారు.

ఎప్పటిలాగే ఉగాది పడక్కి కొత్త బట్టలు కుట్టించుకుందామని మురళి దగ్గర కెళ్ళాను. గుప్పున సారా వాసన నా ముక్కుపుటాలని అదరగొట్టేసింది. ఒక చేత్తో నా ముక్కు పుటలను మూసుకుని మరో చేత్తో 'ఎవరని' సౌజ్ఞ చేశాను మురళి వైపు చూస్తూ.

నా ప్రశ్నకు సమాధానంగా మురళి తన చూపుడు వేలుతో ఓ పెద్దాయన్ని నాకు చూపించాడు.

అతను నాకదివరకు పరిచయం లేని వ్యక్తి. బహుశా మురళి షాపులో కొత్తగా పనికి కుదిరినట్లున్నాడు. అతడి వయసు ఇంచుమించు యాభై ఏళ్ళకు పై చిలుకే. బట్టతల, నెరసిన జుట్టు, పెరిగిన గడ్డం, కళ్ళు చింత నిప్పుల్లా ఎర్రగా వున్నాయి. తలొంచుకుని చొక్కా కుడుతున్నాడు.

"ఆయన పేరేంటి? ఎక్కడి నుంచీ వచ్చాడు? అడిగాను మురళిని.

“ఆయన పేరు రాందాసు. బతుకుతెరువు కోసం గుంటూరు జిల్లా తెనాలి నుంచి తిరుపతికి వచ్చాడు. తనకి బాగా ఊహ తెలిసినప్పటి నుండీ టైలరింగ్ అతడి జీవనాధారం. టైలరింగ్ షాపుల్లో పని చేసిన అనుభవముంది. పెద్దగా చదువుకోలేదు గానీ మంచి పనిమంతుడు, బట్టలు బాగా కుడతాడు...” అంటూ అతడి గురించి క్లుప్తంగా చెప్పి, నాకతడ్ని పరిచయం చేశాడు.

అటు తర్వాత నా కొత్త బట్టలు మురళీకిచ్చి పండక్కి కుట్టివ్వమని చెప్పి ఇంటిముఖం పట్టాను.

***

వారం రోజులు గడచిన తర్వాత బట్టలు తీసుకొచ్చుకుందామని టైలరింగ్ షాపుకెళ్ళాను. షాపులో మురళి అగుపడకపోవడంతో రాందాసుతో "మురళి ఎక్కడ?" అని అడిగాను.

“బజారెళ్ళాడు. ఓ పది నిమిషాల్లో వస్తాడు కూర్చోండి" అని స్టూలు చూపించాడు.

స్టూలు మీద కూర్చుంటూ " రాందాసు గారూ! మీకీ తాగుడు ఎలా అలవాటైంది? అందుకు కారకులెవరైనా వున్నారా? లేక మీ జీవితంలో మరపురాని, మరచిపోలేని విషాద సంఘటనేమయినా జరిగిందా! ఆ బాధని మరచిపోవడానికి ఈ తాగుడికి బానిసయ్యారా!" అని అడిగాను.

రాందాసు తన పాతికేళ్ళ గత జీవితం తాలూకు జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకుని చెప్పడం మొదలెట్టాడు.

***

"నాకప్పుడు పాతికేళ్ళుంటాయి. అప్పట్లో నాతోబాటూ మరో నలుగురు స్నేహితులు కలసి టైలరింగ్ నేర్చుకోడానికని ఒక టైలరింగ్ ఇన్స్టిట్యూట్ లో చేరాం. సంవత్సరం కోర్సది. కోర్సు పూర్తయింది. 'ముందు ముందు మన ఐదుగురం ఇలా కలుసుకుంటామో లేదో! ఒకవేళ కలుసుకున్నా ఒకరిద్దరు కలుసుకోవచ్చేమోగానీ ఇలా ఐదుమందిమి కలుసుకోడానికి కుదరకపోవచ్చు. కాబట్టి ఈ శుభసందర్భంలో ఒకరి నొకరు జీవితాంతం గుర్తుండిపోయేలా సెండాఫ్ పార్టీని జరుపుకుందాం' అని ఒకరన్నారు.

'అలా గుర్తిండిపోయేటట్లుగా అయితే మందు పార్టీ జరుపుకుందాం' అని మరొకడన్నాడు.

'మందు పార్టీనా! అలాగయితే నేను రాను' అన్నాను

'ఏం? ఎందుకని?' ప్రశ్నించాడొకడు.

'సిగరెట్టు, మందు తాగే అలవాటు నాకు లేదు. దయచేసి నన్నిబ్బంది పెట్టకండి!' అని బతిమాలుకున్నాను.

'ఈ ఒక్కసారికేం కాదులే రాందాసు... వచ్చేయ్' అన్నారందరూ ముక్తకంఠంతో.

నాకు తప్పలేదు!

మరుసటి రోజు సాయంకాలం సెండాఫ్ పార్టీ. పార్టీలో నేను తప్ప మిగిలిన నలుగురూ మందు తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. తప్పించుకోడానికి ప్రయత్నం చేస్తూ.. నేనేమో బంగాళాదుంప చిప్స్, వెజిటబుల్ బిర్యాని తింటూ కూర్చున్నాను. నలుగురిలో ఒకతను "ఏం రాందాసు? మందు తాగకుండా బిరియానీలో బంగాళాదుంప చిప్స్ నంజుకుంటూ తింటూ కూర్చున్నావే. మాతో బాటూ నువ్వు కూడా మందు తాగాల్సిందే' అంటూ నా చేత బలవంతంగా మందు తాగించారు. దాంతో అక్కడే మత్తుగా పడుకుండిపోయాను. మిత్రులందరూ కలసి నన్ను నా రూముకు చేర్చారు.

తాగిన మత్తు వదలని కారణంగా రెండు రోజులపాటు రూములోనే అచేతనంగా పడుకుండిపోయాను. మూడవ రోజుకు ఆ మత్తులోంచి బయటపడి మామూలు మనిషయ్యాను.

ఆ రోజు సాయంకాలం ఆ వూళ్ళోనే వుంటున్న నా స్నేహితుడ్ని కలిశాను. అతడు నన్ను చూసీ చూడగానే 'ఏం రాందాసూ! రెండు రోజులబట్టి నీ జాడ తెలియరాలేదు' అంటూ అడిగాడు.

'నా చేత పీకల దాకా బలవంతంగా మందు తాగించారుగా! దాని మత్తు వదలడానికి నాకు రెండు రోజులు పట్టింది' అని చెప్పాను.

'కొత్తల్లో అలాగే వుంటుందిలే. అలవాటైతే ఎలాంటి ఇబ్బందులేమీ వుండవు' అన్నాడు.

'నాకు తెలిసినంతమటుకు తాగుడుని అలవాటు చేసుకోవడమంత బుద్ధితక్కువ పని మరొకటుండదు. దాని వల్ల నష్టాలే గానీ లాభాలేమీ లేవు' అతడి మీద గట్టిగా అరచి, ఇంటికి వచ్చేసాను.

కాలచక్రంలో ఓ సంవత్సరం రోజులు సరదాగానే గడచిపోయాయి.

ఓ శుభముహూర్తాన స్నేహితులందరం అనుకోకుండా కలుసుకోవడం జరిగింది.

వాళ్ళు నాతో 'కోటప్పకొండ తిరుణాలకు వెడుతున్నాం. వస్తావా' అని అడిగారు.

మునుపటిలాగా నా చేత బలవంతంగా మందు తాగించనంటే వస్తానని కండిషన్ పెట్టాను.

'భలేవాడివే రాందాసు. దేవుడి దగ్గరకు వెడుతున్నపుడెవరైనా మందు తాగి వెడతారా! అలాంటి భయాలేమీ పెట్టుకోకుండా మాతో బాటూ కోటప్పకొండకురా. అక్కడ తిరుణాల చాలా బాగా జరుపుతారట. దేవుడి దర్శనం చేసుకుని తిరుణాల చూసుకొని వచ్చేద్దాం'.

'సరే!' అన్నాను.

మరుసటి రోజు మిత్రులతో కలసి కోటప్పకొండ తిరుణాలకు వెళ్ళాను. అక్కడ దేవుని దర్శనం చేసుకుని తిరుణాలలో ఉదయం నుండీ సాయంకాలం అయిదింటి దాకా కాళ్ళరిగేలా తిరుగుతూ సరదాగా గడిపాం. సాయంకాలం ఆరు గంటలప్పుడు వారితో బాటు నన్ను కూడా ఓ వీధిలోకి తీసుకెళ్ళారు. ఆ పరిసరాలను చూడగానే నాకు అర్ధం అయింది. నేను వాళ్ళతో "మీరు వెళ్ళండి.. నేను రాను. దయచేసి నా మానాన నన్ను వదిలేయండీ' అని ఎంతగానో బతిమాలుకున్నాను.

'అదేం కుదరదు. మాతో బాటు నువ్వు కూడా ఎంజాయ్ చెయ్యల్సిందే' అని మిత్రులందరూ కలసి నన్నొక గదిలోకి బలవంతంగా తోసేసారు.

ఓ అమ్మాయి ముఖంలోకి సూటిగా చూడటం నాకదే మొదటిసారి. చూడ చక్కని అందం. చారడేసి కళ్ళు, గుండ్రటి ముఖం, కోటేరులాంటి ముక్కు, చక్కటి పలువరుస, తీగలాంటి సన్నని నడుము, పొడవాటి వాలుజడతో ఎవరినైనా ఆకర్షించుకునేంతటి అందం.

స్త్రీ స్పర్శ తగలడం నాకదే మొదటిసారి. ఆ అమ్మాయే చొరవ తీసుకుని నాకు సుఖానుభూతి ఎలాగుంటుందో తెలిసొచ్చేలా చేసింది. అప్పుడనుకున్నాను. ఈ అమ్మయిని ఎలాగైనా ఆ నరకకూపంలోంచి బయటపడేయాలనే దృఢ నిర్ణయాన్ని తీసుకున్నాను. 'మీరంగీకరిస్తే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను' అన్నాను కాస్తంత బిడియపడుతూ.

నా మాటలు విన్న ఆ అమ్మాయి పగలబడి నవ్వుతూ 'నా దగ్గరకొచ్చినవాళ్ళు ఎవరు మీలా మాట్లాడలేదు సరికదా, ఒప్పందం చేసుకున్నట్లుగా శారీరక సుఖాన్ని పొందినందుకు నా ముఖాన డబ్బు పారేసి వారి మానాన వారు వెళ్ళిపోయారే గానీ, మీలా ఆత్మీయతతో నిండిన మాటలు మాట్లాడిన వారు లేరు. మీరెవరో చాలా మంచివారులా ఉన్నారు. ఒకవేళ మీరు నన్ను పెళ్ళిచేసుకున్నారనుకోండి.. మీ ఇంట్లో నుంచి మిమ్మల్ని బయటికి గెంటేస్తారు. సమాజంలో నుంచీ మీరు వెలివేయబడతారు. సమాజంలో మీకున్న

గౌరవాన్ని కోల్పోయి అవమానాల పాలవుతారు. వీటన్నింటినీ మించి ప్రస్తుత సభ్య సమాజంలో ఓ వేశ్యను పెళ్ళిచేసుకోవడమన్న దాన్ని ఎవ్వరూ హర్షించరు. అనవసరంగా నా మూలంగా మీరు మీ జీవితంలో కష్టాల్ని, అవమానాల్ని కొనితెచ్చుకున్నవారవుతారు. అది నాకిష్టం లేదు. కాబట్టి దయచేసి నా మాట విని అందరిలాగే మీరు కూడా మీ సుఖం చూసుకుని, నాకివ్వాల్సిన డబ్బులిచ్చి ఇక్కడి నుండీ వెళ్ళిపోండి!' అని అన్నది.

'అదేమిటంటే మీరు నాకు నచ్చారు. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. మీ గతం తాలూకు విషయాలు నాకనవసరం. ఈ నరకకూపంలోంచి మిమ్మల్ని బయటపడేసి మీ జీవితంలో వెలుగురేఖల్ని నింపాలని, అందరిలాగా మీరు కూడా గృహస్థు జీవితాన్ని గడపాలని, నేనీ నిర్ణయం తీసుకున్నాను. ఇప్పుడున్న ఈ కుళ్ళు సమాజం తోటి నాకు పని లేదు. ఎవరేమనుకున్నా నాకభ్యంతరం లేదు. ఈ కారణంగా సమాజంలో నాకెదురయ్యే కష్టాలనన్నింటినీ నేను భరించడానికి సిద్ధపడే ఈ మాటలంటున్నాను. దయచేసి నా కోరికను కాదనకండి' అని చెప్పడంతో ఆ అమ్మాయి నన్ను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకుంది.

ఓ గుళ్ళో పెళ్ళి చేసుకుని సరాసరి ఇంటికెళ్ళాను. నేను చేసిన నిర్వాకానికి ఇంట్లో వాళ్ళు నన్ను ఇంట్లోకి రానీయలేదు సరికదా.. ఇంటి గుమ్మంలోంచే తరిమేశారు. 'జరిగిందంతా మన మంచికే' అనుకుని అదే వూళ్ళోనే వేరు కాపురం పెట్టాను. అందుకు నా స్నేహితులు, మా మేనమామ సహకరించారు.

నాకు పెళ్ళైన ఓ రెండు సంవత్సరాలకు అమ్మాయి పుట్టింది. అమ్మాయి పుట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని నా మేనమామ నాకో పది వేల రూపాయల ఆర్థిక సహాయం చెయ్యడంతో తెనాలిలోనే ఓ టైలరింగ్ షాపు పెట్టాను. అది మంచి సెంటరవడంతో షాపు బాగా జరిగేది. నా జీవనోపాధితో పాటూ మరో నలుగురికి జీవనోపాధి కల్పించాను.

జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా జీవితం సాఫీగా జరిగిపోతున్న సందర్భంలో ఓ హఠాత్సంఘటన జరిగింది. నా భార్య మరో అమ్మాయికి జన్మనిచ్చి తను ఆ భగవంతుడి దగ్గరకు వెళ్ళిపోయింది. తర్వాత నాకు నా భార్య జ్ఞాపకానికి వచ్చినపుడల్లా మందు తాగడమన్నదో అలవాటుగా మారిపోయింది.

ఏదిఏమైనా పిల్లలిద్దర్నీ ఎలాంటి లోటు లేకుండా పెంచి పెద్దచేశాను. పెద్దమ్మాయికి పెళ్ళీడు రావడంతో ఓ ఉద్యోగస్తుడికిచ్చి పెళ్ళి చేశాను. పెద్దమ్మాయి పెళ్ళైపోయిన తర్వాత తెనాలిలో ఉండటం ఇష్టం లేక అక్కడున్న టైలరింగ్ షాపును నా ఆప్తమిత్రుడికిచ్చేసి ఊళ్ళు తిరగడం అలవాటు చేసుకున్నాను. అందులో భాగంగానే హైదరాబాదు, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, గూడూరు లాంటి ఊళ్ళల్లో వున్న టైలరింగ్ షాపుల్లో పనిచెయ్యడానికి కుదురుకునేవాణ్ణి. ఆ విధంగా పనిచేయగా వచ్చిన డబ్బులో నాకు కావలసినంత డబ్బులు నా దగ్గరుంచుకుని మిగిలినవి హాస్టల్లో చదువుకుంటున్న రెండో అమ్మాయికి పంపిస్తున్నాను! అది నా సంగతి!" అంటూ ముగించాడు.

***

"తిరుపతికొచ్చి ఎన్నేళ్ళైంది?" అని అడిగాను.

"రెండేళ్ళైంది. ఇక వూళ్ళు తిరగను."

"ఏం... ఎందుకని?"

"వేంకటేశ్వరుని పాదాల చెంత నా తనువు చాలించాలన్నది నా చివరి కోరిక. అది నెరవేరుతుందో లేదో చూడాలి. అదే గనుక నెరవేరితే నా జన్మ ధన్యం" అని అన్నాడు.

ఇంతలో మురళి బజారు నుండి షాపుకు రావడంతో రాందాసు వర్తమానంలోకి వచ్చి, పనిలో మునిగిపోయాడు.

మురళి నన్ను చూడగానే నా క్షేమ సమాచారాలడిగాడు. అటు తర్వాత నేను కుట్టడానికిచ్చిన ప్యాంటు, చొక్కా ఇచ్చాడు. వాటిని తీసుకున్నాను. ఇంతలో మురళి స్నేహితులు కొంతమంది షాపుకొచ్చి మురళితో "నీతో బాటు రాందాసుని కూడా వెంటబెట్టుకుని పార్టీకి రా. వచ్చే ఆదివారమే పార్టీ" అని అన్నారు.

"అలాగే" అని మురళీ తన పనిలో నిమగ్నమైపోయాడు. నేనక్కడి నుండి నా చొక్కా, ప్యాంటు తీసుకుని ఇంటిముఖం పట్టాను.

పదిరోజులు తర్వాత పండగకి బట్టలు కుట్టించుకోడానికి మళ్ళీ ఆ షాపుకి వెళ్ళాను. రాందాస్ కనబడలేదు.

"ఆ రాజు ఏదో పార్టి అన్నారు.. తర్వాత రాందాసు మందు మానలేదా?" నవ్వుతూ మురళిని అడిగాను.

మురళి మౌనంగా ఉండిపోయాడు.

"ఏదో సరదాగా అన్నాను. రాందాసు రాలేదా?" అంటూ అడిగాను.

"లేదు సార్..." అంటూ మురళి జరిగింది చెప్పుకుపోయాడు.

'ఆ రోజు అతను వస్తానన్న టైముకు రాలేదండి. నేను ఒక్కడ్నే వెళ్ళిపోయాను. మర్నాడు షాపుకు వచ్చి, పార్టీకి అతడ్ని తీసుకువెళ్ల లేదని కొంచెం నిష్టురంగానే మాట్లాడాడు. కాని అక్కడకొచ్చి అతను చికెన్ తినాలన్నా కోరిక మాత్రమే ఉందని అన్నప్పుడు, నేను మా ఇంటికి తీసుకెళ్ళి, మా ఇంట్లో అతనికి కావలసినవన్నీ వండించి పెట్టాను. మర్నాడు ఉదయాన్నే మా ఇంటికి వచ్చి 'గొంతుకలో ఏదో ఇరుక్కుపోయిందని, నొప్పితో రాత్రి అంత నిద్ర పట్టలేదని' చెప్పాడు. వెంటనే ఆసుపత్రికి వెళ్దామంటే 'వద్దు, ఓ ఏభై రూపాయలు ఇస్తే, మందు తాగి పడుకుంటే అదే తగ్గిపోతుందని' అన్నాడు. సరే అని ఇచ్చాను. అతను మందు తాగి పడుకున్నా, ఆ నొప్పి తగ్గలేదు. మళ్ళీ నా దగ్గరకి వస్తే, ఆసుపత్రికి తీసుకుని వెళ్ళాను. వాళ్ళు టెస్టులు చేసి, గొంతుకలో ఏదో ముల్లు అడ్డంగా గుచ్చుకుంది, వెంటనే ఆపరేషన్ చెయ్యాలని, అడ్మిట్ చేసేసారు. ఆ సాయంత్రం ఆపరేషన్ చేస్తామని చెప్పారు. నేను ఇంటికి వచ్చి, సాయంత్రం మళ్ళీ ఆసుపత్రికి వెళ్లేసరికి, రాందాస్ పారిపోయాడని వాళ్ళు చెప్పాడు. వెంటనే ఊరంతా వెతికాను. ఎక్కడ కనబడలేదు. తిరిగి షాపు దగ్గరకొచ్చేసరికి, అతను అక్కడ ఉన్నాడు. 'నాకు ఆపరేషన్ అంటే భయం.. అందుకే

పారిపోయాను. నాకు ఓ వంద రూపాయలు ఇస్తే, మా తెనాలి వెళ్ళిపోతాను' అని అడిగాడు. అతడ్ని రైల్వే స్టేషన్ కి తీసుకువెళ్ళి, తెనాలికి టికెట్ తీసి ఇచ్చి, ఇడ్లీ పార్సిల్ చేసి ఇద్దామని అక్కడ కాంటీన్ కి వెళ్ళాను. నేను తిరిగి వచ్చేసరికి, రాందాస్ ప్లాటుఫారం మీదా నిర్జీవంగా పడిఉన్నాడు. చుట్టూ జనం పోగయ్యారు. రైల్వే వాళ్ళకి కబురు చేస్తే, డాక్టర్ వచ్చి, అతను చనిపోయాడని చెప్పాడు!"

మురళి మాటలు వింటూనే నిస్తేజంగా నిలబడిపోయాను.

"అయ్యో పాపం! ఎంత ఘోరం జరిగిపోయింది. చిట్ట చివరకు రాందాసు మరణం తను అనుకున్నట్లుగానే జరిగిందన్నమాట" అని అన్నాను.

నా మాటలు విన్న మురళి "ఏం అనుకున్నాడు? ఏం జరిగింది?" అంటూ అడిగాడు.

"నాకు పరిచయమైన రోజు, ఆయన గురించి అంతా చెప్పి, 'ఇక ఊళ్ళు తిరగను సార్. ఇదే చివరి మజిలీ! ఆ వేంకటేశ్వర స్వామి పాదాల చెంత తనువు చాలించాలన్నది నా చివరి కోరిక. అదే గనుక నెరవేరితే నా జన్మ ధన్యం' అని అన్నాడు!" అంటూ అప్రయత్నంగా నా చేతులు జోడింపబడ్డాయి .. ఎదురుగా ఖాళీగా ఉన్న రాందాసు కుట్టు మిషన్ని చూస్తూ...!

***0***



# ఇది అంతే

**పి.ఎల్.ఎన్. మంగారత్నం**

సంవత్సరం క్రిందట ..

మేము ఉన్న అపార్టుమెంటులోనే మరో ఫ్లాటు అమ్మకానికి వస్తే, అద్దెలకు ఇచ్చే నిమిత్తం.,, అది కొన్నాను. కొన్నాళ్ళు.. అద్దె ఇంట్లో ఉంటున్న కొడుకూ, కోడలూ వచ్చి ఉన్నారు. అబ్బాయి డాక్టరు. ఇక్కడ కన్నా హైదరాబాదులో సంపాదన బాగుంటుందని మొన్ననే హైదరాబాదు వెళ్ళిపోయారు. 'ఉన్న ఊరిలో బ్రతకడానికి యాభై వేలు చాలవా?' అన్నా వినలేదు.

అలా ఖాళీ అయిన ఇల్లు శుభ్రం చేయించి .. అద్దెకు ఇవ్వాలని, మా ఇంటి పనిమనిషి వెంకటమ్మని, ఇల్లు శుభ్రం చేసి, కడిగించడం కోసం.. ఆ ఫ్లాటుకి తీసుకుని వెళ్ళాను. అసలు పని కాకుండా, వేరే ఏ పని చెప్పినా అంతకు తగ్గ డబ్బు వెంటనే ఇచ్చేస్తుంటాను. అందుకే, ఏ పని చెప్పినా కాదనదు.

పేకర్స్ అండ్ మూవర్స్ వాళ్ళు సామాన్లు తీసుకుని థర్మాకోల్ అట్టలూ, పాత కాగితాలూ, ప్లాస్టిక్ బాటిల్స్, పాలోథిన్ పేపర్లూ లాంటి అక్కర లేని వస్తువులు వదిలేసి పోవడంతో ఇల్లంతా చిందరవందరగా ఉంది. నేను కప్ బోర్డ్స్ లో వేసిన కాగితాలు తీసేస్తుంటే, వెంకటమ్మ పనికొచ్చే వస్తువులు అన్నీ జాగ్రత్త చేస్తోంది. ఒక అరలో నల్లటి పూరేకుల్లో 'తెల్ల రాళ్లు' అమర్చిన చెవి దిద్దు ఒకటి దొరికింది. అది మాములుదే అయినా చూడడానికి బాగుంది. "మీ కోడలుగారు ఇలాంటివి కూడా వాడతారేంటండీ" అంటూ చూపించింది.

"మేమైతే బంగారాలు కొనాలి. వాళ్ళయితే, వాళ్ళ ఇష్టం!" అంటూ వెంకటమ్మ వైపు చేశాను.

"అయినా ఒకటే ఉందిలెండి" అంది దాన్ని అలమరలోనే వదిలేస్తూ. దాన్లో తెల్లటి రాళ్లు బాగా మెరుస్తున్నాయి. వస్తువు ఖరీదైనదే అన్నట్లు.

"ఒకటే ఉంటే ఏం చేస్తాంలే పడెయ్యి" అన్నా, ఒకటే ఉండడంతో కోడలు వదిలేసి ఉంటుందని.

అంతలో "ఆ రెండోది కూడా దొరికిందిలెండి" అంటూ శుభ్రం చేసిన అరలో ఓ ప్రక్కగా పెట్టేసింది. నెమ్మదిగా నేనూ పనిలో పడిపోయాను.

కాస్సేపటికి ..

ప్రక్క గది తుడుస్తూ "గాజులు వదిలేసారండీ. మీ కన్నా చిన్న 'ఆది' .. మా అమ్మాయికైతే సరి పోతాయి" అనడంతో నేనేం మాట్లాడలేదు. ఎవరికీ అవసరం లేని వస్తువులు పనిమనిషి పట్టుకెళితే ఏమిటని.

మౌనం అర్థ అంగీకారం కాబట్టి, అక్కడే దొరికిన ఖాళీ సంచీలో వేసుకుంది.

అలాగే, పడేసేవి పడేస్తునే, బాగున్నవి తీసి జాగ్రత్త చేస్తుంది. అన్ని గదుల్లోని చెత్తనీ ఊడ్చుకొస్తే, మధ్య హాలులో పెద్ద కుప్ప తయారయ్యింది. వాటిని సంచుల్లోకి ఎత్తుతూ "నేను ఇల్లు కడిగి వచ్చేస్తే సరి పోతుంది అనుకున్నానండీ!" అంది పని ఎక్కువగా ఉండిపోయింది అన్నట్లు.

ఏం మాట్లాడలేకపోయాను.

నేనూ అంత కష్టాన్ని ఊహించలేదు. ఎవరినో అయితే, తిట్టుకునేదాన్నేమో! ఇప్పుడు వదిలేసింది కొడుకు. వెళ్ళేటపుడు కోడలు కాసిన్ని కబుర్లు చెప్పి వెళ్ళిందే గాని, వదిలేస్తున్న ఇంటిని గురించి ఆలోచించనే లేదు. నేను అసలే ఓపిక లేకుండా ఉన్నాను. ఇల్లు ఖాళీ అయి అప్పటికే వారం రోజులు అయింది. ఎవరికి తప్పినా నాకు తప్పదని లేచి రావడం. చాలా సంవత్సరాలుగా కీళ్ళ నొప్పులు ఉన్నాయి. అయినప్పటికీ ఎలాగో ఓపిక తెచ్చుకుని చేయిస్తున్నాను.

వెంకటమ్మకి డబ్బులు ఇస్తున్నా, నేను ఖాళీగా కూర్చోకుండా, పని తొందరగా తెమలాలని, నాకు వీలైన పని చేస్తున్నాను.

నీళ్ళ బకెట్టు మొయ్యలేను కాబట్టి, మగ్గుతో నీళ్ళు తీసుకుని ఇంటి చుట్టూరా ఉన్న బాల్కనీ అంతా తడిపి, పేరుకున్న మట్టిని మెత్తబరుస్తున్నాను. నాలుగు నెలలుగా ఇంట్లో ఎవరు లేకపోవడంతో బాల్కనీ అంతా దుమ్ము పేరుకు పోయి, అడుగేస్తే అంటుకుపోతుంది. వెంకటమ్మకు సహాయం చేసే దిశగా, పంపు దగ్గరకు వచ్చి మగ్గుతో నీళ్ళు పట్టుకుని వెళ్ళడం, ఉన్న తడికి టైల్స్ మీద కాళ్ళు జారిపోతాయేమోనని చూసుకుని చూసుకుని నడవాల్సిరావడం నన్ను ఇబ్బందిపెడుతునే ఉంది.

అప్పటికి పని మొదలు పెట్టి గంట.

కిటికీ తలుపులు తెరుస్తుంటే తీగల్లా సాగుతున్నాయి బూజులు. మూలల్లోకి సన్నటి సాలీడులూ స్థానం ఏర్పరచుకున్నాయి. నా కళ్ళబడితే తీసిపడేస్తున్నాను. వెంకటమ్మ తుడుపు పూర్తి చేసి, గదుల్లో నీళ్ళు పోసి కడగడం మొదలుపెట్టింది. గది రంధ్రాల్లోంచి నీళ్ళు బయటకిపోకుండా వెనక్కి వచ్చేస్తున్నాయి. రంధ్రాలు ఎత్తూ, గదులు పల్లంగా ఉన్నాయి. అలాంటి చోట గడపల మీద నుంచి నెట్టేస్తూ పని కానిస్తుంది. నేనూ ప్రక్కప్రక్కల్నే ఉంటూ ఆమెకు సహాయంగా ఉన్నా నీరసం ముంచుకొస్తుంది. ఆ పనినీ, ఆ కష్టాన్నీ చూసి ఇప్పుడు వెంకటమ్మకి ఎంత ఇవ్వాలో కదా.. అనుకున్నాను.

ఒకప్పుడు ఇల్లు కడిగించి వంద రూపాయలు ఇచ్చేదాన్ని. ఆ వందల్లా .. రెండు వందలూ, ఆ తరువాత మూడు వందలు చేసాను. ఇప్పుడు ఈ కష్టం చూస్తే, అయిదు వందలు ఇచ్చినా తక్కువే అనిపించింది.

అలా అని అయిదు వందలు చేసేస్తే, నా ఇల్లు కడిగించుకునేటపుడు ప్రతిసారీ అంతంత ఇవ్వలేను కదా! ఇప్పటికే అపార్టుమెంటులో అందరి కన్నా ఎక్కువ జీతమే ఇస్తున్నాను. పండుగల్ని దృష్టిలో పెట్టుకుని, ఆరు నెలలకోసారి చీర కొనుక్కోమని, డబ్బులూ ఇస్తూ ఉంటాను. డబ్బుకి ఆశపడి అయినా మానకుండా వస్తుందని...! అలాగే చేస్తుంది కూడా. ఇవ్వగలగాలి గానీ, పుచ్చుకోవడానికి బాధేమిటి? ఎవరైనా ఈ రోజు కన్నా రేపటి రోజున ఎక్కువ సంపాదించాలనే అనుకుంటారు.

పని పూర్తి అవుతున్నా నా ఆలోచనలు ఓ కొలిక్కి రావడం లేదు. చివరికి పని ముగించి ఇంటికి తాళం పెడుతుంటే, ఖాళీ బాటిళ్ళు ఉన్న సంచీ ఒకటి నా చేతికి అందించి, తనూ మరొకటి జాగ్రత్త చేసుకుంది. నిముషాలు క్షణాల్లోకి దొర్లిపోతున్నా, వెంకటమ్మకి ఇవ్వాల్సిన డబ్బు గురించి తర్జనభర్జన పడుతూనే ఉన్నా! ఎప్పటిలా మూడువందలే ఇస్తే బాధ పడవచ్చు. ఎక్కువ ఇస్తే సంతోషపడినా, తరువాతకి అదే ఖాయం అనుకోవచ్చు. ఊగిసలాడుతుంది మనసు. మేము ఉండే బ్లాకులో లిఫ్ట్ దగ్గరకి వచ్చాం. నాకు అప్పటికే ప్రాణం దిగలాగుతుంది. నీరసంగా నిస్త్రాణగా తయారయ్యాను. వెంకటమ్మకి కష్టం అలవాటే కాబట్టి, బాగానేవుంది.

నాతోపాటు వెంకటమ్మా మా ఇంటికి వస్తే, తిరిగి వెళ్ళేటపుడు ఓ అయిదు వందలనోటే చేతిలో పెట్టాలి 'కాస్త ఎక్కువ కష్టపడ్డావ్' అంటూ. అప్పుడు ముందుముందు ఎంత ఇచ్చినా ఫర్వాలేదు అనుకుంటూ ఓ నిర్ణయానికి వచ్చాను. అయితే, తన చేతిలో ఉన్న సంచీ గురించి ఆరా తీస్తానని అనుకుందో.. ఏమో! "నేను మళ్ళీ పైకి రావడం ఎందుకండీ?" అంటూ వెంట తీసుకెళ్ళిన బకెట్టూ, ఇంకా కొన్ని సామాన్లూ లిఫ్టులో పెట్టేసి, నన్నూ ఎక్కించింది. రేపొచ్చి తీసుకున్నా... తన డబ్బులు ఎక్కడికీ పోవన్న నిశ్చింతతో.

***

ఇంటికి వెళ్ళి భోజనం చేసి పడుకున్న తరువాత .. నా ఆలోచనలలో చాలా మార్పే వచ్చేసింది. పుచ్చుకునే వాడికి ఇచ్చే వాడు లోకువట. అది కొత్తగా వింటున్న సామెత అయినా నిజమే అనిపించింది.

ఆలోచిస్తే ..

ఆ నెలలో వెంకటమ్మ పెద్ద పండుగ 'సంక్రాంతి' నాడు పనికి రాలేదు. ఇన్ని సంవత్సరాలూ అలా లేదు. అందరూ మానేసినా తను మాత్రం పనికి వచ్చేది. ఇన్నాళ్ళూ నేను సర్వీసులో ఉండడంతో, ఆ శెలవు రోజునే ఏమైనా పండుగ పిండి వంటలు చెయ్యడం జరిగేది కాబట్టి, తప్పనిసరిగా సాయంత్రాలూ వచ్చేది. ఇప్పుడు ఓపిక తగ్గి చేస్తున్నదీ తక్కువ కావడంతో, తనూ శెలవు తీసుకుంటుంది.

అలాగే, తల్లిని చూడడం కోసం అంటూ పుట్టింటికి అనకాపల్లి వెళ్లి అయిదు రోజులూ, ఇంటి దగ్గర మరెవరికో బాగోలేదంటూ మరో రోజూ .. మొత్తం వారం రోజులు పని మానెయ్యడం గుర్తుకొచ్చింది.

ఓపిక లేకపోయినా, మరో సహాయం లేక, చచ్చినట్లు చేసుకుంటున్నాను.

కరోనా అనీ, లక్డౌన్ అనీ, ఎన్ని రోజులు మానేసినా ఎప్పుడూ ఓ రూపాయి తగ్గించలేదు.  కాబట్టే, ఆ విచ్చలవిడితనం.

రిటైరు అయ్యి ఇంట్లో కూర్చుని, ఆ మాత్రం పనే చేసుకోలేదా..  అన్న ఆలోచన ఉందేమో!

అందుకే, ఆ మరునాడు, నెల జీతంతో పాటు మరో మూడువందలు కలిపి ఇస్తూ చెప్పాను “ఇవి నిన్న ఆ ఇల్లు కడిగినందుకు!“

‘సరే’ తలూపింది .. నా దిగులు తీరేలా!

నా దగ్గర డబ్బు ఉంటే మాత్రం, దేనికి ఎంత ఇవ్వాలో అంతే ఇవ్వాలి.

ఉన్నవాడి  దగ్గర డబ్బులున్నాయి కదా అని ఉప్పుకి ఎంత ఇవ్వాలో, బియ్యానికి ఎంత ఇవ్వాలో అంతే ఇచ్చి కొంటాడు గానీ .. ఎక్కువ ఇచ్చి కొంటాడా?

ఇదీ అంతే అనిపించింది!!

***0***



# దొంగ

బాలగంగాధర తిలక్

మసక మసకగా ఉంది వెన్నెల. చెట్లకింద ఉన్న చీకటి లోంచి నడుస్తున్నాడు గోపాలం. మోకాళ్ళపైకి ఎగకట్టిన పంచ కట్టూ, ఛాతీకి బిగుతుగా అంటుకుని పోయిన బనీనూ, మొలలో చిన్న కత్తీ .. ఆత్మవిశ్వాసంతో ధైర్యంతో ఉన్నాడు గోపాలం. మధ్య మధ్య త్రేణుపులు వస్తున్నాయి పుల్ల పుల్లగా. ఒకే ఒక గ్లాసుడు నాటు సారా పుచ్చుకున్నాడు బలానికీ, హుషారుకీ. చదువు రాని వాడైనా, ప్రతీదీ ఒక ప్లాను ప్రకారం నడవాలి గోపాలానికి. ఏ పని చేసినా ముందూ వెనకా చూసి ఆలోచించి బేరీజు వేసే అలవాటు వుంది అతనికి. ఒక స్వాభావికమైన వివేకం ఉంది. అందుకే రత్తయ్యా, సోములూ ఎంతో నమ్మకం ఉంచి అతని మీద ఈ బాధ్యత వేశారు. వాళ్ళిద్దరూ లేకుండా ఉంటే, పనులు సవ్యంగా జరుగుతాయి. వాళ్ళిద్దరికీ నిదానం లేదు. వుత్త కంగారు, వుత్తి ఆశ తప్ప.

రాత్రి ఒంటిగంట దాటితే కాని ఆవిడ మొగుడింటికి రాడు. రెండు వారాలు పరిశీలనగా చూసి ఈ విషయం గ్రహించాడు. ఆ క్లబ్ లో కూర్చుని ఖరీదైన మందు తాగుతూ పేకాడుతూ డబ్బయిపోయేవరకూ అక్కడే ఉంటాడు. ఈలోగా అతని భార్య ఒంటరిగా ఇంట్లో వంట గదికి పక్కగా వున్న గదిలో పడుకుని నిద్రపోతుంది. వంట గదికి దొడ్లో నుంచి వెళ్ళాలి. దొడ్డి చాలా పెద్దది. ఎన్నో మొక్కలూ, చెట్లూ ఉన్నాయి. వాటి నీడలో తను కనిపించడు. మరీ మంచిది. వంటగది కిటికీ వానకి తడిసి, ఎండకి ఎండి, కమ్ములు పట్టుతప్పి ఉన్నాయి. బలంగా తెలివిగా పనిచేస్తే మూడు నాలుగు ఊచల్ని తీసెయ్యవచ్చును. ఇంక ఒకసారి వంటగదిలో ప్రవేశించాక పని చాలా సులభం. తాను ఆవతల గది తలుపు కొడతాడు మెల్లగా. ఆవిడ ఏ ఎలకూ పిల్లో అనుకుని తలుపు తీస్తుంది. అంతే. తాను కత్తి చూపించి భయపెడతాడు. మెళ్ళో ఉన్న నాలుగు పేటల గొలుసు వొడుపుగా, తాపీగా తీసుకుంటాడు. ఆమె తెప్పరిల్లే లోపల, కేకవేసే లోపల తోటలోకి చీకట్లోకి అదృశ్యుడైపోతాడు.

గోపాలం ఇలాగ తన ప్లానంతా ఆలోచించుకుంటూ నిబ్బరంగా నడుస్తున్నాడు. రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి .. అక్కడక్కడ ఒకరిద్దరు రాత్రించరుల్ని తప్పించి. ఊరికి దూరంగా ఉన్న కొత్త పేట ఇది. ఊళ్ళో ఉన్న జనసంచారమూ, అలజడీ ఇక్కడ వుండవు. మొదటి ఆట అయిపోగానే మొగలో వున్న కిళ్ళీకొట్లూ, చిన్న కాఫీ హోటలూ మూసేస్తారు. చాలా ఇళ్లు నిద్రలో మునిగిపోయాయి. కొన్ని ఇళ్లలోంచి మాత్రం విద్యుద్దీపకాంతి కిటికీలలోంచి వస్తోంది. మొత్తమ్మీద వీధులూ, యిళ్ళూ ఆ మసక వెన్నెలలో ఒంటరిగా గోపాలం కోసం ఎదురుచూస్తున్నట్లు ఉన్నాయి.

గోపాలానికి తను చేసే పనిమీద నైతిక సందేహాలు ఏమీ లేవు. దొంగతనం తప్పనీ, పాపమనీ అతడు అనుకోలేదు. ఎందరో తమ తమ అవసరాలకి ఎన్నో వృత్తులూ ఉద్యోగాలు చేసినట్టుగా అతనూ ఇది చేస్తూన్నాడే తప్ప మంచి చెడ్డల సూక్ష్మ విచారణ చేసే పిరికితనం కాని, అసలటువంటి ఆలోచనలకి అవసరం కాని అతనికి కనిపించలేదు. అందువలన అతనికి అంతరాత్మని నొక్కివేయడమూ, ఒప్పించడమూలాంటి బాధలు కలగలేదు. తన పనిలో దొరికిపోతే జైలుకి వెళ్లాలన్న భయమూ, జ్ఞానమూ వున్నాయి అతనికి. అందుకే జాగ్రత్తగా ప్లాను వేసుకుంటాడు. ఎంతో అవసరమైతే కానీ రత్తయ్యనీ సోములీన్నీ వెంట తీసుకుని వెళ్లడు. వాళ్ళిప్పుడు తన కోసం ఆశగా ఎదురుచూస్తూంటారన్న ఆలోచన అతనికి మరింత ఉత్సాహాన్ని యిచ్చింది.

ఆ యిల్లు మసక వెన్నెల్లో ముడుచుకున్న తాబేలులా ఉంది. ప్లాను ప్రకారం ఇంటి వెనక్కి వెళ్లి దొడ్లోకి ప్రవేశించాడు. అరటి చెట్లూ కొబ్బరి చెట్లూ మొక్కలూ తుప్పలూ అంతా గలీజుగా చీకటిగా ఉంది. నెమ్మదిగా నడిచి వంటగది దగ్గరకు వచ్చాడు గోపాలం. కిటికీ ఊచల్ని ఒకసారి లాగి చూశాడు. ఇంతలో అతనికి లోపల్నించి మాటలు వినిపించాయి. అతనికి ఆశ్చర్యం కలిగింది. అతని పథకం అప్పుడే దెబ్బ తిన్నట్టనిపించింది. ఈసారి మాటలు కొంచెం గట్టిగా కోపంగా వినవచ్చాయి. గోపాలానికి కుతూహలం కలిగింది. బహుశా ఆ వచ్చిన వాళ్ళెవరైనా మళ్లీ వెళ్ళిపోవచ్చును, తన మార్గం నిరాటంకమవవచ్చును అని కూడా అనిపించింది. ఒకవేళ ఎవరైనా ప్రియుడేమో - మొగుడు లేకుండా చూసి ప్రేమ కలాపం జరుపుతోందేమో అని ఊహ తట్టింది. మాటలు తొందరగా గట్టిగా వినబడుతున్నాయి. ఆవిడ గొంతులో ఏదో భయం, బాధా వున్నాయి. అతని కుతూహలం హెచ్చింది. బలంగా వూచల్ని లాగి కదిపి ఊడదీశాడు. నేర్పుగా ఏర్పడిన జాగాలోంచి వంటింట్లోకి ప్రవేశించాడు. పక్క గదిలోనుండి మాటలు వినపడుతున్నాయి.

'వద్దండీ .. నామాట వినండి' ఆవిడ గొంతు.

'ఇస్తావా .. తగలనియ్యనా' మగ గొంతు.

'ఎందుకు జూదమాడి తగలేస్తారు చెప్పండి. కాపరానికొచ్చిన నాటినుండి సరదా లేదు. సుఖం లేదు. ఉన్న ఆస్తంతా తగలేశారు. చాలదా!'

'వెధవ లెక్చరివ్వక మర్యాదగా తీసి ఇలా యియ్యి. లేకపోతే ..'

'ఈ ఉన్న వొక్క గొలుసూ యిస్తే నా గతి ఏం కాను. బాబు గతి ఏం కాను? చూడండి వాణ్ణి .. కన్న కొడుకని మీకు దయలేదా జాలిలేదా! ఏమండీ - ఇవాల్టికి ఊరుకోండి. పన్నెండు గంటలవుతోంది. ఒక్కర్తిని బిక్కుబిక్కుమంటూ ఇంట్లో .. రండి, పడుకోండి'

కర్కశంగా వినపడింది ఈసారి ఒక గొంతు .. 'ఇస్తావా - పీక పిసికి చంపెయ్యమన్నావా. వెధవ పీడ వదుల్తుంది'

‘ఇవ్వను’

‘ఇవ్వవా’

ఇవ్వనుగాక ఇవ్వను. ఇది మా పుట్టింటి వారు పెట్టింది. ఇది నా ఆస్తి’

వింటున్న గోపాలానికి ఆవిడ మాటలలో ఏదో న్యాయం గోచరించింది. ఆవిడ గొంతు తియ్యగా సన్నగా జాలిగా ఉంది. గోపాలానికి ఆవిడ మొగుడి మీద కోపం వచ్చింది.

‘నీ ఆస్తా? ఏమిటే పేలావు ముండా .. ఇన్నాళ్ళూ తిన్నది నా డబ్బు కాదూ! తే - ఆ గొలుసు తే’

‘ఏవండీ. ఇలా అన్యాయంగా మాట్లాడతారేమండీ .. నేను మాత్రం మీ కోసం, మీ బాగు కోసం కాదూ చెబుతున్నది. ఈ గొలుసొక్కటే ఇంక మనకి ఆధారం. నాకు పసుపు కుంకుమ కింద మా వాళ్ళు రాసిచ్చిన ఎకరమూ మీరు అమ్మేస్తే ఏమైనా అన్నానా? మీరు తాగుతారు, జూదమాడతారు. మీకు మంచీ చెడ్డా, భార్యా కొడుకూ అన్న విచక్షణ పోయింది. ఈ నరకంలో మగ్గిపోతూ ఉండాల్సిందేనా, మీకాళ్లు పట్టుకుంటాను నా మాట వినండి’

ఛెళ్లుమని చప్పుడు వినిపించింది గోపాలానికి. ఆవిడని మొగుడు కొడుతున్నాడు. గోపాలానికి జాలీ, ఉద్రేకమూ కలిగాయి. దీనంగా మధురంగా గద్గదికంగా ఉన్న ఆమె గొంతు అతన్ని ఆకట్టింది.

‘కొట్టండి, చంపండి. నా గొలుసు మాత్రం ఇవ్వను’

‘ఇవ్వవూ, ఇవ్వవుటే పింజారిముండా’

మళ్ళీ గుద్దినట్టు చప్పుడు. ఆమె ఏడుస్తోంది నిస్సహాయంగా. దీనంగా బాధగా ఆమె ఆక్రోశించింది. ఇద్దరూ పెనుగులాడుతూన్న ధ్వని వినపడింది గోపాలానికి.

‘వదలండి. నన్నొదలండి. అమ్మో’

గోపాలం పిడికిళ్ళు బిగించాడు. అతని కళ్ళల్లో ఎర్ర జీర కదిలింది.

‘పీక పిసికి తీసుకెళ్తాను. గొలుసు ఇలా పడెయ్యి’

‘ఎందుకివ్వాలి మీకు. జూదంలో తగలెయ్యడానికా’ ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూనే మాట్లాడుతోంది. ‘పిల్లవాడికి దగ్గు మందైనా తీసుకురాలేదు. ఒక్క మంచి చీర లేదు. కట్టుకున్న పెళ్ళాం చచ్చిందో బతికి ఉందో చూడరు. ఇంక వీధులమ్మట ముష్టెత్తుకుని బతకాలి నేను’

‘ఈ వేలెడు వెధవ కోసం నాకివ్వవన్న మాట. ఆగు. వీడిని చంపేస్తాను. వీడి పీక నులిమేస్తాను.’

‘అయ్యో అయ్యో వాణ్ణి ఏం చెయ్యకండి. అయ్యో అయ్యో’ ఆవిడ పెద్దపెట్టున కేకలు, పిల్లవాడు కెవ్వుమని ఏడుపు.

గోపాలం యింక ఆగలేకపోయాడు. కుర్రవాణ్ణి పీక నులిమి చంపివేస్తున్న దృశ్యం అతని కళ్ళముందు కదిలింది. బలమంతా ఉపయోగించి తలుపు తన్నాడు. రాలేదు. తిరిగి దడ దడా తన్నాడు. తలుపులు విచ్చుకున్నాయి. ఆమె కుర్రవాణ్ణి ఎత్తుకుని గోడ మూలగా నక్కివుంది. వణికి పోతూ వుంది.

'బాబు నేమీ చెయ్యకండి. వొదలండి. ఇదిగో గొలుసు' అంటూ మీదకి రాక్షసుడిలా వొంగిన అతనికి గొలుసు ఇస్తోంది. మొగుడు గొలుసు తీసుకుని వెనక్కి తిరిగాడు. ఎదురుగా గోపాలం.

'ఎవడురా నువ్వు' అన్నాడు మొగుడు.

గోపాలం బలంగా అతని దవడ మీద ఒకటి వేశాడు. మొగుడు తూలి పడబోయాడు. గోపాలం ఈసారి మీది కురికి అతని తల వంచి బలంగా గుద్దాడు. అతను కిందపడ్డాడు.

'ఆడకూతుర్ని కొడతావా? ఆ గొలుసు కాజెయ్యాలని చూస్తావా? దొంగ యెదవా. సిగ్గు లేదురా నీకు, బుద్ధి లేదురా. ఏది ఆ గొలుసు యిలా ఇయ్యి. లేవకు. లేచావంటే సంపేత్తాను'

గోపాలం అతని చేతిలోంచి గొలుసు లాక్కున్నాడు. అతను కిందపడి వగరుస్తున్నాడు, రొప్పుతున్నాడు. ఆమె ఈ హఠాత్పరిణామం అర్థంకాక నిశ్చేష్టురాలై గోడకి బల్లిలా అంటుకుని కళ్లప్పగించి చూస్తోంది.

'తాగుడూ జూదమూనట్రా నీకు. సదువుకున్నోడివి. ఉద్యోగం చేసి పెళ్ళాం పిల్లల్ని పోషించాల్సింది. పైగా పెళ్ళాం నగలే ఎత్తుకుపోతావట్రా దొంగనాయాల ..'

నేలను కరచుకున్న మొగుడు అస్పష్టంగా బూతులు తిడుతున్నాడు. గోపాలం డొక్కలో ఒకటి తన్ని 'నోర్ముయ్యి' అన్నాడు. ఆమె 'వద్దు వద్దు. కొట్టకు' అని అరిచింది.

గోపాలం చేతిలో గొలుసుతో గోడవారనున్న ఆమెను సమీపించాడు. ఆమె సన్నగా ఎర్రగా నాజూకుగా ఉంది. జుట్టంతా రేగిపోయివుంది. చెక్కిళ్లు కన్నీళ్లతో తడిసిపోయివున్నాయి. పాతికేళ్లయినా ఉండవు. ఆమె కళ్ళలో భయాశ్చర్యాలు పెనవేసుకొన్నాయి. చంకలో పిల్లవాడు ఏడుస్తున్నాడు.

'ఇదిగోనమ్మా గొలుసు' అంటూ ఆమె చేతికి గొలుసు ఇచ్చాడు గోపాలం. కింద దొర్లుతున్న మొగుడు లేవబోయాడు. గోపాలం మొల నుండి కత్తి తీశాడు.

'ఇదేమిటో చూసావా! లేవడానికి ప్రయత్నించావా పొడిచేస్తాను కబడ్దార్. దెబ్బకి యెగిరిపోతావు'

మొగుడు దండం పెట్టాడు.

'నువ్వు మళ్ళీ ఎప్పుడేనా గొలుసు తీసుకున్నట్టు కానీ, ఆవిడ వొంటి మీద దెబ్బపడినట్టుగాని తెలిసిందా నీ ప్రాణం తీసేత్తాను' గోపాలం కత్తిని అతని ముఖానికి దగ్గరగా పెట్టి ఝుళిపించాడు.

మొగుడు తలవూపాడు ఇంకెప్పుడు చెయ్యనన్నట్టుగా.

గోపాలం ఆమె వైపు తిరిగాడు. 'ఏం భయం లేదు. ధైర్యంగా వుండమ్మా' అన్నాడు.

ఆమె భయంతో కృతజ్ఞతతో తల వూపింది.

గోపాలం కత్తి మొలలో పెట్టుకుని వెళ్ళిపోబోయాడు. ఆమె హీనస్వరంతో అడిగింది 'ఎవ్వరు బాబు నువ్వు '

'నేనా .. నేనా' తెల్లబోయాడు గోపాలం.

'నన్ను గోపాలం అంటారులెండి. అంతే' అంటూ గోపాలం తలెత్తకుండా వడివడిగా నడిచి పెరట్లోకి చీకట్లోకి నడిచి వెళ్ళిపోయాడు.

***O***

" జ్యోతి మాసపత్రిక, మార్చి 1964 నుంచి పునర్ముద్రణ"

శ్రావ్య సంచికను SUBSCRIBE చేయడానికి ఇక్కడ నొక్కండి

